ఈనాడు

విజయవాడ 22-3-2018 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 221

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+20 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

కనిష్క్ కుచ్చుటోపీ


భూపేష్

బ్యాంకులకు రూ.వెయ్యి కోట్ల బకాయిల ఎగవేత

- గత ఏడాది మేలోనే దుకాణం సర్దేసి విదేశాలకు పరారైన భూపేష్ కుమార్ జైన్
- ఆభరణాల వ్యాపార సంస్థకు రూ.824 కోట్ల రుణాలిచ్చిన 14 బ్యాంకుల సహ వ్యవస్థ
- ఎస్‌బీఐ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ

దిల్లీ: దేశంలో మరో భారీ ఆర్థిక నేరం! నీరవ్ మోదీ, మెహుల్ ఛోక్సీ, రొటోమాక్ యజమాని విక్రమ్ కోఠారీల మోసాలను తలపించేలా మరో బంగారు ఆభరణాల వ్యాపార సంస్థ మన దేశ బ్యాంకులకు టోకరా వేసింది. సుమారు రూ.వెయ్యి కోట్ల మేర బకాయిలను చెల్లించకుండానే కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ యాజమాన్యం దేశం నుంచి పరారైంది. ప్రస్తుతం వారు మారిషస్‌లో ఉన్నట్లు సమాచారం. సహవ్యవస్థకు నేతృత్వం వహించిన ఎస్‌బీఐ చివరకు కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)ని ఆశ్రయించింది. ఎస్‌బీఐ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సీబీఐ బుధవారం తొలి సమాచార నివేదిక (ఎఫ్ఐఆర్)ను దాఖలు చేయటంతో పాటు నిందితుల నివాసాల్లో సోదాలను ప్రారంభించింది. దర్యాప్తు సంస్థ తన ఎఫ్ఐఆర్‌లో కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్, ఆ సంస్థ ప్రమోటర్ డైరెక్టర్ భూపేష్ కుమార్ జైన్, డైరెక్టర్ నీతా జైన్, తేజ్‌రాజ్ అచ్చా, అజయ్ కుమార్ జైన్, సుమిత్ కేడియా, గుర్తు తెలియని ప్రభుత్వ అధికారులను నిందితులుగా పేర్కొంది. చెన్నైకి చెందిన కనిష్క్ గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ (మిగతా 2లో)

జాతీయ రహదారుల దిగ్బంధం నేడు

- ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహణ
- మద్దతు తెలిపిన తెదేపా, వైకాపా, కాంగ్రెస్, జనసేన, వామపక్షాలు
- వైకాపాతో కలవకుండా ఆందోళనలు చేయాలని తెదేపా శ్రేణులకు ఆదేశం

5లో

కేంద్రానికి భయమెందుకు?

- న్యాయం చేయమంటే బెదిరిస్తారా?
- ఎందుకీ మొండివైఖరి
- ఏ భరోసాతో కఠినంగా వ్యవహరిస్తున్నారు
- అవిశ్వాసం నోటీసును అనుమతించాల్సిందే
- రాష్ట్రానికి అన్యాయంపై తెలుగువారందరిలో అసంతృప్తి
- టెలికాన్ఫరెన్స్, సాధికారమిత్రల సదస్సుల్లో కేంద్రంపై ముఖ్యమంత్రి ఆగ్రహం

"పార్లమెంట్‌లో తెదేపా ప్రవేశపెట్టే అవిశ్వాసంపై ముందుకొచ్చి కేంద్రం వాస్తవాలు చెప్పడానికి ఎందుకు భయపడుతోంది? గొంతెమ్మ కోర్కెలేమైనా అడుగుతున్నామా? అంటే ఆ విషయమైనా చెప్పమంటున్నాం. కేంద్రం న్యాయం చేసే వరకు పోరాడుతూనే లక్ష్యాన్ని ముందుకు తీసుకెళతాం.

వైకాపాది లాలూచీ అవిశ్వాసం. తెదేపాది 5 కోట్ల ప్రజల అవిశ్వాసం. రెండింటికీ ఎంతో తేడా ఉంది.

కొన్ని రాజకీయ పార్టీలు కేంద్రంతో లాలూచీ పడి రాష్ట్రానికి నష్టాన్ని కలిగించేలా వ్యవహరిస్తున్నాయి. కేంద్రం అలాంటి పార్టీలతో కలిసి రాజకీయాలు చేయాలని చూస్తోంది. ఎవరెన్ని చేసినా పోరాటం ఆగదు. రాష్ట్ర ప్రయోజనాల కోసం పొత్తు పెట్టుకుంటే... నాలుగేళ్లలో మీరు చేసిందేమిటి? అవమానం, అన్యాయమే చేశారు. చిన్న పిల్లాడిలా రాష్ట్రాన్ని నాలుగేళ్లు కాపాడుకుంటూ వస్తే సాయం చేయకపోగా... రాజకీయాలు చేస్తారా?."

\- చంద్రబాబు

ఈనాడు – అమరావతి

రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని పార్లమెంట్ సాక్షిగా దేశానికి తెలియజేసే ఉద్దేశంతో అవిశ్వాసం పెడితే కేంద్రం ఎందుకు భయపడుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూటిగా ప్రశ్నించారు. న్యాయం చేయమని అడిగితే బెదిరిస్తారా? విభజన చట్టంలో పేర్కొన్న అంశాలను, ఇచ్చిన హామీలను అమలు చేయాలని అడగడం తప్పా? అని ఆయన కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాస ప్రాంగణంలోని వినతుల స్వీకరణ భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాధికార మిత్రల సదస్సులో, ఉదయం ఎంపీలతో జరిగిన టెలికాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి మాట్లాడారు. లోక్‌సభలో ప్రవేశపెట్టిన (మిగతా 2లో)



50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు రూ.1,000 పింఛను

- జూన్‌లో కృష్ణా డెల్టాకు నీరు
- రుణమాఫీ కింద రూ.15,300 కోట్లు చెల్లించాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

5లో



జపాన్ తరహాలో ఆందోళన.. అభివృద్ధి

- తెలుగువారి ఆత్మగౌరవం, విశ్వాసం కోసం దేవుడ్ని ప్రార్థించా
- దేవాన్ష్ మంచి పౌరుడుగా ఎదగాలని ఆశిస్తున్నా
- మనవడి జన్మదినం సందర్భంగా రూ.26 లక్షల విరాళం
- కుటుంబ సమేతంగా శ్రీవారి సేవలో తరించిన చంద్రబాబు

5లో

తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ నుంచి విరాళానికి సంబంధించిన రశీదు అందుకుంటున్న దేవాన్ష్. చిత్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ దంపతులు

పట్టిసీమపై గరం.. గరం..

- అవకతవకలపై విచారణకు విష్ణుకుమార్‌రాజు డిమాండ్
- నిన్న పొగిడి... నేడు విచారణ కోరడంపై మంత్రుల ఆగ్రహం
- బీజేపీ అంటే భాజపా, జగన్, పవన్ అని ఎద్దేవా

ఈనాడు, అమరావతి: పట్టిసీమ ఎత్తిపోతలపై బుధవారం అసెంబ్లీలో తెదేపా, భాజపా మధ్య వాడివేడి చర్చ జరిగింది. నిర్మాణంలో అవకతవకలపై సీబీఐ విచారణ చేయించాలంటూ భాజపా శాసనసభాపక్ష నేత విష్ణుకుమార్‌రాజు డిమాండ్ చేయడంతో పలువురు మంత్రులు, తెదేపా సభ్యులు భగ్గుమన్నారు. పట్టిసీమతో రైతులకు ఎంతో ప్రయోజనం కలిగిందని విష్ణుకుమార్‌రాజు, భాజపా ప్రతినిధి బృందం కొనియాడిన విషయాన్ని తేదీలతో సహా వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అటువంటిది ఇప్పుడు విచారణకు కోరడం చూస్తే ఒక ప్రణాళిక ప్రకారం ఈ ఆరోపణలు చేస్తున్నట్లుందని విమర్శించారు. 2018-19 బడ్జెట్టు వార్షిక ఆదాయవ్యయ పట్టికపై చర్చ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ రూ.371కోట్లు దుర్వినియోగమయ్యాయని కాగ్ నివేదిక వెల్లడిస్తున్నందున సిట్టింగ్ న్యాయమూర్తితో లేదా సీబీఐతో విచారణ చేయించాలని డిమాండు చేశారు. క్యూబిక్ మీటరు మట్టి తవ్వకానికి రూ.21,353, రవాణాకు రూ.393 చొప్పున ఎస్ఎస్ఆర్ ధరలతో సంబంధం లేకుండా చెల్లించారని, టెండరులో 30 పంపులుగా నిర్ణయించి (మిగతా 2లో)

ఏపీకి చాలా ఇచ్చాం

- ఏ కేంద్ర ప్రభుత్వమూ ఇన్ని నిధులివ్వలేదు
- రాష్ట్ర ప్రజలకు ప్రతి పైసాకూ లెక్క చెబుతాం
- చంద్రబాబు కావాలనే ఎన్డీయే నుంచి బయటకు వెళ్లారు
- అవిశ్వాసానికి భయపడటంలేదు
- టైమ్స్ నౌ ముఖాముఖీలో భాజపా అధ్యక్షుడు అమిత్‌షా



ఈనాడు, దిల్లీ: విభజన వల్ల నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు తగిన న్యాయం చేసేందుకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం గట్టిప్రయత్నమే చేసిందని భాజపా జాతీయ అధ్యక్షుడు అమిత్ షా తెలిపారు. ఆ రాష్ట్రానికి గత నాలుగేళ్లలో ఇచ్చినన్ని నిధులను సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు కూడా ఏ కేంద్ర ప్రభుత్వమూ ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఇచ్చిన ప్రతి పైసాకూ లెక్క చెబుతామని బుధవారం 'టైమ్స్ నౌ' ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. ఎన్డీయే నుంచి చంద్రబాబును తాము వెళ్లగొట్టలేదని, ఆయనే బయటకు వెళ్లారని వ్యాఖ్యానించారు. కూటమిలో ఇంకా 30 పార్టీలున్నాయని, ఎన్డీయే ఏ మాత్రం బలహీనపడలేదని ధీమా వ్యక్తం చేశారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ 300కు పైగా స్థానాలతో మళ్లీ అధికారంలోకి వస్తామని చెప్పారు. చంద్రబాబు వెళ్లటం వల్ల భాజపా దక్షిణాది కలలకు ఆటంకం కలిగిందా అన్న ప్రశ్నకు అమిత్ షా సమాధానమిస్తూ... అక్కడ ఇంకా బలపడవచ్చేమో అన్నారు. మిత్రపక్షాలు ఎవరినీ తాము బయటకు పంపాలని అనుకోలేదని, చంద్రబాబు వెళ్లాలనుకున్నప్పుడు ఎలా ఆపగలమని వ్యాఖ్యానించారు. "మిత్రపక్షాలు రెచ్చిపోవటం మంచిది కాదన్నది మా భావన. కానీ వారే వెళ్లిపోతే మేం ఏమి చేయగలం. మాకు ఏపీలో ఇప్పుడు రెండు సీట్లే ఉన్నాయి. భవిష్యత్తులో పెరగవచ్చేమో. కాంగ్రెస్ మాదిరిగా.. అవసరాలకు తగ్గట్లు మేము వ్యవహారాలు నడపలేదు. మాకు కేంద్రంలోనూ, యూపీలోనూ పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ మిత్రపక్షాలను ప్రభుత్వాలలో చేర్చుకుని వారికి గౌరవాన్ని ఇచ్చాం. అవిశ్వాసానికి మేం భయపడటంలేదు. ఎన్డీయేకు 300 మంది బలం ఉంది. చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. భాజపా ఎంపీలు ఎవరూ సభామధ్యంలోకి వెళ్లి సభను అడ్డుకోవటం లేదు. తొలి వారం కాంగ్రెస్, ఆ తర్వాత (మిగతా 2లో)

ఎంసెట్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఉండదు

- దరఖాస్తు సమయంలోనే ధ్రువీకరణ పత్రాల సేకరణ
- మార్కులకు సంబంధించి టెన్త్, ఇంటర్ బోర్డులతో నేరుగా సమన్వయం
- 'ఈనాడు'తో ఎంసెట్ కన్వీనర్ ఆచార్య సి.హెచ్.సాయిబాబు

ఈనాడు, కాకినాడ: ఎంసెట్ నిర్వహణలో ఏటా ఏదో ఒక సంస్కరణను అమలుచేస్తున్న కాకినాడ జేఎన్‌టీయూ నిర్వాహకులు ఈ దఫా కొత్త విధానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నారు. ఏటా ధ్రువపత్రాల పరిశీలన పేరుతో నెల రోజుల పాటు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉండేది. హెల్ప్ సెంటర్ల వద్ద పడిగాపులు పడుతూ తమ వంతు కోసం నిరీక్షించాల్సి వచ్చేది. ఈ విధానానికి చెక్ పెడుతూ ఈసారి ఎంసెట్ ఫలితాలు వెలువరించిన వెంటనే ధ్రువపత్రాల పరిశీలన లేకుండా నేరుగా ఆయా ర్యాంకులను బట్టి ప్రవేశాలు పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంసెట్ కన్వీనర్ ఆచార్య సి.హెచ్. సాయిబాబు 'ఈనాడు'కు తెలిపారు. "దరఖాస్తుతో పాటే రేషన్ కార్డు, ఆధార్ కార్డు, స్థానికత వివరాలను సేకరిస్తాం. పదోతరగతి, ఇంటర్మీడియెట్ సర్టిఫికెట్లకు (మిగతా 2లో)


పార్లమెంటు వద్ద తెదేపా ఎంపీల నిరసన

ఏమీ చూడలేకపోతున్నా.. 50 మందిని ఎలా లెక్కించను?

- అందుకే సభను వాయిదా వేస్తున్నా: మహాజన్
- 4వ రోజూ లోక్‌సభలో చర్చకు రాని అవిశ్వాసం

2లో

నారీ.. ఏదీ సమానత్వ దారి!

- 2016లో దేశవ్యాప్తంగా 12 శాతం పెరిగిన అత్యాచారాలు
- తెలుగు రాష్ట్రాల్లో మహిళలపై భర్తల దాడులు అధికం
- 5వ స్థానంలో తెలంగాణ, 7వ స్థానంలో ఏపీ
- బడిలో చేరుతున్న పిల్లల శాతంలో అట్టడుగున ఏపీ
- దేశవ్యాప్తంగా మహిళల పేరిట 32 శాతం డిపాజిట్లు
- మహిళలు–పురుషుల స్థితిగతులపై కేంద్ర నివేదికలో వెల్లడి



ఈనాడు – హైదరాబాద్

దేశంలో మహిళలకు చాలా అంశాల్లో పురుషులతో సమానత్వం దక్కడం లేదని.. వారిపై దాడులు, అత్యాచారాల వంటివి పెరుగుతూనే ఉన్నాయని తాజా నివేదిక స్పష్టంచేసింది. ఇల్లాలికి ఇంట్లో నుంచే ముప్పు పొంచి ఉందని.. అత్యధికంగా భర్త, బంధువుల నుంచి దాడులు ఎదుర్కొంటున్నట్లు తెలిపింది. మొత్తం మహిళల ఆత్మహత్యల్లో గృహిణులవే అధికంగా ఉండటం మరో విషాదం. దేశవ్యాప్తంగా మహిళలు, పురుషుల స్థితిగతులపై కేంద్రం ప్రభుత్వం వివిధ సంస్థలు, మార్గాల్లో జరిపే అధ్యయనాలను క్రోడీకరించి 2016కు సంబంధించి కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ నివేదిక-2017ను తాజాగా విడుదల చేసింది. అనేక అంశాల్లో రెండు వర్గాలను పోలుస్తూ నివేదికను రూపొందించింది. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించేందుకు విధాన నిర్ణయాలు తీసుకోవడానికి.. పథకాలు, ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు ఉపకరిస్తాయని ఆ శాఖ తెలిపింది. నివేదికలోని ముఖ్యాంశాలు..

అత్యాచారాల పెరుగుదల అధికం..

- ★ దేశంలో 2015తో పోలిస్తే 2016లో అత్యాచారాలు 12 శాతం పెరిగాయి. అన్ని నేరాల్లోకెల్లా అత్యాచారాల పెరుగుదల శాతం అధికంగా ఉంది.
- ★ మహిళలపై జరుగుతున్న దాడులకు సంబంధించి నమోదైన నేరాల్లో భర్త, బంధువులు చేస్తున్నవే అత్యధికంగా 33 శాతమున్నాయి.
- ★ మొత్తం మహిళలపై నేరాల్లో.. భార్యపై భర్త దాడి చేసినట్లు నమోదైన వాటిని శాతాల ఆధారంగా చూస్తే... తెలంగాణ 5, ఏపీ 7వ స్థానంలో ఉన్నాయి. ఈ తరహా నేరాలు అత్యధికంగా అసోంలో 58.7, పశ్చిమబెంగాల్‌లో 42.3, తెలంగాణలో 39.2, ఏపీలో 25.1 శాతం జరిగాయి.
- ★ మొత్తమ్మీద 3.38 లక్షల నేరాలు నమోదవగా 3% వరకట్నం నిరోధక చట్టం కింద ఉన్నాయి. మొత్తం కేసుల్లో 67 శాతమే విచారించి పరిష్కరించారు.
- ★ మొత్తం కేసుల్లో కోర్టులో విచారణ (మిగతా 2లో)

ఇదీ సంగతి!



వాట్సప్‌లో లెక్కల పరీక్ష పేపరు

- ఉదయం 11 గంటల 39 నిమిషాలకే ప్రత్యక్షం
- గంటన్నరలోనే జవాబు పత్రాలు కూడా..

ఈనాడు, కర్నూలు డిజిటల్, తాడేపల్లిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పదో తరగతి గణితం ప్రశ్న పత్రం వాట్సప్‌లో ప్రత్యక్షమైంది. కొన్ని ప్రాంతాల్లో ఉదయం 11.30 నిమిషాల తరువాత బయటపడగా.. మరికొన్ని ప్రాంతాల్లో పరీక్ష ప్రారంభమైన గంట తరువాత జవాబు పత్రాలు ప్రత్యక్షమయ్యాయి. కర్నూలు జిల్లాలో శిరువెళ్లకు చెందిన 'జర్నలిజం శిరువెళ్ల' అనే వాట్సప్ గ్రూప్‌లో ప్రశ్న పత్రం ఉదయం 11.39 నిమిషాలకే ప్రత్యక్షమైంది. ఇంతకంటే చాలా ముందే లీకై ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో కలకలం

పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలో బుధవారం (మిగతా 2లో)

కేంద్రానికి భయమెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

అవిశ్వాస తీర్మానానికి దేశంలోని అనేక పార్టీలు మద్దతిస్తున్నాయని, రాష్ట్రంలోని రాజకీయపార్టీలు కూడా కలిసి రావాలని సూచించారు. ప్రత్యేకహోదా, ప్రయోజనాల కోసం చేసే ఆందోళనలు, నిరసనలతో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే రాష్ట్రానికి పెట్టుబడులు రావన్న విషయాన్ని అంతా గమనించాలన్నారు. కేంద్రం ఇంత మొండిగా వ్యవహరించడం వెనుక వ్యూహమేమిటని ప్రశ్నించారు. ఏ భరోసాతో ఆంధ్రప్రదేశ్ పట్ల ఇంత కఠినంగా వ్యవహరిస్తోందన్నారు. ఏపీకి జరిగిన అన్యాయంపై ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోని తెలుగువారిలోనూ తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. కేంద్రంపై లోక్‌సభలో తెదేపా ఇచ్చిన అవిశ్వాసం నోటీసును ఎట్టి పరిస్థితుల్లో అనుమతించాల్సిందేనని డిమాండ్ చేశారు. దీనికి మరో ప్రత్యామ్నాయం లేదని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, వాయిదాలు వేసుకుంటూపోతే మరింత ఆగ్రహానికి గురవుతారని చెప్పారు. రాష్ట్రానికి సాయం చేసే విషయంలో భాజపాకి ఎన్ని అవకాశాలిచ్చినా వినియోగించుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. ‘సామరస్యంగా అడిగినపుడు చేయలేదు. మంత్రులతో రాజీనామా చేయించి, ఎన్డీయే నుంచి వైదొలిగినా కదలిక లేదు. అవిశ్వాసం పెట్టినా స్పందన లేదు. ఆంధ్రప్రదేశ్ దేశంలో అంతర్భాగం కాదా? రాష్ట్రానికి సాయం చేయాల్సిన బాధ్యత కేంద్రంపై లేదా?...’ అని సీఎం తీవ్రంగా ధ్వజమెత్తారు.

హక్కుల కోసం పోరాడుతున్నాం

‘ఆంధ్రప్రదేశ్ సమస్య జాతీయ స్థాయి అంశంగా మారింది. భాజపా మినహా అన్ని పార్టీలు మన పోరాటం పట్ల సానుభూతితో మద్దతు ఇస్తున్నాయి. 1985 ఆగస్టు సంక్షోభంలో 161 మంది ఎమ్మెల్యేలు చివరిదాకా ఒక్కతాటిపై నిలిచి ఘనవిజయం సాధించారు. ఇప్పుడు ఎంపీలందరిలో అదే స్ఫూర్తి కనిపించాలి. రాష్ట్రానికి న్యాయం జరిగే వరకూ పోరాడాలి. పునర్వ్యవస్థీకరణ చట్టంలో కేంద్రం ఏం చేస్తానని చెప్పింది? అవి ఎంతవరకు చేసింది? ఇంకా ఏం చేయాలి? పార్లమెంటులో ఇచ్చిన హామీలు ఎంత వరకు అమలు చేశారన్న అంశాలపై అవగాహన ఉండాలి. దీన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. పొరుగు రాష్ట్రాలతో సమాన స్థాయికి చేరేదాకా కేంద్రం తోడ్పాటు అందించాలి...’ అని సీఎం పేర్కొన్నారు.



సీఎం నివాసం వద్ద గ్రీవెన్స్‌హాల్‌లో నిర్వహించిన సాధికార మిత్ర సంఘాల సమావేశంలో చంద్రబాబును భారీ పూలమాలతో సత్కరిస్తున్న మహిళలు

అరుణ్‌జైట్లీ వ్యాఖ్యలు బలంగా ప్రజల్లోకి...

‘రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఉభయసభల్లో ఎంపీల ఆందోళనను భాజపాకు చెప్పే చేశాం. ముమ్మారు తలాక్‌పైనా చెప్పే చేశాం. ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ చేసిన వ్యాఖ్యలు ప్రజల్లోకి బలంగా వెళ్లాయి. దేశ రక్షణ నిధులు అడిగామనడం ప్రజల్లో ఆవేశం పెంచింది. దీనికితోడు రాష్ట్రానికి అన్యాయం చేశారన్న భావన ఉంది...’ అని సీఎం వెల్లడించారు.

అవిశ్వాసం పెట్టిన వాళ్లకు పీఎంవోలో పనేంటి?

‘అవిశ్వాసం పెట్టిన వాళ్లకు (వైకాపా) పీఎంవోలో పనేంటి? ఎంపీ విజయసాయిరెడ్డిని ఫోటో తీస్తే పీఎంవో సిబ్బంది మీడియాను గదమాయించడం ఏమిటి? ఒక వైపు అవిశ్వాసం అంటూ నోటీసు ఇస్తారు. మరోవైపు ప్రధాని కార్యాలయంలో ఉంటారు. అక్కడే వైకాపా చిత్తశుద్ధి ఏంటో తెలిసిపోతోంది. కొంతకాలంగా భాజపా తెదేపాపై అనుమానం పెంచుకుంది. జాతీయ రాజకీయాలపై ఆసక్తి లేదన్నా వాళ్లు(భాజపా) నమ్మడం లేదు. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో అవసరం లేకున్నా భాజపా వైసీపీ మద్దతు తీసుకుంది...’ అని సీఎం వ్యాఖ్యానించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పార్లమెంటరీ పార్టీ నేత సుజనాచౌదరి, సీఎం రమేష్, టీజీ వెంకటేశ్, ప్రణాళికా మండలి ఉపాధ్యక్షులు కుటుంబరావు, శాసనసభ, మండలి చీఫ్ విప్‌లు పల్లె రఘునాథరెడ్డి, పయ్యావుల కేశవ్, ఇతర ఎంపీలు, అసెంబ్లీ వ్యూహ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

తోబుట్టువు కంటే మిన్నగా చూసుకుంటున్నా


మిమ్మల్ని తోబుట్టువు కంటే మిన్నగా చూసుకుంటున్నానని, దేశంలో ఎక్కడా ఇప్పటివరకు ఇవ్వని విధంగా పసుపు కుంకుమ కింద రూ.10 వేలు కోట్లు ఇచ్చానని సాధికార మిత్రల సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు చెప్పారు. “కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు చెప్పే రీతిలో సాధికారమిత్రలు ఉండాలి. ప్రజల్లో ఉండే సందేహాలను నివృత్తి చేసి వారంతా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై సంతృప్తి చెందేలా వ్యవహరించాలి. అర్హులకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయా? లేదా? అందకపోతే అధికారులను కలిసి ఇప్పించే బాధ్యత తీసుకోవాలి. ...” అని సీఎం పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాల్లోనూ సాధికార మిత్రల భాగస్వామ్యం తప్పనిసరని, ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన ఆదేశాలిచ్చామని చెప్పారు. కొత్తగా వచ్చే చంద్రన్న పెళ్లికానుక, ఆదరణలోనూ అర్హులను ఎంపిక చేసే బాధ్యత తీసుకోవాలని సూచించారు. పేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపే ప్రయత్నంలో డ్వాక్రా సంఘాలు తీసుకొస్తే, అప్పట్లో చాలామంది అవహేళన చేశారని, వారందరికి ఇప్పుడు స్త్రీ శక్తి అంటే ఏమిటో తెలిసిందని, ముఖ్యమంత్రిగా గర్వపడుతున్నానని చెప్పారు. త్వరలో ప్రతి ఇంటికీ వీడియోకాన్ఫరెన్స్ సౌకర్యం అందుబాటులోకి రాబోతుందని, తానే స్వయంగా ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుంటానని వివరించారు.


విజయలక్ష్మికి ముఖ్యమంత్రి అభినందన

ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం నాగంభట్లపాలెంకు చెందిన సాధికారమిత్ర విజయలక్ష్మిని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. గ్రామంలో సంక్షేమ కార్యక్రమాల అమలుకు ఆమె తీసుకుంటున్న చొరవ, ఉపాధి కార్యక్రమాలను సభలో వివరించడంతో పాటు ప్రతి నెలా రూ.10 వేల ఆదాయం సాధించాలని ప్రభుత్వం ఆశిస్తుంటే, తాము నెలకు రూ.50 వేలు సంపాదించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పగానే ముఖ్యమంత్రితో పాటు ఉన్నతాధికారులు, ఇతర సాధికారమిత్రలు చప్పట్లు కొట్టారు. మిగతా వారంతా ఇదే విధంగా పనిచేస్తే వేదికపై ఉన్న తామంతా కిందకి వస్తామని, మీరు వేదికపైకి రావొచ్చని సీఎం చెప్పారు. మంత్రులు, ఐఏఎస్‌ల కంటే సాధికార మిత్రలే బాగా పని చేస్తున్నారన్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన మరో మహిళ వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రితో మాట్లాడారు.

వాట్సప్‌లో లెక్కల పరీక్ష పేపరు

(మొదటి పేజీ తరువాయి)





వాట్సప్‌లో ప్రత్యక్షమైన గణితం పేపరు
● ప్రశ్నపత్రంలోని ప్రశ్నలకు జవాబులు

ఉదయం పరీక్ష ప్రారంభమైన గంట నుంచి గంటన్నర వ్యవధిలోనే గణితం ఆంగ్ల మాధ్యమం ప్రశ్నపత్రంలో ఉన్న ప్రశ్నలకు రాసిన జవాబులతో సహా వాట్సాప్‌లో హల్‌చల్ చేశాయి. తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలనులోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచే ఈ ప్రశ్న పత్రం లీకైందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇక్కడ మాస్ కాపీయింగ్ జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మీడియా ద్వారా విషయం తెలుసుకున్న జిల్లా విద్యాశాఖాధికారి రేణుక పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు లీకవ్వటంగాని, మాస్ కాపీయింగ్‌కు పాల్పడటం వంటి ఘటన లేమీ జరగటం లేదన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రంలో ఆరుగొలను గురుకుల పాఠశాల, జిల్లాపరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు, మోదుగగుంట జిల్లా పరిషత్తు పాఠశాల విద్యార్థులు కలిపి మొత్తం 217 మంది పరీక్ష రాస్తున్నారు. ఇందులో ఆంగ్ల, తెలుగు మాధ్యమం విద్యార్థులు ఉన్నారు.

ముందే లీకయ్యిందా...?.. వాస్తవానికి రూట్ ఆఫీసర్లు పోలీసు స్టేషన్‌లో ఉన్న పరీక్ష పేపర్లను తీసుకుని ఉదయం 9.10 గంటలకు కేంద్రానికి అందజేస్తున్నారు. అనంతరం పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌తోపాటు ఇద్దరు ఇన్విజిలెటర్లు సంతకాలు చేసిన తరువాత ఆయా పేపర్లను తెరవాల్సి ఉంది. విద్యార్థులకు 9.30 గంటలకు పేపర్లను అందజేసి...మిగిలిన ప్రశ్నపత్రాలను కవరులోపెట్టి సీల్ వేయాల్సి ఉంటుంది. అయితే ఈ సమయంలోనే పేపర్లు లీకవుతున్నాయా? లేక ముందుగానే బయటకొస్తున్నాయా అనేది తేలాల్సి ఉంది. పరీక్షలు ప్రారంభమైన గంట వ్యవధిలోనే జవాబు పత్రాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయంటే.. పేపర్లను పరీక్షా కేంద్రానికి తీసుకెళ్తున్న సమయంలోనే లీక్ చేస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఎన్నికల్లో జోక్యాన్ని సహించబోం

● ఫేస్‌బుక్‌కు భారత్ హెచ్చరిక

దిల్లీ, వాషింగ్టన్, న్యూయార్క్: ఎన్నికల ప్రక్రియల్లో అక్రమ మార్గాల ద్వారా జోక్యం చేసుకుంటే సహించబోమని దిగ్గజ సోషల్ మీడియా వేదిక ఫేస్‌బుక్‌ను భారత్ గట్టిగా హెచ్చరించింది. కఠిన చర్యలు తీసుకునేందుకూ వెనుకాడబోమనీ తెలిపింది. అవసరమైతే ఫేస్‌బుక్ సీఈవో మార్క్ జుకర్‌బర్గ్‌కూ సమన్లు పంపుతామని స్పష్టీకరించింది. ఐదు కోట్ల మంది ఫేస్‌బుక్ ఖాతాదారుల సమాచారాన్ని అమెరికా సహా పలు దేశాల్లో ఎన్నికలను ప్రభావితం చేసేందుకు బ్రిటన్ సంస్థ “కేంబ్రిడ్జ్ అనలిటికా” ఉపయోగించుకుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్న సంగతి తెలిసిందే. ఈ ప్రకంపనలు భారత్‌లోనూ కనిపించాయి. కేంబ్రిడ్జ్ అనలిటికా సేవలను ఉపయోగించుకున్నారంటూ భాజపా, కాంగ్రెస్ పార్టీలు ఒకదానిపై మరొకటి ఆరోపణలు గుప్పించుకున్నాయి. ఈ అంశంపై పార్లమెంటు భవన సముదాయంలో ఐటీ, న్యాయ శాఖల మంత్రి రవి శంకర్‌ప్రసాద్ బుధవారం విలేకరులతో మాట్లాడారు. భారత ఎన్నికల ప్రక్రియలను అక్రమ మార్గాల్లో ప్రభావితంచేసేందుకు ఫేస్‌బుక్ సహా ఏ సామాజిక అనుసంధాన వేదిక ప్రయత్నించినా సహించేదిలేదు అని ఆయన వ్యాఖ్యానించారు.

‘రాహుల్‌ను పైకి ఎత్తేందుకే...’.. కేంబ్రిడ్జ్ అనలిటికాతో కాంగ్రెస్‌కు సంబంధముందని రవిశంకర్ ప్రసాద్ ధ్వజమెత్తారు. ‘2019 సార్వత్రిక ఎన్నికల్లో అనలిటికా సేవలు ఉపయోగించుకోవాలని కాంగ్రెస్ ప్రణాళికలు సిద్ధంచేసింది. సమాచారాన్ని దుర్వినియోగంచేస్తూ ఓటర్లకు ఎరవేయాలని అనుకుంది. మరోవైపు కాంగ్రెస్ రాహుల్ గాంధీకి సామాజిక అనుసంధాన వేదికల్లో ప్రాచుర్యం పెంచేందుకు ఈ సంస్థపైనే ఆధారపడాలని భావించింది.’ అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నించారు. అంతేకాదు అనలిటికా మాజీ సీఈవో అలెగ్జాండర్ నిక్స్‌ను రాహుల్ ఎన్నిసార్లు కలిశారో చెప్పాలని డిమాండ్ చేశారు.

భాజపానే ఉపయోగించుకుంది: కాంగ్రెస్.. భాజపా విమర్శలను కాంగ్రెస్ తిప్పికొట్టింది. అనలిటికా సేవలను కమలనాథులే ఉపయోగించుకున్నారని ధ్వజమెత్తింది. బిహార్, గుజరాత్, హరియాణా, ఝార్ఖండ్, మహారాష్ట్రలతోపాటు మరి కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లోనూ ఈ సంస్థ సాయం తీసుకున్నారని ఆరోపించింది. అంతేకాదు భాజపా ప్రతిష్ఠాత్మక “మిషన్ 272 ప్లస్” లక్ష్యం వెనకున్నదీ ఈ సంస్థేనని వ్యాఖ్యానించింది. ఈ అంశంపై పార్టీ కమ్యూనికేషన్స్ విభాగం ఇన్‌ఛార్జి రణ్‌దీప్ సుర్జేవాలా మాట్లాడారు. తాము ఎప్పుడూ అనలిటికాతో కలిసి పనిచేయలేదని నొక్కిచెప్పారు.

నారీ.. ఏదీ సమానత్వపు దారి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమైనవి 2.60 లక్షలుంటే వీటిలో కేవలం 1.7 శాతానికే మాత్రమే శిక్షలుపడ్డాయి. అత్యాచారం కేసుల్లో 3.1 శాతం నిందితులకు శిక్షలు పడ్డాయి. వరకట్నం కోసం జరిగిన హత్యల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది.

- దేశవ్యాప్తంగా 2016లో జరిగిన అత్యాచార ఘటనల్లో బాధితులైన వారి వయసును పరిశీలిస్తే.. 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉన్నవారు 42 శాతమున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఈ వయసు వారిపైనే అధికంగా లైంగిక దాడులు జరిగాయి. తెలంగాణలో ఈ వయసు తరవాత 12-16 ఏళ్ల మధ్య ఉన్న బాలికలపై ఎక్కువగా అత్యాచారాలు జరిగాయి.

ఆత్మహత్యల్లో గృహిణులే అధికం

- దేశంలో ఆత్మహత్య చేసుకుంటున్న మహిళల్లో... గృహిణులు అధికంగా 53, విద్యార్థినులు 10, రోజూవారీ కూలీలు 8, స్వయం ఉపాధి పొందుతున్నవారు 5, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగాలు చేసేవారు ఒకశాతమున్నారు.
- ఆత్మహత్య చేసుకుంటున్న పురుషుల్లో.. స్వయం ఉపాధి పొందేవారు 25, రోజూవారీ కూలీలు 22, రైతులు 13, ఉద్యోగులు 10, నిరుద్యోగులు 10 వ్యాపారులు 9, విద్యార్థులు 5, ఇతరులు 26 శాతమున్నారు.
- విద్యార్హతల ఆధారంగా ఆత్మహత్యలను పరిశీలిస్తే పదో తరగతితో చదువు ఆపినవారు 22 శాతం, 5 నుంచి 10లోపు చదివిన వారు 21, ప్రాథమిక విద్య వరకే చదివిన వారు 19 శాతమున్నారు.

32 శాతం డిపాజిట్లు మహిళలవే...

- దేశంలో 2016 మార్చి నాటికి.. వాణిజ్య బ్యాంకుల డిపాజిట్లలో 32 శాతం మహిళల పేరుతోనే ఉన్నాయి.
- బ్యాంకు ఉద్యోగుల్లో జాతీయ స్థాయిలో సగటున 22 శాతం మహిళలే.

గ్రామీణ మహిళలే వ్యాపారంలో ముందు...

- దేశవ్యాప్తంగా అన్ని రకాల వ్యాపార సంస్థల్లో గ్రామీణంలో 24 శాతం మహిళలవి కాగా పట్టణాల్లో 19 శాతమే. అన్ని రాష్ట్రాల్లోకెల్లా అత్యధికంగా మణిపూర్ గ్రామాల్లో 82, పట్టణాల్లో 77 శాతం వ్యాపార సంస్థలను నారీమణులే నడుపుతున్నారు.
- తెలంగాణలో 31 శాతం వ్యాపార సంస్థలు మహిళల అధీనంలో ఉన్నాయి.(పట్టణ ప్రాంతాల్లో 49, గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతం). ఏపీలో 27 శాతం వ్యాపార సంస్థలు మహిళలవి (గ్రామాల్లో 30, పట్టణాల్లో 21 శాతం). చాలా రాష్ట్రాలకన్నా తెలుగు రాష్ట్రాల్లో మహిళల నేతృత్వంలోని సంస్థలు తక్కువగా ఉండటం గమనార్హం.
- దేశవ్యాప్తంగా పశ్చిమ బెంగాల్, కశ్మీర్, ఏపీల్లో మాత్రమే బ్యాంకు రుణాలకన్నా ప్రైవేటు వడ్డీ వ్యాపారులిచ్చిన అప్పులతోనే మహిళలు ఏర్పాటుచేసుకున్న సంస్థలు అధికంగా ఉన్నాయి.

పట్టణ ప్రాంత మహిళలకు ఉపాధి కరవు

- పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ మంది మహిళలకు ఉపాధి లభించడం లేదు. 2015-16 చివరి నాటికి దేశవ్యాప్తంగా 15 ఏళ్లు దాటిన వారిలో.. మహిళల్లో 5.8, పురుషుల్లో 3 శాతం నిరుద్యోగులున్నారు.
- నిరుద్యోగిత శాతంలో జాతీయ స్థాయి పట్టణ ప్రాంతాల సగటుకన్నా తెలంగాణలో అధికంగా ఉండటం గమనార్హం. తెలంగాణ పట్టణ మహిళల్లో 14.5 శాతం, పురుషుల్లో 3.1 శాతం నిరుద్యోగులున్నారు. ఏపీలో గ్రామీణ పురుషుల్లో (3.5శాతం) మాత్రమే జాతీయస్థాయికన్నా ఎక్కువగా నిరుద్యోగులున్నారు.

మహిళలు ఏర్పాటు చేసుకున్న సంస్థలకు సాయం ఎవరిచ్చారంటే...

ఇచ్చింది ఎవరు	ఎన్ని సంస్థలు	
	తెలంగాణ	ఏపీ
వడ్డీవ్యాపారుల అప్పులు	2418	8573
బ్యాంకు రుణాలు	4239	8562
ప్రభుత్వ సాయం	7879	20,470
సొంత పెట్టుబడితో	2,86,081	6,63,349
స్వయం సహాయక సంఘాల సాయం	6544	36,434
విరాళాలు, ఇతర సాయం	49,325	1,12,434

సగానికిపైగా మహిళలకు రక్తహీనత

- దేశవ్యాప్తంగా 15-49 ఏళ్ల వయసు పురుషుల్లో 22.7, మహిళల్లో 53 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారు.
- కుటుంబ నియంత్రణ పాటిస్తున్న మహిళలు జాతీయ సగటు 53.5 శాతముండగా అత్యధికంగా పంజాబ్‌లో 75.8 శాతమున్నారు.
- 2015-16లో ప్రాథమిక పాఠశాలల్లో చేరిన పిల్లలు జాతీయస్థాయిలో 99.2 శాతముంటే అతి తక్కువగా ఏపీలో 84.5 శాతమున్నారు.

కనిష్క్ కుచ్చుటోపీ

(మొదటి పేజీ తరువాయి)

బంగారు ఆభరణాలను తయారు చేసి ‘క్రిజ్’ బ్రాండ్ పేరుతో 2014 వరకూ డిస్ట్రిబ్యూటర్ల ద్వారా వాటిని విక్రయించేది. 2015 నుంచి తన వ్యాపార సరళిని మార్చుకుని పెద్ద పెద్ద దుకాణాల వారికి ఆభరణాలను సరఫరా చేయటం ప్రారంభించిందని ఎస్‌బీఐ తన ఫిర్యాదులో పేర్కొంది. 2008లో ఆ సంస్థ రుణ ఖాతాలన్నీ ఐసీఐసీఐ బ్యాంకు నుంచి ఎస్‌బీఐకి మళ్లాయి. ఆ తర్వాత ఎస్‌బీఐ నేతృత్వంలోని 14బ్యాంకుల సహవ్యవస్థ కనిష్క్ యాజమాన్యానికి రుణాలను మంజూరు చేస్తూ వచ్చాయి. 2017 మార్చి నాటికి అలా మంజూరు చేసిన రుణాల మొత్తం రూ.824.15 కోట్లుగా తేలింది. వడ్డీతో కలుపుకుని ఆ మొత్తం రూ.1000 కోట్లకు చేరి ఉండవచ్చని అంచనా. బ్యాంకు రుణాల ద్వారా సమకూరిన డబ్బును కనిష్క్ యజమాన్యం దారి మళ్లించినట్లు తెలుస్తోంది.

మోసపోయామని తెలుసుకుందిలా...

తన వ్యాపారాల కోసం కనిష్క్ సంస్థ 2007 నుంచే బ్యాంకుల నుంచి దఫదఫాలుగా రుణాలను తీసుకొంటోంది. అయితే, 2017 నవంబరు 11న ఎస్‌బీఐ తొలుత కనిష్క్ మోసం గురించి ఆర్‌బీఐకి తెలిపింది. ఆ తర్వాత రెండు నెలలకు సహవ్యవస్థలోని బ్యాంకులన్నీ ఆ విషయాన్ని ఆర్‌బీఐకి వెల్లడించాయి. 2017 మార్చిలో కనిష్క్ 8 బ్యాంకులకు వడ్డీల చెల్లింపులో బకాయిపడింది. ఆ మరుసటి నెలలోనే సహవ్యవస్థలోని 14 బ్యాంకులకూ రుణాల చెల్లింపులను నిలిపివేసింది. ఆ తర్వాత సంస్థ యాజమాన్యం బ్యాంకులకు అందుబాటులో లేకుండా పోయింది. 2017 మే 25న కనిష్క్ కార్పొరేట్ కార్యాలయం, ఆభరణాల తయారీ కర్మాగారం, షోరూమ్‌లకు వెళ్లిన బ్యాంకర్లకు అవన్నీ తాళాలు బిగించి, మూతపడిన స్థితిలో దర్శనమిచ్చాయి. అన్ని బ్యాంకుల్లో కలిపి మొత్తం రూ.824.15 కోట్ల మేర మోసం జరిగిందని, అయితే, 156.65 కోట్లకు సమానమైన పూచీ/హామీలు మాత్రమే బ్యాంకు వద్ద ఉన్నాయని ఎస్‌బీఐ పేర్కొంది.

కనిష్క్‌కు రుణాలిచ్చిన బ్యాంకులు..

బ్యాంకు	రుణంకోట్లలో
స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా	215
పంజాబ్ నేషనల్ బ్యాంక్	115
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	50
సిండికేట్ బ్యాంక్	50
బ్యాంక్ ఆఫ్ ఇండియా	45
ఐడీబీఐ బ్యాంక్	45
యూకో బ్యాంక్	40
తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్	37
ఆంధ్రా బ్యాంక్	30
బ్యాంక్ ఆఫ్ బరోడా	30
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	25
ఐసీఐసీఐ బ్యాంక్	25
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	20
కార్పొరేషన్ బ్యాంక్	20

ఎంసెట్‌లో ధ్రువపత్రాల పరిశీలన ఉండదు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి ఆయా బోర్డులతో సమాచార సమన్వయం తీసుకుంటున్నాం. కాబట్టి విద్యార్థులు హెల్ప్‌సెంటర్లకు వెళ్లి పరిశీలనకు హాజరు కావాల్సిన అవసరం ఉండదు. ఎంసెట్ దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో ఆదాయ ధ్రువీకరణ, కుల ధ్రువీకరణ పత్రాలను కూడా అప్‌లోడ్ చేయాలంతే. ఈ విధానం వల్ల 40 రోజుల ముందుగా అడ్మిషన్లు ఇచ్చే అవకాశం ఉంటుంది” అని ఎంసెట్ కన్వీనర్ పేర్కొన్నారు. 2018 ఎంసెట్‌కి సంబంధించి బుధవారం నాటికి ఇంజినీరింగ్, వైద్య విభాగాలకు 1,65,400 దరఖాస్తులు అందాయి. ఇంజినీరింగ్ విభాగంలో 1,13,687, వ్యవసాయం, వైద్య విభాగానికి సంబంధించి 51,024 దరఖాస్తులు, రెండు విభాగాలకూ దరఖాస్తు చేసిన వారు 689 మంది ఉన్నారు.

పట్టిసీమపై గరం.. గరం..

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత 24 పంపులు మాత్రమే ఏర్పాటు చేశారని వివరించారు.

ఆరోపణలు నిరాధారం.. విచారణ అనవసరం

జలవనరులశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు జోక్యం చేసుకుంటూ డయాఫ్రమ్‌వాల్ అనే కొత్త విధానంలో మట్టి తవ్వకం చేపట్టడమే దీనికి కారణమన్నారు. ప్రజాపద్దులు కమిటీ అధ్యక్షుడు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఇదే పనిగా ఆరోపణలు చేయగా అధికారులు స్పష్టమైన సమాధానాలిచ్చారన్నారు. ఈ ఆరోపణలు నిరాధారమని, ఎటువంటి అవినీతి జరగలేదని, విచారణ అవసరం లేదని స్పష్టం చేశారు. వైకాపా, భాజపా కలిసి తెదేపాపై బురదజల్లే కార్యక్రమంలో భాగంగానే ఆయన చిలకపలుకులు ఉన్నాయన్నారు. నిన్నటివరకు పొగిడి.. ఎన్డీయే నుంచి బైటకు రాగానే చౌకబారు విమర్శలు చేస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ముందు జగన్‌తో, తర్వాత పవన్‌కల్యాణ్‌తో మాట్లాడించి ఇప్పుడు సిట్టింగ్ జడ్జి, సీబీఐ అనడం చూస్తుంటే అంతా ప్రణాళిక ప్రకారం చేస్తున్నట్లుందని చెప్పారు. బీజేపీలో బీ అంటే భాజపా, జే అంటే జగన్, పి అంటే పవన్ అని ఎద్దేవా చేశారు. కాగ్ అనేది పరిశీలన సంస్థ అని.. విచారణ సంస్థ కాదని ప్రభుత్వ విప్ కె.రవికుమార్ పేర్కొన్నారు. కాగ్ తన నివేదికలో రాష్ట్రానికి రూ.16,070 కోట్ల రెవెన్యూ లోటును ప్రస్తావించినా దానిపై ఎందుకు అడగటం లేదన్నారు. నిన్నటిదాకా బుద్ధిమంతుడైన రాజు ఇప్పుడు ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టు చదువుతున్నారని మంత్రి కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. భాజపా పేరు చెబితే ప్రతి పల్లె ఆగ్రహంతో ఊగిపోతోందని విమర్శించారు. మొదట్లో మంత్రి దేవినేని, తర్వాత కాలవ భాజపా నేతలను... ప్రజాద్రోహులు, దేశద్రోహులు అని వ్యాఖ్యానించడంపై ఎమ్మెల్యే మాణిక్యాలరావు అభ్యంతరం చెప్పారు. విష్ణుకుమార్‌రాజు ప్రజల పక్షాన మాట్లాడుతున్నారన్నారు. గత మూడేళ్లుగా ఏం జరిగిందో తెలియదని, కాగ్ నివేదిక చూశాకే అవకతవకల గురించి తెలిసిందని విష్ణుకుమార్‌రాజు చెప్పారు.

ఏమీ చూడలేకపోతున్నా... ఎలా లెక్కించను?: స్పీకర్

● 4వ రోజూ చర్చకు రాని అవిశ్వాసం

ఈనాడు, దిల్లీ: ‘ఇక్కడి నుంచి నేనేమీ చూడలేపోతున్నాను. సభ సజావుగా లేనందున అవిశ్వాస నోటీసులను ముందుకు తీసుకురాలేకపోతున్నాను. అయామ్ సారీ’ అంటూ లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ వరుసగా నాలుగో రోజూ అవిశ్వాస తీర్మానాలను పక్కనపెట్టారు. గత శుక్రవారం నుంచి తెదేపా, వైకాపా సభ్యులు వరుసగా అవిశ్వాస తీర్మాన నోటీసులు ఇవ్వడం, సభలోని వెల్‌లో ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులు నిల్చొని ఆందోళన చేయడం... సభ సజావుగా లేనందున తాను 50 మందిని ఎంచలేకపోతున్నానని చెప్పి స్పీకర్ వాయిదా వేయడం పరిపాటిగా మారింది. బుధవారం కూడా అవే దృశ్యాలు పునరావృతమయ్యాయి. ఉదయం 11 గంటలకు మొదలై, నిమిషంలోనే వాయిదాపడ్డ సభ మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి సమావేశమయింది. వెంటనే కావేరి బోర్డు ఏర్పాటు కోసం ఏఐఏడీఎంకె, రిజర్వేషన్ల కోటా పెంపు డిమాండుతో తెరాస సభ్యులు నినాద ఫలకాలు (ప్లకార్డులు) పట్టుకొని వెల్‌లోకి వచ్చారు. బిహార్‌కు ప్రత్యేక రాష్ట్ర హోదా ఇవ్వాలంటూ ఆ రాష్ట్ర ఎంపీ పప్పూ యాదవ్ రెండు చేతుల్లో రెండు పెద్ద ప్లకార్డులు పట్టుకొని వెల్‌లోకి వచ్చారు. ఏఐఏడీఎంకె, తెరాస సభ్యులతోపాటు ఆయనా ఆందోళనకు దిగారు. ఆ సమయంలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ లేచి- మోదీ ప్రభుత్వంపై సభ లోపలా, బయటా పూర్తి విశ్వాసం ఉందనీ, అవిశ్వాస తీర్మానంతోపాటు ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. స్పీకర్ సుమిత్రా మహాజన్ మాట్లాడుతూ తెదేపా, వైకాపా ఇచ్చిన అవిశ్వాస తీర్మానాల గురించి సభకు వెల్లడించారు. వాటిని సభముందు పెట్టాల్సిన బాధ్యత తనపై ఉందని, సభ సజావుగా లేకపోతే వాటికి మద్దతు ఇచ్చే 50 మందిని లెక్కించడం సాధ్యం కాదన్నారు. వెల్‌లోనివారు వినిపించుకోకుండా ప్లకార్డుల్ని స్పీకర్‌కు అడ్డంగా మరీ తెచ్చిపెట్టారు. పరిస్థితి అలాగే కొనసాగడంతో సభ సజావుగా లేనందున నోటీసులను సభ ముందుకు తీసుకురాలేకపోతున్నానంటూ సభను గురువారానికి వాయిదా వేశారు.

ఏపీకి చాలా ఇచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

తెదేపా, ఇప్పుడు ఏఐఏడీఎంకే, తెరాస సభ్యులు సభామధ్యంలోకి వెళ్లి ఆందోళన చేస్తున్నారు. నియమానుసారం చర్చకు మేం సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే విషయాన్ని రాజ్‌నాథ్‌సింగ్, రవిశంకర్‌ప్రసాద్, అనంత్‌కుమార్‌లు ఉభయ సభల్లో ప్రకటించారు. చర్చ జరగాలని, ప్రజలకు వాస్తవాలు తెలియాలన్నదే మా ఉద్దేశం. పార్లమెంటు సమావేశాలు ప్రారంభం కావటానికి ముందే జైట్లీ, రాజ్‌నాథ్‌లు అఖిలపక్ష సమావేశాలు ఏర్పాటు చేసి ప్రతి పక్షాలు మాట్లాడిన ప్రతి అంశంపై చర్చకు సిద్ధమని ప్రకటించారు. కానీ, విపక్షాలే సభను అడ్డుకుంటున్నాయి” అని అమిత్ షా పేర్కొన్నారు.

గ్రహం అనుగ్రహం

22-3-2018 గురువారం

శ్రీ విళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
వసంత రుతువు; చైత్ర మాసం; శుక్ల పక్షం
పంచమి: మ. 2-08 తదుపరి షష్ఠి
కృత్తిక నక్షత్రం: సా. 6-25 తదుపరి రోహిణి
అమృత ఘడియలు: సా. 4-06 నుంచి 5-38 వరకు
వర్జ్యం: ఉ. 6-54 నుంచి 8-26 వరకు
దుర్ముహూర్తం: ఉ. 10-07 నుంచి 10-55 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-43 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6-07; సూర్యాస్తమయం: సా.6-07

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
కడప	40.0	26.0
కర్నూలు	40.0	25.9
తిరుపతి	38.3	23.5
శ్రీకాకుళం	38.0	22.5
అనంతపురం	37.7	24.9
హైదరాబాద్	37.6	24.8
గుంటూరు	37.2	24.1
నెల్లూరు	37.0	23.0
విజయవాడ	36.6	24.1
రాజమహేంద్రవరం	36.5	24.0
విశాఖపట్నం	35.6	24.2
ఒంగోలు	35.6	23.8
నరసాపురం	33.2	24.5
తాడేపల్లిగూడెం	33.0	22.5

భాజపాకు పరాభవం తప్పదు

- నాలుగేళ్లుగా ప్రజల్ని మోదీ మభ్యపెడుతున్నారు
- కర్ణాటకలో కాంగ్రెస్‌దే జయభేరి
- ప్రచారంలో జోరు పెంచిన రాహుల్

ఈనాడు – బెంగళూరు

వచ్చే విధానసభ ఎన్నికల్లో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ జయభేరి మోగించనుండగా- అనంతరం లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ ఘోర పరాభవాన్ని చూస్తారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. కర్ణాటక కాఫీ రాజధానిగా పేరుగాంచిన చిక్కమగళూరులో బుధవారం సాయంత్రం పార్టీ ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. 'నాలుగేళ్లుగా హామీలతో జనాన్ని మభ్యపెడుతున్నారు. చేసిందేమీ లేదు. మిగిలిన ఏడాదిలో చేయగలిగిందీ లేదు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపాకు పరాభవం తప్పదు' అని ప్రకటించారు.

★ దేశాన్ని చిన్నాభిన్నం చేస్తున్న భాజపా, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌లకు వ్యతిరేకంగా పోరాడేందుకు, దేశంలోని అన్ని వర్గాల మధ్య సుహృద్భావాన్ని పెంచేందుకు తగిన శక్తినివ్వాలని ప్రజలకు రాహుల్ విన్నవించారు. కష్టకాలంలో తన నాయనమ్మ ఇందిరాగాంధీని ఆదుకున్నట్లే, తననూ ఆదరించాలని కోరారు. చిక్కమగళూరు ప్రజలకు రుణపడి ఉంటానన్నారు.

★ 'గొప్పలు చెప్పను. చేసి చూపిస్తాను. ప్రజలు ఎదుర్కొంటున్న విద్యా, వైద్య సమస్యల్ని పరిష్కరిస్తా. రైతుల కన్నీళ్లు తుడుస్తా'నని రాహుల్ భరోసా ఇచ్చారు. 'మతం అంటే సత్యం అని శృంగేరిలోని సంస్కృత విద్యాలయంలో చదువుతున్న ఓ విద్యార్థి చెప్పాడు. ఈ ధర్మ సూత్రం దేశాన్ని ఏలుతున్న మోదీకి తెలియకపోవటం సిగ్గుచేటు. నోరు విప్పితే అన్నీ అబద్ధాలే' అంటూ విరుచుకుపడ్డారు.

★ అవినీతి ఆరోపణలతో చెరసాలకు వెళ్లి వచ్చిన మాజీ మంత్రులు, ముఖ్యమంత్రిగా పనిచేసినవారితో కలసి ప్రధాని మోదీ బహిరంగ వేదికపై అవినీతి అంతం గురించి గొప్పలు చెప్పుకొంటున్నారని రాహుల్ విమర్శించారు. నరేంద్ర మోదీకి అతి సన్నిహితులైన నీరవ్‌మోదీ, ఆయన మామ మెహుల్ చోక్సీ రూ.12వేల కోట్ల ధనంతో పరాయి దేశాలకు పారిపోతే ప్రధాని నోట మాట ఎందుకు రాదని ప్రశ్నించారు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా తనయుడు జేషా మూణ్నెల్ల వ్యవధిలో రూ.15వేలను రూ.80కోట్లుగా చేసినా మోదీకి అవినీతి కనపడదని ఎద్దేవా చేశారు. సరిహద్దులో డోక్లాం వద్ద చైనా రహదార్లు, విమానాశ్రయాలు నిర్మించినా నోరు మెదపటం లేదని తప్పుబట్టారు.

★ ఉదయం మంగళూరు నుంచి శృంగేరి చేరుకున్న రాహుల్‌గాంధీ అక్కడ ఆది శంకరాచార్య స్థాపించిన శారదా మందిరాన్ని దర్శించారు. శృంగేరి పీఠాధిపతిని కలుసుకుని ఆశీస్సులు పొందారు. సంస్కృత విశ్వవిద్యాలయ విద్యార్థులతో ముఖాముఖి భేటీ అయ్యారు.



శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామి నుంచి ఆశీస్సులు పొందుతున్న రాహుల్‌గాంధీ

చైనా వైఖరిపై మీరేమంటారు?

ప్రధానిని ప్రశ్నించిన రాహుల్

దిల్లీ: దక్షిణ డోక్లామ్‌కు చైనా కొత్తదారులు వెతుకుతున్నట్టు వార్తలొస్తున్న నేపథ్యంలో ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ తాజాగా విమర్శలు ఎక్కుపెట్టారు. దీనిపై మీ స్పందన ఏమిటంటూ మోదీని ప్రశ్నించారు. ఈమేరకు ట్విట్టర్‌లో 4 సమాధానాలు కూడా పెడుతూ రాహుల్ ప్రధానిని ఎద్దేవా చేశారు. "1. ఆలింగన దౌత్యం, 2. రక్షణమంత్రిని నిందించడం, 3. బహిరంగంగా గగ్గోలుపెట్టడం, 4. పైవన్నీ.." అని పేర్కొన్నారు. చైనా తెలివిగా కొత్త మార్గాలు వెతుకుతున్నట్లు వచ్చిన ఓ వార్తా కథనాన్ని కూడా రాహుల్ జతచేశారు. డోక్లామ్ అంశంపై కాంగ్రెస్ పార్టీతో పాటు, రాహుల్ తరచూ ప్రధానిపై విమర్శలు చేస్తున్నారు.

అవినాశ్‌రెడ్డి బెయిలుపై నిర్ణయం వాయిదా

ఈనాడు, హైదరాబాద్: వైఎస్ఆర్‌సీపీ, తెలుగుదేశం పార్టీల మధ్య ఇటీవల పులివెందులలో చోటుచేసుకున్న ఘర్షణల నేపథ్యంలో తనపై నమోదైన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీ వై.ఎస్.అవినాశ్‌రెడ్డి మరికొంత మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు నిర్ణయాన్ని వాయిదా వేసింది. పులివెందుల అభివృద్ధికి సంబంధించి తెలుగుదేశం మాజీ ఎమ్మెల్సీ సతీష్‌రెడ్డి చర్చకు రావాలన్న సవాలుకు సిద్ధమంటూ అవినాశ్‌రెడ్డి ప్రకటించారు. దీంతో పూల దుకాణాల వద్ద ఇరుపార్టీల వారు గుమికూడటంతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో పోలీసులకూ గాయాలయ్యాయి. ఇందుకుసంబంధించి పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిలు కోసం అవినాశ్‌రెడ్డి తదితరులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం జస్టిస్ ఎం.సత్యనారాయణమూర్తి విచారణ చేపట్టగా వీరి తరఫున సీనియర్ న్యాయవాది వేదుల వెంకటరమణ, టి.నిరంజన్‌రెడ్డిలు వాదనలు వినిపించారు. మూకుమ్మడి దాడులుగా పేర్కొంటూ కేసు నమోదు చేశారని, ఇందులో కస్టోడియన్ విచారణ అవసరం లేదన్నారు. కోర్టు విధించే షరతులకు కట్టుబడి ఉంటారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపిస్తూ దాడులకు సంబంధించి 2 కేసులు తెదేపా, 2 కేసులు వైస్సాఆర్‌సీపీకి చెందినవారిపై నమోదు చేశామన్నారు. నాన్‌బెయిలబుల్ నేరాలైనందున ముందస్తు బెయిలు మంజూరు చేయొద్దన్నారు. ఇప్పటికే పోలీసులు కొందరిని అరెస్ట్ చేశారన్నారు. న్యాయమూర్తి నిర్ణయాన్ని శుక్రవారానికి వాయిదా వేశారు.

పీఎఫ్ రుణాలపై ఆంక్షలు ఎత్తివేయాలి: ఎస్టీయూ

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పి.ఎఫ్ నుంచి రుణాల మంజూరుపై ప్రభుత్వం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్. జోసఫ్ సుధీర్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. వైద్య ఖర్చులు, ఇంటి నిర్మాణం తదితర అత్యవసర ఖర్చులకు.. తాము పొదుపు చేసుకున్న పి.ఎఫ్ నుంచి రుణాల మంజూరు చేయించుకుందామంటే వాటిపై ఆంక్షలు విధించడంతో ఉద్యోగులు, పింఛనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక శాఖ సత్వరమే స్పందించి అన్నిరకాల బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఆ రోజు జయలలిత స్నానాల గదిలో పడ్డారు

- అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం
- విచారణ కమిషన్‌కు వివరించిన శశికళ

ఈనాడు డిజిటల్, చెన్నై: జయలలిత మరణంపై విచారణ నిమిత్తం ఏర్పాటైన జస్టిస్ ఆర్ముగస్వామి కమిషన్‌కు చిన్నమ్మ శశికళ పలు విషయాలను వెల్లడించారు. 2016 సెప్టెంబరు 22న ఏం జరిగిందనే వివరాలను ఆమె తరఫున కమిషన్‌కు గత వారం దాఖలు చేశారు. అందులో.... ఆ రోజు రాత్రి 9:30కి పోయెస్‌గార్డెన్‌లోని వేదనిలయంలో జయలలిత స్నానాల గదిలో పడిపోయారని, తాము గుర్తించి ఆస్పత్రికి తీసుకెళ్తామన్నా ఆమె తిరస్కరించారని శశికళ పేర్కొన్నారు. ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో వెంటనే వైద్యులను పిలిచానని తెలిపారు. వారు పరిశీలించి అంబులెన్సును రప్పించారని చెప్పారు. ఆమె ఆస్పత్రిలో ఉన్నప్పుడు ప్రస్తుత అప్పటి ఇన్‌ఛార్జి గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఓ పన్నీర్‌సెల్వం, లోక్‌సభ ఉప సభాపతి తంబిదురై, ఆరోగ్య శాఖ మంత్రి విజయ భాస్కర్, అన్నాడీఎంకే నేతలు పలువురు చూశారని పేర్కొన్నారు. దీనికి భిన్నంగా పన్నీర్‌సెల్వం, తంబిదురై గతంలో తాము ఆస్పత్రిలో 'అమ్మ'ను చూడలేదని పేర్కొనడం గమనార్హం. ఇద్దరు భద్రతాధికారులు కూడా జయలలితతో మాట్లాడారని శశికళ వివరించారు. జయలలిత ఆస్పత్రిలో ఉన్నప్పుడు ఆమె అనుమతితో నాలుగు వీడియోలు తీశామని.. వాటిని కమిషన్‌కు సమర్పిస్తున్నట్లు తెలిపారు. 2016 సెప్టెంబరు 22వ తేదీ కంటే ముందే జయలలిత జ్వరంతో బాధపడ్డారని చెప్పారు.

జయ ముఖ్యమంత్రి కావడం వెనుక నటరాజన్!

- విశ్రాంత ఐఏఎస్ అధికారి చంద్రలేఖ

జయలలిత ముఖ్యమంత్రి కావడం వెనుక శశికళ భర్త ఎం.నటరాజన్ ఉన్నారని, రాజకీయ సలహాదారుగా ఆయన కీలక పాత్ర పోషించారని విశ్రాంత ఐఏఎస్ అధికారి వీఎస్ చంద్రలేఖ పేర్కొన్నారు. నటరాజన్ మృతదేహానికి నివాళి అనంతరం ఆమె మాట్లాడుతూ.. తొలిసారి ముఖ్యమంత్రిగా జయలలిత బాధ్యతలు స్వీకరించిన సమయంలో నటరాజన్ ఆమెకు సహాయకారిగా నిలబడ్డారని చెప్పారు. జయలలిత వ్యక్తిగత వీడియోగ్రాఫర్‌గా మారిన శశికళకు ఆమెతో ఆత్మీయ సంబంధం ఏర్పడింది. ఈ నేపథ్యంలో జయలలితకు నటరాజన్ రాజకీయంగా సలహాలు ఇచ్చారని చంద్రలేఖ తెలిపారు. ముఖ్యమంత్రి ఎంజీఆర్ మరణంతో పార్టీలో పరిస్థితులను ఎదుర్కోవడంలో, పట్టు సాధించటంలో, పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి తొలిసారిగా జయలలిత ముఖ్యమంత్రి కావడంలో నటరాజన్ కీలక పాత్ర పోషించారని చంద్రలేఖ అభిప్రాయపడ్డారు.

పారిశుద్ధ్య కార్మికురాలి నిజాయతీ

- చెత్తలో దొరికిన రూ.1లక్షా 20వేలను యజమానికి అప్పగించిన వైనం

మెట్‌పల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఓ పారిశుద్ధ్య కార్మికురాలు నిజాయితీకి నిదర్శనమీ సంఘటన.. . జగిత్యాల జిల్లా మెట్‌పల్లి బల్దియాలో పారిశుద్ధ్య కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న మద్దెల లక్ష్మీ బుధవారం ఉదయం పట్టణంలోని కూరగాయల మార్కెట్లో ఊడుస్తుండగా నల్లరంగుతో ఉన్న కవరు కనిపించింది. అనుమానం వచ్చి దాన్ని పరిశీలించగా అందులో లక్షా ఇరవైవేల రూపాయల డబ్బుల కట్టలు కనిపించాయి. ఈలోగా స్థానిక చికెన్ సెంటర్ యజమాని షేక్. జావీద్ వచ్చి డబ్బులు పోయాయంటూ లబోదిబోమన్నారు. అదే సమయంలో అక్కడికి వచ్చిన లక్ష్మీ తనకు దొరికిన డబ్బుల కవర్ విషయం చెప్పి అతనికి అందజేశారు. మంగళవారం రాత్రి తన దుకాణాన్ని మూసి వేసి ఇంటికి వెళ్లే సమయంలో చెత్త కవర్‌కు బదులు డబ్బులున్న కవర్‌ను చెత్త కుప్పలో పడేసి వెళ్లిపోయినట్లు జావీద్ చెప్పారు. బుధవారం ఉదయం దీన్ని గుర్తించి కంగారుగా మార్కెట్‌కు వచ్చి ఆందోళన చెందారు. కార్మికురాలు లక్ష్మీ నిజాయితీకి మెచ్చుకొని ఆమెకు జావీద్ రూ.5వేలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు.



డబ్బులు తిరిగి ఇస్తున్న బల్దియా కార్మికురాలు లక్ష్మి

ఏపీ వైద్య ఆరోగ్యశాఖ విధానాలు భేష్: కేంద్రం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అమలు చేస్తున్న పనితీరు సూచీ, ఇతర విధానాలు ఉత్తమ ఆచరణ యోగ్యమైనవని కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ పేర్కొంది. సచివాలయంలో ప్రత్యేక కమాండ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రభుత్వాసుపత్రులకు వస్తున్న రోగులు, వారి వ్యాధులు, అవసరమైన పరీక్షల నిర్వహణ, జరుగుతున్న శస్త్రచికిత్సలు ఇతర సమాచారాన్ని నెల, మూడు నెలలకోసారి విశ్లేషిస్తూ ప్రత్యేకంగా బులిటెన్లు విడుదల చేస్తుంది. ఆ సమాచారాన్ని జిల్లా అధికార యంత్రాంగానికి ఎప్పటికప్పుడు పంపిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ విధానాలను ప్రశంసించిన కేంద్రం.. జాతీయ స్థాయిలో అమలుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాన్ని కుదుర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అదనపు కార్యదర్శి, జాతీయ ఆరోగ్య మిషన్ సంచాలకులు మనోజ్ ఈ మేరకు రాష్ట్రానికి లేఖ పంపారు.

ఈనాడు

చట్టం స్ఫూర్తికి ఎత్తుపీట

దేశంలో హక్కుల ఉల్లంఘన జరుగుతూ ఉంటే తాను మౌన ప్రేక్షక పాత్రకు పరిమితం కాలేనన్న సర్వోన్నత న్యాయస్థానం తాజా వ్యాఖ్యలు- సదుద్దేశంతో రూపొందిన చట్టం దురుపయోగం కావడం పట్ల ధర్మాగ్రహాన్ని ప్రస్ఫుటీకరిస్తున్నాయి. షెడ్యూల్డు కులాలు, తెగల (అత్యాచారాల నిరోధక) చట్టం కింద తప్పుడు కేసులు జోరెత్తుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో, సుప్రీం ధర్మాసనం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బాంబే హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుభాష్ కాశీనాథ్ మహాజన్ అనే ప్రభుత్వ ఉద్యోగి వేసిన అప్పీలు విచారణలో ధర్మాసనం పలు చేదు నిజాల్ని ధ్రువీకరించింది. ఈ చట్టం కింద ఎందరో అమాయకులు నిందితులుగా నిలవాల్సి వస్తోందని, విధి నిర్వహణలో ప్రభుత్వ సేవకులు బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్న కోర్టు మాటల్లో- 'వ్యక్తిగత కక్షలు తీర్చుకోవడానికి, వేధింపులకు గురిచేయడానికి శాసననిర్మాణం జరగలేదు!' పుట్టుకను హేళన చేస్తూ తమను అవమానించారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే తొలుత ప్రాథమిక దర్యాప్తు చేపట్టాలని, నిర్ణీత పద్ధతిలో ముందస్తు అనుమతులతోనే అరెస్టులు చేయాలని ధర్మాసనం కొత్తగా గిరిగీసింది. కేసు ఉద్దేశపూర్వకంగా బనాయించిందని న్యాయమూర్తి భావించిన పక్షంలో ముందస్తు బెయిలు ఇవ్వగల వెసులుబాటునూ కల్పించింది. వెరసి, ఇకమీదట- ఎస్సీ ఎస్టీ చట్టం కింద ఏకాయెకి అరెస్టులు కుదరవన్నది ధర్మాసనం 89 పేజీల ఉత్తర్వుల సారాంశం. ఎస్సీ ఎస్టీలను ఫోనులో దూషించినా నేరమేనని, అందుకు గరిష్ఠంగా అయిదేళ్ల కారాగారం తప్పదని నాలుగు నెలల క్రితం ఇదే సుప్రీంకోర్టు స్పష్టీకరించింది. దళితులూ గిరిజనులపై మౌలిక, భౌతిక దాడుల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్న న్యాయస్థానమే నేడా చట్టం కింద అమాయకులు వేధింపులకు గురికారాదన్న మానవీయ భావనకు ఎత్తుపీట వేసింది. తద్వారా, సమవర్తి పాత్రను సమర్థంగా పోషించినట్లయింది!

చట్టం దృష్టిలో సమానత్వాన్ని గాని, శాసనాలు ప్రసాదించే సమాన రక్షణను గాని ఏ పౌరుడికీ నిరాకరించరాదని భారత రాజ్యాంగంలోని పద్నాలుగో అధికరణ నిర్దేశిస్తోంది. దేశ పౌరులందరికీ సమానంగా న్యాయం సమకూరడానికి ప్రభుత్వ చర్యలు చేపట్టాలని ఆదేశిక సూత్రాలు ఉద్బోధిస్తున్నాయి. ఆ స్ఫూర్తి నుంచి ఆవిర్భవించిన 1989నాటి ఎస్సీ ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భుజస్కంధాలపై గురుతర బాధ్యత మోపింది. అణగారిన వర్గాలకు గౌరవప్రద జీవనం కల్పించే లక్ష్యంతో తెచ్చిన చట్టం క్రమేపీ రాజకీయ కక్ష సాధింపు పరికరంగా దిగజారడం దురదృష్టకరం. ధర్మాసనం ఉటంకించిన జాతీయ నేర రికార్డుల సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాలు, క్షేత్రస్థాయి అవ్యవస్థను సూచిస్తున్నాయి. ఎస్సీ ఎస్టీ చట్టం కింద 2015లో నమోదైనవాటిలో 15-16 శాతం తప్పుడు ఫిర్యాదులేనన్న యథార్థం నివ్వెరపరుస్తోంది. కోర్టుల పరిశీలనకు వచ్చిన కేసులలో 75 శాతం మేర నీరుకారిపోతున్నాయి. 2013-15 మధ్య ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, పశ్చిమ బంగ వంటిచోట్ల ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదైన కేసులలో నేరనిర్ధారణ 10 శాతం లోపేనని కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తప్పుడు కేసుల ఉరవడి కళ్లకు కడుతున్నా చట్ట నిబంధనల్ని సవరించే యోచనేదీ లేదని అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్ సింగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నెల్లాళ్ల క్రితం సుప్రీంకోర్టుకు నివేదించింది. ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛగా జీవించే హక్కుందని, ఏ కారణంగానైనా ఎవరూ దాన్ని కోల్పోవడం సహించరానిదంటున్న సుప్రీం ధర్మాసనం మానవీయ సంస్కరణల స్ఫూర్తికి- తమవంతుగా ప్రభుత్వాలిప్పుడు గొడుగు పట్టాల్సి ఉంది!

దుర్వినియోగం ఎంత నిజమో, అసలు అటువంటి కఠిన నిబంధనలతో కూడిన చట్టం పుట్టుకకు కారణమైన అమానుష సామాజిక దమనకాండ అంతకన్నా బాధాకర వాస్తవం. దళితులపై దాడులు పెరుగుతున్నాయని, సకాలంలో కేసులు నమోదు కావడం లేదని జాతీయ ఎస్సీ కమిషన్ ఇటీవలే తీవ్ర ఆందోళన వ్యక్తపరచింది. సామాజిక, ఆర్థిక బహిష్కరణ, కులం పేరుతో దూషణ, శిరోముండనం, మీసాల తొలగింపు, మెడలో చెప్పులతో ఊరేగింపు... తదితరాల్ని నేరాలుగా పేర్కొంటూ 2015లో సవరణలు చేపట్టాల్సి రావడం- కొనసాగుతున్న వివక్షకు, అగని వేధింపులకు ప్రబల దృష్టాంతం. నిరుడు మధ్యప్రదేశ్‌లో దళితుల మంచినీటి బావిలో కిరోసిన్ కలిపిన ఘటన, తెలుగు గడ్డపైనే వాకపల్లి ఉదంతం వంటివి దళితులు గిరిజనులపై హింసాదౌర్జన్యాలది అంతులేని కథగా నిరూపిస్తున్నాయి. ఎస్సీ ఎస్టీల రాజ్యాంగబద్ధ హక్కుల్ని నూరుశాతం మేర పరిరక్షించగలిగితేనే అందరూ సమానమేనన్న సురుచిర భావన సాకారమవుతుంది. అందుకోసం- వేధింపులు, దాడులకు గురైన బాధితులందరికీ ఆర్థిక, సామాజిక పునరావాసం కల్పించడంతోపాటు ప్రత్యేక ఉప ప్రణాళికల అమలుకూ ప్రభుత్వాలు నిబద్ధత చాటాలి. విద్య, వైద్య రంగాల్లో బడుగుజనం పరిస్థితి అధ్వానంగా ఉందంటున్న మానవాభివృద్ధి నివేదికలు- ఆదేశిక సూత్రాల అమలుకు పెద్దపీట వేయడంలో ప్రభుత్వాల వరస వైఫల్యాలనే బోనెక్కిస్తున్నాయి. నిమ్నవర్గాల ప్రయోజనాల్ని కంటికి రెప్పలా కాపాడుకునే క్రమంలో ఏ దశలోనూ కులం అడ్డుగోడ కారాదని, కక్షలూ వేధింపులకు తావుండరాదన్న సువిశాల దృక్పథం సర్వోన్నత న్యాయస్థానం తాజా స్పందనలో ఉట్టిపడుతోంది. ప్రభుత్వాల వాస్తవిక కార్యాచరణ తదనుగుణంగా రాటుతేలితే, రాజ్యాంగ నిర్మాతలు అభిలషించిన సమన్యాయం సాకారమయ్యేందుకు బాటలు పడతాయి!



తరుగుతున్న జలం తల్లడిల్లుతున్న జనం



వెరుకూరి వీరయ్య

ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది నిర్వహించే ప్రపంచ జల దినోత్సవానికి 'నీటి సమస్యకు ప్రకృతి సిద్ధమైన పరిష్కారం' అనే ఇతివృత్తాన్ని ప్రకటించింది. 21వ శతాబ్దంలో ప్రపంచ దేశాలు నీటిసవాళ్లను ఎలా ఎదుర్కోవాలో చర్చించి, పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుంది. అందుకు అనుగుణంగా జలసంరక్షణ, అభివృద్ధి, పొదుపుగా వినియోగం తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరచాలి. మారిన పరిస్థితుల్లో ప్రతి ఒక్కరికీ సురక్షితమైన నీరు అందించటం అసాధ్యమవుతోంది. 'సమ్మిళిత అభివృద్ధి కోసం జలాలు' నినాదంతో 2018 నుంచి 2028 వరకు పదేళ్లపాటు నీటి నిర్వహణ తీరుతెన్నులకు ప్రాధాన్యం ఇవ్వాలని 2016 డిసెంబరులో ఐరాస నిర్ణయించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు 67 కోట్లకు పైగా ప్రజలకు తాగటానికి, గృహావసరాలకు సురక్షితమైన నీరు లభించడం లేదు. గత్యంతరం లేక వీరు కలుషిత నీటిని వాడి రోగాల బారిన పడుతున్నారు.

తగ్గుతున్న నీటి లభ్యత

భూతలంపై సుమారు 70 శాతం సముద్రాలు, నదుల రూపంలో నీరు ఆవరించి ఉంది. భూమిపై సుమారు 140 కోట్ల ఘన కిలోమీటర్ల నీటి పరిమాణం ఉన్నట్లు అంచనా. ఇంత పెద్ద మొత్తంలో నీరు ఉన్నప్పటికీ, తాగడానికి గుక్కెడు నీటి కోసం ప్రజలు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. భూతలంపైగల మొత్తం 140 కోట్ల ఘన కిలోమీటర్ల నీటి పరిమాణంలో 97.3 శాతం (136.2 కోట్ల ఘన కిలోమీటర్లు) సముద్రాల ఉప్పునీటి రూపంలో ఉంది. మిగిలిన 2.7 శాతం (3.8 కోట్ల ఘ. కి.మీటర్లు) మంచినీటిలో అధికభాగం ధ్రువప్రాంతాల్లో మంచు రూపంలో గడ్డకట్టుకొని నిరుపయోగంగా ఉంది. మంచినీటిలో కేవలం ఒక్క శాతం అంటే 38 లక్షల ఘన కిలోమీటర్ల నీరు మాత్రమే మానవాళి వినియోగానికి అందుబాటులో ఉంది. ఈ కొద్దినీరైనా సమానంగా అందితే అది జనాభా అవసరాలకు సరిపోతుంది. కానీ నీటి లభ్యత దేశాల మధ్య, ప్రాంతాల మధ్య మారుతుండటం వల్ల సమస్య జటిలమవుతోంది. దేశంలో భూతలంపై గల సగటు వార్షిక జల లభ్యతను (నదీ జలాలను) 1,86,900 కోట్ల ఘన మీటర్లుగా అంచనా వేశారు. రుతుపవన ఆధారిత వాతావరణం, స్థలాకృతి, భూవిజ్ఞాన సంబంధిత పరిమితుల వల్ల ఏటా 69,000 కోట్ల ఘనమీటర్ల నీరు మాత్రమే జలాశయాల్లో నిల్వ చేయవచ్చునని నిర్ధారించారు. దీనికి అదనంగా 432 ఘన మీటర్ల భూగర్భజలం సైతం అందుబాటులో ఉంది. దేశంలో అందుబాటులో ఉండే భూతల, భూగర్భ జలాల మొత్తం పరిమాణం 1,12,200 (69,000+43,200) కోట్ల ఘనమీటర్లు.

దేశంలో భూతల ప్రవాహ రూపంలో ఉన్న 1,869 ఘన కిలోమీటర్లు దాదాపు స్థిరమైన పరిమాణమనే చెప్పాలి. 1951లో జనాభా 36.11 కోట్లుగా ఉన్నప్పుడు, సగటు తలసరి నీటి లభ్యత 5,176 ఘనమీటర్లు. 2017 నాటికి జనాభా 135.3 కోట్లకు పెరిగి తలసరి నీటిలభ్యత 1,382 ఘనమీటర్లకు తగ్గిపోయింది. 2050 నాటికి జనాభా 164 కోట్లకు పెరుగుతుందని అంచనా. అప్పుడు తలసరి నీటిలభ్యత 1,140 ఘన మీటర్లకు తగ్గిపోతుంది. వార్షిక తలసరి నీటి లభ్యత 1,700 ఘనమీటర్ల కంటే తక్కువగా ఉన్న ప్రాంతాలను 'నీటి ఒత్తిడి' ప్రాంతాలనీ, 1000 ఘనమీటర్లకు తక్కువగా గల ప్రాంతాలు నీటి కొరత ప్రాంతాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. ఆ ప్రకారం చూస్తే దేశం ఇప్పటికే నీటి ఒత్తిడి గల స్థాయికి చేరుకుంది. భవిష్యత్తులో జనాభా పెరిగి, తలసరి నీటిలభ్యత 'నీటి కొరత' ప్రమాణాలకు తగ్గిపోయే ప్రమాదముంది. ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ వార్షిక వర్షపాతం 966 మిల్లీమీటర్లు. అనంతపురం జిల్లాలో కనిష్ఠంగా 554, కోస్తా జిల్లాల్లో గరిష్ఠంగా 1217 మిల్లీమీటర్ల వరకు ఉంటుంది. గోదావరి, కృష్ణా, పెన్న వంటి పెద్ద నదులేగాక, నాగావళి, వంశధార, చంపావతి, శారద, వరాహ, తాండవ, ఏలేరు, ఎర్రకాల్వ, తమ్మిలేరు, రామిలేరు వంటి మరో 37 మధ్య, చిన్న తరహా నదులు జలాల్ని అందిస్తున్నాయి. ఈ నదులలో నిర్దిష్టంగా లభ్యమయ్యే 1,916 శతకోటి ఘనపుటడుగులు (టీఎమ్‌సీ)కు తోడు, మరో 355 టీఎమ్‌సీలు భూగర్భజలంలో, మొత్తం 2271 టీఎమ్‌సీల నీరు రాష్ట్రంలో అందుబాటులో ఉంటుంది. అయినప్పటికీ కొన్ని ప్రాంతాలు తాగునీటికి, మరికొన్ని ప్రాంతాలు సాగునీటికి ఇబ్బంది పడుతున్నాయి. ఇందుకు కారణం ఈ జలరాశి అన్ని ప్రాంతాలకూ సమానంగా విస్తరించి ఉండక పోవడం, దాన్ని సక్రమంగా నిర్వహించుకొని, సమర్థమంతంగా వినియోగించుకోలేకపోవడం! రాష్ట్రంలోని మొత్తం 199 లక్షల ఎకరాల సేద్యయోగ్యమైన భూమిలో ప్రస్తుతం 101 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి సౌకర్యం ఉంది. నిర్మాణంలోని ప్రాజెక్టులు పూర్తయితే, అదనంగా సుమారు మరో 36 లక్షల ఎకరాలకు నీరు అందుతుంది. మిగిలిన 62 లక్షల ఎకరాలకు నీరు అందించడానికి గల అవకాశాలను అధ్యయనం చేయాలి. ఇందుకోసం నదుల అనుసంధానం, వరద నీటిని కొరత ప్రాంతాలకు మళ్లించడం, వాననీటి





నేడే ప్రపంచ జలదినోత్సవం



సంరక్షణ, భూగర్భ జలాలను పెంపొందించుకోవడం, సమర్థంగా నీటిని వినియోగించుకోవడం, పంట మార్పిడి తదితర ప్రక్రియలను చేపట్టడం అవసరం.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కాళేశ్వరం ఎత్తిపోతల పథకం పనులు వేగంగా జరుగుతున్నాయి. ప్రాణహిత నది గోదావరిలో కలిసిన తరవాత మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మించి 180 టీఎమ్‌సీల నీటిని వెనక్కు ఎల్లంపల్లికి మళ్లించడంతోపాటు, భూగర్భజలంతో కలిపి 225 టీఎమ్‌సీల నీటిని వినియోగించుకొని కొత్త ఆయకట్టు, స్థిరీకరణ కలిపి 37 లక్షల ఎకరాలకు ఈ పథకం ద్వారా ప్రయోజనం కలగనుంది. హైదరాబాద్ మహానగరానికి తాగునీటికి 30 టీఎమ్‌సీలు, పారిశ్రామిక అవసరాలకు 16 టీఎమ్‌సీలు, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు పది టీఎమ్‌సీలు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పనులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది. మొత్తం సాగునీటి రంగానికి చేసిన వ్యయంలో 40 శాతానికిపైగా దీనికే ఖర్చు చేసింది. 12.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేసేందుకు పాలమూరు-రంగారెడ్డి, నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ ప్రాంతానికి నీటి సరఫరాకు దిండి ఎత్తిపోతల, ఖమ్మం జిల్లా అవసరాలకు సీతారామ ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, దేవాదుల తదితర ప్రాజెక్టుల కింద చెరువులను నింపడంతోపాటు ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. వెనకబడిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జలయజ్ఞంలో భాగంగా చేపట్టిన ప్రాజెక్టుల ద్వారా 40 టీఎమ్‌సీలకు పైగా నీటిని విడుదల చేసింది. చిన్ననీటివనరుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ చేపట్టిన 'మిషన్ కాకతీయ' పనులు కూడా చురుగ్గా జరుగుతున్నాయి. నాలుగు దశల్లో 28,652 చెరువులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటికే 17వేల చెరువుల పనులు పూర్తయ్యాయి. మరో వైపు ఇంటింటికి పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు 'మిషన్ భగీరథ'ను చేపట్టింది.

సంరక్షణ ప్రక్రియలు

కొన్ని నదీ పరీవాహక ప్రాంతాల్లో అతివృష్టి వల్ల వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో అనావృష్టి కారణంగా నీటికొరత ఏర్పడుతోంది. వీటిని నివారించడానికి 1960లో డాక్టర్ కె.ఎల్.రావు 2,640 కిలోమీటర్ల పొడవైన కాలువ ద్వారా గంగా నదీజలాలను కావేరీకి మళ్ళించడానికి 'గంగ-కావేరి' అనుసంధాన పథకాన్ని రూపొందించారు. అంతకంటే ముందు 4,200 కిలోమీటర్ల పొడవైన హిమాలయ ప్రాంత కాలువను, 9,300 కిలోమీటర్ల పొడవైన ద్వీపకల్ప కాలువతో అనుసంధించడానికి కెప్టెన్ దస్తూర్ 'గార్లెండ్ కాలువ' పథకాన్ని రూపొందించారు. ఇవి ఆచరణయోగ్యం కావంటూ కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. వరదలు, కరవులను నివారించడానికి, నదుల అనుసంధానాన్ని చేపట్టాలని సుప్రీంకోర్టు 2002 అక్టోబరు 31న కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు అప్పటి కేంద్రమంత్రి సురేశ్‌ప్రభు నేతృత్వంలో ఎనిమిది మందితో కమిటీని ఏర్పాటుచేశారు. ప్రవాహ పరిమాణం ఎక్కువగా ఉన్న 14 హిమాలయ నదులను, తక్కువగా గల 16 ద్వీపకల్ప నదులతో అనుసంధించడానికి జాతీయ ప్రణాళిక రూపొందించారు. ఇవి అంతర్రాష్ట్ర నదులు కావడంవల్ల రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం కొరవడి, నదుల అనుసంధాన ప్రక్రియ కార్యరూపం దాల్చలేదు. వర్షాకాలంలో రుతుపవనాలు, ఇతర కాలాల్లో మంచు కరగటం ఫలితంగా ఉత్తర భారతంలో జీవనదులైన బ్రహ్మపుత్ర, గంగ నదుల్లో ఏడాది పొడుగునా ప్రవాహం ఉంటోంది. దక్షిణ భారతదేశంలోని మహానది, గోదావరి, కృష్ణ, పెన్న తదితర నదుల్లో వానలు కురిసినప్పుడే అధికంగా నీరుంటుంది. ఇతర కాలాల్లో ప్రవాహం అరకొరగానే ఉంటుంది.

నీటిలో సుమారు రెండు శాతం మాత్రమే నదులు, సరస్సులు, చిత్తడి నేలలు తదితర భూతల వనరులలో ఉండగా, మిగిలిన నీటిలో ఎక్కువ భాగం భూగర్భంలోనే ఉంది. ఏటా వాననీరు ఇంకుతున్నందు వల్ల భూగర్భ జల పరిమాణం క్రమంగా పెరుగుతోంది. నీటి ఉనికి, లోతు, ఆర్థిక కారణాలవల్ల భూగర్భంలో ఉన్న నీటిని పూర్తిగా వెలికితీయడం సాధ్యపడదు. గృహావసరాలు, వ్యవసాయం, పరిశ్రమలకు పెరుగుతున్న అవసరాలను తీర్చేందుకు భూగర్భజలాల్ని వినియోగించుకోవలసిన అవసరం ఉంది. తోడినకొద్దీ భూగర్భ జలమట్టం తగ్గిపోతుంది. నిరంతర ప్రక్రియగా వాన నీటిని భూమిలోకి చొప్పించడం ద్వారా భూగర్భ జలమట్టం తగ్గిపోకుండా చూడాలి. ఆ నీటిని అత్యవసర సమయాల్లో మాత్రమే ఉపయోగించుకోవాలి. అల్పవర్ష ప్రాంతాల్లో అడవులు పెంచి, తద్వారా వర్షపాత సాంద్రతను పెంచడానికి ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. దీనివల్ల వర్షపాతం పెరిగి సాగు, తాగునీరు, పరిశ్రమలకు కావలసిన నీరు లభిస్తుంది. అల్ప వర్ష ప్రాంతాల్లో ఎత్తిపోతల పథకాల కింద తుంపర, బిందు వంటి సూక్ష్మ సాగునీటి విధానాలను అమలు చేయాలి. తద్వారా 50 నుంచి 60 శాతం నీటిని పొదుపు చేసుకోవచ్చు. రైతులకు అవసరమైతే రాయితీ ఇవ్వడం ద్వారా ఇలాంటి సాగు విధానాలను కొనసాగించాలి. 2004-05లో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ నియమించిన సంఘం సమర్పించిన నివేదికలో నదీవ్యవస్థను సక్రమస్థితిలో ఉంచాలంటే, దానిలో కనీస ప్రవాహం ఉండేటట్లు చూడాలని సిఫార్సు చేసింది. నదులపై అవసరమైన చోట్ల జలాశయాలను నిర్మిస్తే, జీవ నదుల్లోనే కాక, ఇతర నదుల్లోనూ పర్యావరణ పరిరక్షణకు అవసరమైన కనీస ప్రవాహం కొనసాగించడానికి వీలవుతుంది. ప్రకృతి సిద్ధమైన జలసంరక్షణ ప్రక్రియల ద్వారా నీటి సమస్యలను చాలావరకు పరిష్కరించవచ్చు!

(రచయిత- సాగునీటి రంగ నిపుణులు)



వీరేంద్ర కపూర్

నీరవ్‌పై నిరర్థక రభస

నీరవ్ మోదీ- పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై అరుపులు కేకలతో పార్లమెంటు అమూల్య సమయం పదేపదే వృథా అవుతోంది. గౌరవనీయ పార్లమెంటు సభ్యులు వాగ్వివాదంలో అంతూ పొంతూలేని టెలివిజన్ చర్చలను మించిపోయారంటే అతిశయోక్తి కాదు. ఇక్కడొక ముఖ్యమైన తేడా ఉంది. టీవీ ఛానళ్లు సొంత ఖర్చుతో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే, పార్లమెంటు సభ్యులు ప్రజాధనంతో కాలహరణం చేస్తున్నారు. పదేపదే అడ్డుతగులుతూ సభలు తరచూ వాయిదా పడటానికి కారకులవుతున్నారు. సభ విచ్ఛిన్నమైన ప్రతిసారీ పార్లమెంటు సభ్యుల జీతభత్యాలను తెగ్గోయాలనే ప్రతిపాదన ఏమైందో వారికే తెలియాలి. నీరవ్ మోదీ కుంభకోణం పేరు చెప్పి పార్లమెంటును స్తంభింపజేసిన కాంగ్రెస్ పార్టీ, నీరవ్‌కి పాలక పార్టీ పెద్దలతో సంబంధాలున్నట్లు నిరూపించే ఏ చిన్న సాక్ష్యాన్నీ సమర్పించలేకపోయింది! ఇందిరాగాంధీ జమానా మొదలుకొని యూపీఏ పాలన వరకు ఫోన్ల ద్వారానే వ్యవహారం నడిపించడం ఆనవాయితీగా ఉండేది. ప్రస్తుత ఎన్‌డీఏ పాలనలోనూ అలాగే జరుగుతున్నట్లు కాంగ్రెస్ నిరూపించగలదా అంటే అలాంటి అవకాశమే లేదని చెప్పాలి. ఏ సాక్ష్యాధారాలు లేకుండా నీరవ్ మోదీ-మెహుల్ చోక్సీల అక్రమాలతో నరేంద్ర మోదీ ప్రభుత్వానికి ముడిపెట్టడం కుదరదు!

పసలేని ఆరోపణలు

నీరవ్, చోక్సీలు వేల కోట్ల రూపాయల బ్యాంకు ధనం బొక్కేసి విదేశాలకు పలాయనం చిత్తగించారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. వారు పరారు కాకుండా నిరోధించడానికి పాస్‌పోర్టులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదని నిలదీస్తున్నాయి. ఇది అర్థరహిత ప్రశ్న. ఎటువంటి ఆరోపణలు లేని వ్యక్తుల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకోవడం చట్టపరంగా సాధ్యపడదని, అలాచేస్తే కోర్టుల మందలింపులకు గురికావలసి వస్తుందని ప్రతిపక్షాలకు తెలియదా? ఉదాహరణకు రాహుల్ గాంధీనే తీసుకుందాం. రూ.2,000 కోట్ల నేషనల్ హెరాల్డ్ ఆస్తుల కేసులో నిందితుడైన రాహుల్ ప్రస్తుతం బెయిలు మీద ఉన్నారు. ఒకవేళ ఆయన చెప్పాపెట్టకుండా విదేశాలకు పారిపోతే అందుకు మోదీ ప్రభుత్వాన్ని నిందించగలమా? అనుమానితులకు దేశం విడిచివెళ్లే ఆలోచన ఉందని ప్రభుత్వం ఫిర్యాదు చేసినంత మాత్రాన, కోర్టులు వారి అరెస్టుకు ఆదేశాలు జారీచేయవు. దోషి అని నిరూపణ కానంతవరకు నిందితుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడానికి ఒప్పుకోవు. ఇందువల్లనే గతంలో విజయ్ మాల్యా, లలిత్ మోదీలు దేశం విడిచివెళ్లగలిగారు. అంతెందుకు? కార్తి చిదంబరం క్రిమినల్ కుట్రకు పాల్పడ్డారని, నల్లధనాన్ని తెలుపులోకి మార్చడానికి తోడ్పడ్డారని నమ్మడానికి గట్టి ఆధారాలు ఉన్నా కూడా ఆయన పాస్‌పోర్టును స్వాధీనం చేసుకోవడానికి న్యాయస్థానం



పార్లమెంటులో కాంగ్రెస్ అహేతుక వైఖరి

అంగీకరించలేదు. విదేశాలకు వెళ్లి సాక్ష్యాలను తారుమారుచేసే ప్రమాదం ఉందని తెలిసి కూడా న్యాయస్థానం ఇందుకు సమ్మతించలేదు.

మొత్తం మీద నీరవ్ మోదీ కుంభకోణంపై తక్షణం చర్చ జరిగే ఏర్పాటు చేసి ఉంటే వ్యవహారం ఇంత పెద్దదై ఉండేది కాదేమో? ఆ పనిచేయకపోవడం ద్వారా ప్రభుత్వమే ఇంత రభసకు తావిచ్చింది. అసలు ప్రభుత్వ పెద్దలకు నీరవ్-చోక్సీలతో ముడిపెట్టే బలీయ సాక్ష్యమేదీ చూపకుండానే ప్రతిపక్షం నానాయాగీ చేస్తోంది. ఏదో ఒక సందర్భంలో ప్రధాని మోదీ, చోక్సీని మెహుల్ భాయ్ అని సంబోధించారట. ప్రతిపక్షం అదొక్కటి పట్టుకుని ప్రధానిని ఇరికించాలని చూస్తోంది. ఆ మాటకొస్తే లాలు ప్రసాద్ యాదవ్ పశుగ్రాస కుంభకోణంలో నిందితుడని తెలిసీ ఏళ్లతరబడి ఆయనతో భుజాలు పూసుకొని తిరిగినవారి మాటేమిటి? లాలూకు తోడుగా వారెవరూ జైలుకు వెళ్లలేదుగా! సాటి గుజరాతీ అయిన మెహుల్‌ను సంప్రదాయం ప్రకారం భాయి అని ప్రధాని మోదీ సంబోధించారే తప్ప అంతకుమించి చెప్పుకోవడానికి మరేం లేదు. పోనీ, కాగితంపులి వంటి రాహుల్ గాంధీ వద్ద ప్రధాని మోదీని పీఎన్‌బీ కుంభకోణంతో ముడిపెట్టే సాక్ష్యాలేవైనా ఉంటే వాటిని 24 గంటలూ ప్రసారమయ్యే టీవీ ఛానళ్లలో చాటింపు వేయవచ్చుగా! ఈ కుంభకోణంతో మోదీ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధమూ లేదు కనుకనే రాహుల్ ఆ పని చేయలేకపోతున్నారు. అసలు కాంగ్రెస్ హయాములో చెంచాగిరీ చేసినవారికే బ్యాంకుల్లో ఉన్నత పదవులు కట్టబెట్టేవారు. అప్పట్లో ఆర్థికమంత్రి వ్యక్తిగత సహాయకుడో లేక ప్రధానమంత్రి సహాయకుడో ఒక్క ఫోన్ కాల్ చేసి అంతేవాసులకు వందల కోట్ల రూపాయల రుణాలు విడుదల చేసేలా బ్యాంకులపై ఒత్తిడి తీసుకురాగలిగేవాడు. అదే ఇప్పుడు బ్యాంకుల పుట్టిముంచింది. రాహుల్ పార్టీ ఈ విధంగా అనేక ప్రభుత్వ బ్యాంకులను గుల్లచేసి, ఇప్పుడు తీరిగ్గా మోదీ ప్రభుత్వం మీద పడుతోంది!

మరోమాట

న్యాయమూర్తులకు దురుద్దేశాలు అంటగట్టడం, వారి నిజాయతీని శంకించడం ఈమధ్య ఎక్కువైంది. జడ్జి లోయా కేసు, కార్తి చిదంబరం కేసు ఇందుకు ఉదాహరణలు. ఈ రెండు కేసుల్లో న్యాయ వ్యవస్థ హుందాతనానికి, సంస్థాగత ప్రమాణాలకు భంగం వాటిల్లింది. మొదటి కేసులో న్యాయవాది కఠినమైన ప్రశ్నలన్నింటినీ కోర్టు తనకే వేస్తూ ప్రభుత్వ న్యాయవాది పట్ల మెతగ్గా వ్యవహరిస్తోందని ఆరోపించారు. న్యాయస్థానం పక్షపాత వైఖరి ప్రదర్శిస్తోందని ఆయన ఉద్దేశం. న్యాయపరమైన అంశాలను లేవనెత్తడం ద్వారా కాక, చిల్లర ఆరోపణలతో ఆయన సమాచార సాధనాల్లో హడావుడి చేయడం నిజంగా చోద్యం. కార్తి కేసులోనూ నిందితుడి తరఫు న్యాయవాది ఇలాంటి ఆరోపణలే చేశారు. న్యాయస్థానం ప్రభుత్వ న్యాయవాది చెప్పుచేతల్లో పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికా, బ్రిటన్‌లలో కనుక న్యాయస్థానాలపై ఇలాంటి ఆరోపణలు చేస్తే పర్యవసానం చాలా తీవ్రంగా ఉంటుది. భారత్‌లో మాత్రం న్యాయమూర్తులకు చీమ కుట్టినట్లయినా లేదు. మన కోర్టుల్లో డిఫెన్స్ న్యాయవాదుల ధోరణి, లోక్‌సభలో పాలక పార్టీపై ప్రతిపక్షాల తీరును తలపిస్తోందంటే అతిశయోక్తి కాదు. దురుసు ప్రవర్తన ప్రతిపక్ష రాజకీయ నాయకులకు చెల్లుతుందేమో కాని, న్యాయవాదులకు చెల్లకూడదు కదా!

రాజకీయ కక్షలు తీర్చుకోవడానికి కోర్టును ఉపయోగించుకునే ధోరణి ఈ మధ్య ఎక్కువైంది. దీనికితోడు న్యాయమూర్తుల వ్యక్తిత్వంపైన, పనితీరు, నాణ్యతపైన సందేహాలు తలెత్తుతున్నాయి కూడా. న్యాయవ్యవస్థ ఎలాంటి అనుమానాలకు, ఆరోపణలకు, విమర్శలకు తావులేకుండా నడుచుకోవాల్సి ఉంది. అందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి కూడా!

భక్తి గ్రంథం

భక్తి, జీవితం- వేర్వేరు కావు. మానవ జీవితంలో భక్తి ఓ అంతర్వాహిని. భక్తితత్వంలో కుల మతాల ప్రస్తావనే ఉండదు. దానికి వయోసంబంధ తారతమ్యతా లేదు. స్వరాలు వేరైనా, భక్తిభావన ఉద్దేశం ఒక్కటే. సర్వాంతర్యామి ముందు మోకరిల్లడం, భక్తిని స్వీకరించాలని కోరడం... అంతే!

సంజీవని వంటిది భక్తి. నిస్తేజం ఆవహించిన జాతిని అది చైతన్యపరుస్తుంది. పలు పాయలుగా మారి, జీవన సంస్కృతిలోకి చేరి, సమాజాన్ని ఉద్ధరిస్తుంది. ఆదిశంకరులు, భక్త కబీరు, గురునానక్ వంటివారు భక్తిని ఆలంబనగా చేసుకొని, జనచైతన్యానికి కృషి సాగించారు. జ్ఞానానికి తల్లి 'భక్తి' అంటారు రమణ మహర్షి. దేవతారాధనే భక్తి కాదు. అది జీవన విధానం. తల్లి దైవంతో సమానమంటాయి శాస్త్రాలు. అదే మాతృభక్తి. తండ్రి, ఆచార్యుడు సహా ప్రాణులందర్నీ దైవస్వరూపాలుగా భావించాలని ఉపనిషత్తులు బోధిస్తున్నాయి.

అపార భక్తితత్వాన్ని అలవరచుకోవడం వల్ల అమృతత్వం సిద్ధిస్తుందని హనుమంతుడు, మార్కండేయుడు వంటి చిరంజీవుల గాథలు వెల్లడిస్తాయి. భక్తినే యోగంగా మలచి శ్రీకృష్ణుడు గీతాబోధ చేశాడు. దైవ నామ స్మరణ అనుక్షణం సాగాలి. అది లేని సమయమే మానవజీవితంలో నష్టభాగమని హనుమంతుడు ఒక సందర్భంలో రాముడితో అంటాడు. అర్ధ నిమిష కాలం భగవద్భక్తి లేకుండా గడిపినందుకు ప్రతిగా, త్రిలోకాధిపత్యం ఇచ్చినా నిజభక్తులు అంగీకరించరని భాగవతం చెబుతుంది.

మోక్ష సాధకులు తప్పనిసరిగా భక్తిమార్గాన్ని అవలంబించాలి. బ్రహ్మదేవుడు మోక్షప్రాప్తికి మూలాన్ని అన్వేషిస్తాడు. ధర్మదృష్టితో వేదాల్ని ఆమూలాగ్రం చదువుతాడు. భక్తితో తప్ప మోక్షం సాధ్యం కాదని చివరికి నిశ్చయించుకుంటాడు. భక్తి సోపాన అధిరోహణం వల్లనే పరమపదం సాధ్యమవుతుందని 'నారద భక్తిసూత్రాలు' విపులీకరిస్తాయి. జీవితాన్ని భక్తిగ్రంథంగా భావిస్తే, అందులోని ప్రతి పుటలోనూ పరమేశ్వర



అంతర్యామి

సాక్షాత్కారం లభిస్తుంది. బాల్యం, యౌవనం, వృద్ధాప్యం... ఇలా అన్ని దశలూ భగవత్ ఆరాధనకు అనుకూలమే! ప్రహ్లాదుడు పసివాడిగా ఉండగానే మోక్షప్రాప్తికి నవవిధ భక్తిమార్గాల్నీ బోధిస్తాడు.

శరీరంలో శక్తిసామర్థ్యాలు ఉన్నంతవరకు, కోరికలు మనిషిని విడిచిపెట్టవు. 'దైహిక వాంఛామగ్నుడినై నీమీద భక్తిని విడవలేను' అని రామదాసు అంటాడు. జీవిత చరమదశలో నీ దివ్యనామం స్మరించగలనో లేదో... అప్పుడు చేయాల్సిన నామస్మరణా ఈ క్షణమే చేసే భాగ్యాన్ని కలిగించాలని రాముణ్ని ప్రార్థిస్తాడు.

అన్నమాచార్యుడు పదకొండు రకాల భక్తిమార్గాల్ని ప్రబోధించాడు. దైవంతో సంబంధం గల ప్రతి ఒక్క చర్యా ఏదో ఒక భక్తి మార్గంలోకి చేరుతుంది. భగవంతుడికి తన భక్తులతో పాటు వారి భక్తుల పట్ల కూడా అత్యధికమైన అభిమానం అని భారతోక్తి. అన్నమయ్య ఇంకో అడుగు ముందుకు వేశాడు. ఎంత వెతికినా సామాన్యులకు హరిదర్శనం దుర్లభం. అందువల్ల హరి భక్తుల్నే భక్తితో పూజించాలంటాడు. 'ఆయన విలాసం ఆయనకు మాత్రమే తెలుసు' అంటాడా వాగ్గేయకారుడు. మనసులో తననే నమ్ముకున్న భక్తులకు ఎటువంటి హానీ జరగదని పరమాత్మ అభయమిచ్చాడు. రక్షణనిచ్చాడు. ఆ భక్తుల కథలమయమే భాగవతం!

బంగారం వంటి లోహాల్ని అగ్ని దహనం చేసినట్లే, భక్తుడు ఆర్తితో చేసే భగవన్నామ స్మరణ పాపాల్ని దహిస్తుంది. పరమాత్మే మనసులో నిండిన వ్యక్తి, భక్తి అనే అమృతసాగరంలో తరిస్తాడు. అతణ్ని ఏవీ ప్రలోభపెట్టలేవని పురాణాల సారాంశం. తులసీదాసు రామచంద్రుడి దివ్యానుగ్రహమే కోరతాడు. శ్రీచరణ సన్నిధి తప్పించి ఎటువంటి సంపదల్నీ ఆశించనంటాడు. ప్రాణులన్నింటిలోనూ పరమేశ్వరుణ్ని దర్శించడమే నిజమైన భక్తి. ఆ భక్తుడే మోక్షాన్ని పొందగలడంటుంది 'వివేక చూడామణి'. దేవుణ్ని ప్రసన్నం చేసుకోవాలని, ఆయనకు ప్రియభక్తులం కావాలని అందరికీ ఉంటుంది. ఏ లక్షణాలున్న భక్తుడు తనకు ఇష్టమైనవాడో గీతాచార్యుడు తెలియజేశాడు.

ప్రాణికోటి పట్ల దయ కలిగినవాడు, స్థితప్రజ్ఞుడు, నిత్యసంతోషి అయిన భక్తుడే పరమేశ్వరుడికి ప్రీతిపాత్రుడు కాగలడు!

– జి.రామచంద్రరావు

జపాన్ తరహాలో ఆందోళన, అభివృద్ధి

- కుటుంబ సమేతంగా శ్రీవారి సేవలో తరించిన చంద్రబాబు

తిరుమల - న్యూస్‌టుడే

రాష్ట్రం కోసం జపాన్ తరహాలో ఆందోళన చేస్తూ అభివృద్ధి చేసుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఆందోళన చేసి అభివృద్ధి మర్చిపోతే మరల వెనకబడిపోతామని, అభివృద్ధి చేసుకుంటూనే... మనకు జరిగిన అన్యాయంపై మాట్లాడకపోతే కూడా నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. ఆందోళన, అభివృద్ధి సమాంతరంగా సాగించాల్సిన అవసరం ఉందని, ఈ బాటలోనే తాను పయనించదలుచుకున్నానని తెలిపారు. మనవడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సమేతంగా చంద్రబాబు బుధవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం ఎదుట ముఖ్యమంత్రి మాట్లాడుతూ "మా మనవడు దేవాన్ష్ మూడు సంవత్సరాల వయస్సు పూర్తిచేసుకుని నాలుగో ఏడాదిలో అడుగుపెడుతున్నాడు. మా ఇంటి కులదైవం శ్రీవేంకటేశ్వరస్వామి. అందుకే దేవాన్ష్‌కు అన్నప్రాసన, అక్షరాభ్యాసం తిరుమలలోనే చేశాం. పుట్టిన రోజున శ్రీవారిని దర్శించుకోవడం, సొంత నిధులతో ఒకరోజు భక్తులకు అన్నప్రసాద వితరణకు శ్రీకారం చుట్టాం. దేవాన్ష్ ఒక మంచి పౌరుడిగా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాం"అని వివరించారు.

రాష్ట్రం కోసం ఇలా వేడుకున్నా...

"విభజన హామీల అమలు కోసం కేంద్రంతో పోరాడాల్సిన పరిస్థితి వచ్చింది. కేంద్రానికి ఎన్ని విధాలుగా మొరపెట్టుకున్నా వినకపోవడంతో లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి దేశంలోని అన్ని పార్టీల సహకారం తీసుకుని రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరుతున్నాం. ఈ పోరాటం కొనసాగుతుంది. ఈ సందర్భంగా శ్రీవేంకటేశ్వరస్వామి చల్లగా చూసి మన సమస్యలన్నీ పరిష్కారం చేసే దిశగా ఆశీర్వదించాలని ప్రార్థించాను. మీ సన్నిధి ఉండే రాష్ట్రంలో తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని కాపాడాలి, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగేలా ఆశీర్వదించమని స్వామివారిని కోరుకున్నా. తెలుగుజాతి దేశంలోనే కాదు, ప్రపంచంలో ఎక్కడున్నా అత్యున్నత స్థానంలో ఉండాలని వేడుకున్నా. నా ప్రార్థనలు స్వామివారు ఆలకిస్తారని ఆశిస్తున్నాను"అని చంద్రబాబు తెలిపారు.



తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద వితరణశాలలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న ముఖ్యమంత్రి

సంప్రదాయాన్ని పాటిస్తూ...

సీఎం చంద్రబాబు తాను ఎంచుకున్న సంప్రదాయాన్ని పాటిస్తూ శ్రీవారిని దర్శించుకున్నారు. మహాద్వార ప్రవేశార్హత ఉన్నప్పటికీ వైకుంఠం-1 నుంచి క్యూలైనులో ఆలయానికి చేరుకున్నారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేష్, కోడలు బ్రాహ్మణి, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఆయన భార్య వసుంధరతో కలిసి వైకుంఠం-1కు చేరుకుని అందరూ తిరుమాడవీధుల గుండా చేరుకున్నారు. ఇక్కడి నుంచి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకోగా తితిదే ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఆలయ అర్చకులు కలిసి సంప్రదాయబద్ధంగా ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ధ్వజస్తంభానికి మొక్కుకుని స్వామి సన్నిధికి చేరుకుని శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం హుండీలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపానికి చేరుకొని పండితుల వేదాశీర్వచనం చేశారు. ముఖ్యమంత్రి, ఇతర కుటుంబ సభ్యులను శ్రీవారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు, చిత్రపటం, నూతన తెలుగు సంవత్సర పంచాంగం అందించారు. అనంతరం అన్నప్రసాద సముదాయంలో కొంత సమయం భక్తులకు అన్నప్రసాద వితరణ ద్వారా శ్రీవారి సేవ చేశారు. యాత్రికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. రూ.26 లక్షల విరాళం తాలూకు రసీదును దేవస్థానం ద్వారా ముఖ్యమంత్రి తితిదే ఈవోకు అందజేశారు. శ్రీవారి దర్శనానికి వెళ్లకముందు చంద్రబాబు ఉదయం పార్టీ ఎంపీలతో తిరుమల నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు.

50 ఏళ్లు దాటిన మత్స్యకారులకు

రూ.1,000 పింఛన్: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: మత్స్యకారుల్లో 50 సంవత్సరాలు దాటిన వారికి నెలకు రూ.1,000 పింఛను అందజేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. రానున్న జూన్ నెలలో కృష్ణా జిల్లాలో నిర్వహిస్తామన్నారు. రైతు కష్టాలను తీర్చే చర్యల్లో భాగంగా రుణమాఫీ కింద మూడు దశల్లో 15,800 కోట్ల రూపాయలను చెల్లించామన్నారు. వ్యవసాయ రంగంలో కేంద్ర విధానాలు సంతృప్తికరంగా లేవని, ఉండదలచలేదన్నారు. కందుల విషయమే తీసుకున్నా పండే పంటకి... కేంద్రం కొనుగోలుకు అంగీకరించిన దానికి మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. కేంద్రానికి స్పష్టమైన వైఖరి ఉంటే తరచూ ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. శాసనసభలో బుధవారం మధ్యాహ్నం 'వ్యవసాయ రంగం'పై ఆయన మాట్లాడారు. వ్యవసాయం, అనుబంధ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయంలో జాతీయ సగటు కంటే రాష్ట్రం అధిక వృద్ధిరేటు సాధించిందని తెలిపారు. "కాంగ్రెస్ పాలనలో 1978 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. విత్తనాలు, ఎరువులు అందక పోలీసు లాఠీలతో దెబ్బ తిన్న రైతుల గురించి ఎవరూ మరచిపోరు. గడచిన నాలుగు సంవత్సరాల్లో 248 మంది రైతులు మరణించారు. వివిధ పరిస్థితుల్లో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే రూ.5 లక్షలను నష్టపరిహారం కింద అందజేస్తున్నాం. ఉద్యాన పంటల్లో రాష్ట్రం అగ్రస్థానంలో ఉండేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాడి పరిశ్రమ, ఆక్వా కల్చర్ ద్వారా రైతుల ఆదాయం పెరుగుతోంది. ఆత్యాధునిక సాంకేతికతను వ్యవసాయ రంగంలో ఉపయోగించడంలో రాష్ట్రం ముందంజలో ఉంది. వర్షపాతం తక్కువగా ఉన్నప్పటికీ భూగర్భ జలాలు పెరిగాయి. ఎవరిగా మారుతుందనుకున్న అనంతజిల్లాను ఉద్యాన పంటల కేంద్రంగా మారుస్తున్నాం. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. నదుల అనుసంధానం ద్వారా 200 టీఎంసీల నీటిని తరలిస్తున్నాం. ఈ ఏడాది చివరినాటికి 52 ప్రాజెక్టుల పూర్తికి కృషిచేస్తున్నాం"అని చంద్రబాబు పేర్కొన్నారు.

'స్వచ్ఛత ఎక్సలెంట్ అవార్డులకు ఎంపిక అభినందనీయం'

ఈనాడు, అమరావతి: కేంద్ర పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వశాఖ దేశవ్యాప్తంగా ప్రకటించిన 57 స్వచ్ఛత ఎక్సలెంట్ అవార్డుల్లో సగం రాష్ట్రానికి దక్కడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డుల కోసం వివిధ రాష్ట్రాల నుంచి అనేక మహిళా సమాఖ్యలు పోటీపడగా రాష్ట్రం నుంచి వెళ్లిన ప్రతిపాదనలపై పది సమాఖ్యలను ఎంపికచేయడం అభినందనీయమని ముఖ్యమంత్రి అన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని బుధవారం నిర్వహించిన సాధికారమిత్ర సదస్సు సందర్భంగా ఆ మహిళా సంఘాలకు ఆయన సూచించారు. అవార్డుల కోసం ఎంపికైన సమాఖ్యల ప్రతినిధులు బుధవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. వీరంతా ఈనెల 23న అవార్డులు అందుకోనున్నారని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ చినతాతయ్య తెలిపారు.

ఏపీ భాజపా పునర్వ్యవస్థీకరణ!

- త్వరలో రాష్ట్ర కమిటీకి కొత్త అధ్యక్షుడు
- పార్టీ వ్యవహారాల కేంద్ర ఇన్‌ఛార్జినీ నియమించే అవకాశం

ఈనాడు - దిల్లీ

ఆంధ్రప్రదేశ్‌లో మిత్ర పక్షం తెలుగు దేశం పార్టీతో సంబంధాలు పూర్తిగా తెగిపోయిన నేపథ్యంలో ఆ రాష్ట్ర పార్టీ కమిటీని పూర్తి స్థాయిలో పునర్వ్యవస్థీకరించేందుకు భాజపా జాతీయ నాయకత్వం సన్నద్ధమవుతోంది. రాష్ట్ర కమిటీకి కొత్త అధ్యక్షుడితో పాటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల కేంద్ర ఇన్‌ఛార్జిని త్వరలో నియమించనుంది. గతంలో రాష్ట్ర వ్యవహారాల కేంద్ర ఇన్‌ఛార్జిగా పనిచేసిన సిద్ధార్థనాథ్ సింగ్ యూపీలో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంలో మంత్రి పదవి చేపట్టారు. అప్పటి నుంచి ఏపీలో భాజపా వ్యవహారాల కేంద్ర ఇన్‌ఛార్జి పదవిలో పూర్తి స్థాయి నియామకం జరగలేదు. భాజపా అధ్యక్షుడు అమిత్ షా ఆదేశాల మేరకు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్‌కే చెందిన రాంమాధవ్ తాత్కాలికంగా ఆ బాధ్యతలను చూస్తున్నారు. జాతీయ స్థాయిలో భాజపా ఎన్నికల వ్యూహ రచనలో రాంమాధవ్ కీలకపాత్ర వహిస్తున్న విషయం తెలిసిందే. జమ్ముకశ్మీర్, అసోం సహా ఈశాన్య రాష్ట్రాల అసెంబ్లీ



ఎన్నికల్లో పార్టీ విజయాల వెనుక రాంమాధవ్ కృషి ఉంది.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న విశాఖపట్నం ఎంపీ కంభంపాటి హరిబాబు స్థానంలో కొత్త వ్యక్తిని నియమించాలని అధిష్ఠానం భావిస్తోంది.

ఇటీవల త్రిపుర అసెంబ్లీ ఎన్నికల్లో భాజపా అనూహ్య విజయం సాధించటంలో కీలక భూమికను వహించిన సునీల్ డియోధర్‌ను ఒడిశా భాజపా వ్యవహారాల కేంద్ర ఇన్‌ఛార్జిగా నియమించవచ్చని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. 2019 లోక్‌సభ ఎన్నికలతో పాటే ఆంధ్రప్రదేశ్, ఒడిశా అసెంబ్లీలకు ఎన్నికలు జరుగుతాయి.

ప్రస్తుతం భాజపా జాతీయ బృందంలో 40శాతం వరకూ పార్టీ పదవులు ఖాళీగా ఉన్నాయి. వీరిలో పలువురు కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వంలో, మరికొందరు వివిధ రాష్ట్రాల ప్రభుత్వాల్లో మంత్రులుగా బాధ్యతలు స్వీకరించటంతో ఈ ఖాళీలు ఏర్పడ్డాయి. ఏప్రిల్‌లో జరగనున్న పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాన్ని పురస్కరించుకొని ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.



ర్యాలీలో పాల్గొన్న ఉమ్మడి హైకోర్టు ఏపీ న్యాయవాదుల సంఘం నేతలు

ఏపీకి ప్రత్యేక హోదా కోసం హైకోర్టు న్యాయవాదుల ర్యాలీ

ఈనాడు, హైదరాబాద్: ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలంటూ బుధవారం ఉమ్మడి హైకోర్టు ఆంధ్రప్రదేశ్ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో న్యాయవాదులు బార్ కౌన్సిల్ గేటు వద్ద సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌ను రక్షించండి, న్యాయం చేయండి, ప్రత్యేక హోదా కల్పించాలంటూ ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం హైకోర్టు బార్ కౌన్సిల్ నుంచి మదీనా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ధనంజయ, కార్యదర్శి బాచిన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ అవినీతిని ఆధారాలతో బయటపెడతాం!

- రాజధాని ఎక్కడో మంత్రులకు ముందే ఎలా తెలుసు?
- జనసేన ప్రతినిధుల వ్యాఖ్య

హైదరాబాద్, న్యూస్‌టుడే: మంత్రి నారా లోకేశ్‌పై చేసిన ఆరోపణలకు తగిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని, అవసరం వచ్చినప్పుడు వాటిని బయటపెడతామని జనసేన స్పష్టం చేసింది. హైదరాబాద్‌లోని జనసేన పరిపాలన కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌ఛార్జి శంకర్‌గౌడ్, ప్రతినిధులు రియాజ్, కృష్ణారావు, పార్థసారధి, అద్దెపల్లి శ్రీధర్ మాట్లాడారు. లోకేశ్ అవినీతిపై సీబీఐ దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ ఎవరి రాజకీయాలకు అడ్డురావడం లేదన్నారు. ప్రతి విమర్శకు తమ వద్ద సమాధానం ఉందన్నారు. అమరావతిలో రాజధాని ఏర్పాటు చేస్తారని ముందే తెలిసి ఏడెనిమిది మంది ఎంపీలు, మంత్రులు భూములు కొనలేదా అని ప్రశ్నించారు. మంత్రి నారాయణ కళాశాలల్లో ఏం జరుగుతుందో ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. కేశినేని నాని ఎన్ని బ్యాంకుల్లో రుణాలు ఎగవేశారో తెలియదా అంటూ ప్రశ్నించారు. జనసేనతో దాదాపు 40 మంది తెదేపా ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని... ఈ విషయంలో తమ వద్ద కన్నా ముఖ్యమంత్రి వద్దే ఎక్కువ సమాచారం ఉందన్నారు.

ప్రేమ జంట ఆత్మహత్య!

ఆనందపురం (విశాఖపట్నం), న్యూస్‌టుడే: విశాఖ నగర పరిధి ఆనందపురం మండలం గుడిలోవలో ఓ ప్రేమజంట బలవన్మరణానికి పాల్పడింది. వీరిని విశాఖ జిల్లా రోలుగుంట మండలం కొవ్వూరుకు చెందిన ఎర్రంశెట్టి హరిబాబు(32), బంటు రేవతి(28)గా గుర్తించారు. హరిబాబు చెట్టుకు ఉరిపోసుకోగా, రేవతి మృతదేహం నేలపై పడివుండడంతో పోలీసులు ఈమె మృతిపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దుర్వాసనను బట్టి మూడు రోజుల కిందటే వీరు మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. ఆసుపత్రికి తరలించేందుకు అవకాశం లేక అక్కడే శవపరీక్ష నిర్వహించి మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పగించారు. రేవతి ఆనందపురం మండలంలో వేర్వేరు చోట్ల చదువుకున్నట్లు స్థానికులు చెప్తున్నారు. హరిబాబుకు గత ఏడాది జూన్ 3న అదే గ్రామానికి చెందిన రాజుకుమారితో వివాహమైంది. ప్రస్తుతం ఆమె నిండు గర్భిణి. హరిబాబుకు పెళ్లయినా ప్రియురాలిపై ప్రేమను వీడలేక బలవన్మరణానికి పాల్పడినట్లు భావిస్తున్నారు. మధురవాడ ఏసీపీ నాగేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆనందపురం సీఐ ఆర్.గోవిందరావు పేర్కొన్నారు.



ఎర్రంశెట్టి హరిబాబు, బంటు రేవతి (పాతచిత్రాలు)

31 మంది ఉన్నతాధికారులకు సింగపూర్‌లో శిక్షణ

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రానికి చెందిన 31 మంది సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు ఏప్రిల్ 1 నుంచి 15రోజుల పాటు సింగపూర్‌లో శిక్షణ తరగతులకు హాజరుకానున్నారు. పాలనా పరంగా అధికారుల్లో నైపుణ్యం, విషయ పరిజ్ఞానం పెంచేందుకు అనువుగా సింగపూర్‌కు చెందిన ఏషియన్ కాంపెటిటివ్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ ఈ తరగతులను నిర్వహించనుంది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదిత్యనాథ్ దాస్, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికల్ వలవన్ తదితర 16మంది ఐఏఎస్‌లు, అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ ఆర్పీ ఠాకూర్ సహా 8 మంది ఐపీఎస్‌లు, ఏడుగురు ఐఎఫ్ఎస్ అధికారులు మొదటి బ్యాచ్ కింద శిక్షణకు హాజరవ్వాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

సాగర్ కుడికాల్వకు నీటివిడుదల నిలిపివేత

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: నాగార్జునసాగర్ కుడి కాల్వకు అధికారులు బుధవారం నీటి విడుదలను నిలిపివేశారు. ఈ సందర్భంగా ఎన్నెస్పీ సీఈ సునీల్ మాట్లాడుతూ.. తాగునీటి అవసరాల నిమిత్తం కుడి కాల్వకు కృష్ణా బోర్డు 7 టీఎంసీలను విడుదల చేయాలని ఆదేశించగా, వాటిని అవసరం ఉన్నప్పుడు వాడుకుంటామని ఏపీ ప్రభుత్వం తెలియజేయడంతో నీటి విడుదలను నిలిపివేసినట్లు చెప్పారు. ఎడమకాల్వకు యాథావిధిగా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కుడి కాల్వకు ఈ నెల 1వ తేదీ నుంచి నీటిని విడుదలను ప్రారంభించారు. బుధవారానికి సాగర్ జలాశయానికి 17,093 క్యూసెక్కుల నీరు వస్తుండగా నీటిమట్టం 522.20 అడుగుల వద్ద ఉన్నట్లు సీఈ తెలిపారు.

డిప్యూటీ కలెక్టర్‌గా కిదాంబి శ్రీకాంత్



విజయవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రానికి చెందిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిదాంబి శ్రీకాంత్‌ను డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. శ్రీకాంత్ ఇండోనేషియా ఓపెన్ సూపర్ సిరీస్‌ను కైవసం చేసుకున్న సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గత ఏడాది జూన్ 28న పౌర సన్మాన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గ్రూపు-1 ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు క్రీడా కోటా ద్వారా ప్రభుత్వ ఉత్తర్వు నంబరు 136ను జారీ చేసింది.

భూ సమీకరణపై విదేశీ ప్రతినిధుల ప్రశంసలు

ఈనాడు డిజిటల్, అమరావతి: అమెరికాలోని వాషింగ్టన్ డీసీలో భూములు, పేదరికం అంశాలపై జరిగిన ప్రపంచ బ్యాంక్ సదస్సులో రాజధాని ప్రాంత భూ సమీకరణ, అమరావతి అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై పలువురు విదేశీ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సదస్సులో పాల్గొన్న సీఆర్‌డీఏ కమిషనర్ చెరుకూరి శ్రీధర్ భూ సమీకరణ, అభివృద్ధి చర్యలపై వివిధ దేశాల ప్రతినిధులకు బుధవారం దృశ్యరూపక ప్రదర్శన ఇచ్చారు. అనంతరం వాషింగ్టన్‌లోని వ్యాపారవేత్తలను కలిసి అమరావతిలో పెట్టుబడులకు గల అవకాశాలను వివరించారు.

జర్నలిస్టులపై దాడులు, వేధింపులపై ఉన్నత స్థాయి కమిటీ

ఈనాడు డిజిటల్, అమరావతి: జర్నలిస్టులపై దాడులు, వేధింపులపై ఉన్నత స్థాయి కమిటీని తిరిగి నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి హోంశాఖ మంత్రి ఛైర్మన్‌గా, సమాచార, పౌర సంబంధాలశాఖ మంత్రి వైస్ ఛైర్మన్‌గా ఉంటారు. వివిధ శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, శాంతి భద్రతల ఇన్స్‌పెక్టర్ జనరల్ సభ్యులుగా ఉంటారు. గుర్తింపు పొందిన 5 జర్నలిస్టు సంఘాల నుంచి ఐదుగురికి, ఇద్దరు పత్రికా యాజమానులకూ ఈ కమిటీలో సభ్యులుగా అవకాశం కల్పించనున్నారు.

నేడు జాతీయ రహదారుల దిగ్బంధం

- ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో నిర్వహణ

ఈనాడు - అమరావతి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు కోసం 'ప్రత్యేక హోదా సాధన సమితి' గురువారం జాతీయ రహదారుల దిగ్బంధానికి పిలుపునిచ్చింది. ఉదయం 10 నుంచి 12 గంటవరకు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారుల్ని దిగ్బంధించి, నిరసన తెలియజేయనుంది. తెదేపాతో పాటు, వైకాపా, జనసేన, కాంగ్రెస్, వామపక్షాలు ఈ కార్యక్రమానికి మద్దతు ప్రకటించాయి. ప్రత్యేక హోదా సాధన సమితి విజ్ఞప్తి మేరకు సంఘీభావం ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం 'సాధికార మిత్ర'ల సదస్సులో తెలిపారు. బుధవారం రాత్రి మంత్రులు కళా వెంకటరావు, యనమల రామకృష్ణుడు, అచ్చెన్నాయుడు, పి.నారాయణ, కాలవ శ్రీనివాసులుతో ముఖ్యమంత్రి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. గురువారం తెదేపా శ్రేణులు జాతీయ రహదారుల పక్కన షామియానాలు వేసుకుని, శాంతియుత సంఘీభావం తెలియజేయాలని ఆదేశించారు. "కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేసిన అన్యాయంపై ఎవరు గళం విప్పినా మా నైతిక మద్దతు ఉంటుంది. ప్రతిపక్షాలు సహా ఎవరు ఆందోళనలు చేసినా సహకరిస్తాం. ఆందోళనలు శాంతియుతంగా జరగాలి. రాష్ట్రాభివృద్ధికి విఘాతంగా మారకూడదు. జపాన్ తరహాలో నల్లబ్యాడ్జీలు ధరించి ఐదారు గంటలు అదనంగా పనిచేద్దాం. నిరాహార దీక్షలు చేసి కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అనంతరం కళా వెంకటరావు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. దిల్లీలో తెదేపా ఎంపీలు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా అన్ని నియోజకవర్గాల్లోను ప్రధాన కూడళ్లలో తెదేపా శ్రేణులు బైఠాయించాలని, నిరసన సభలు, శాంతియుత ఆందోళనలు నిర్వహించాలని సూచించారు. "గతంలో రాష్ట్ర బంద్ శాంతియుతంగా నిర్వహించాం. అదే స్ఫూర్తితో శాంతియుతంగా ఆందోళనలు జరపాలి. వైకాపాతో కలసి పాల్గొంటే విధ్వంసం సృష్టించే ప్రమాదం ఉంది. ప్రత్యేకంగా ప్రజాందోళనలు నిర్వహించాలి. నిరసన సభలు జరపాలి. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ప్రజల్ని చైతన్య పరచాలి" అని పేర్కొన్నారు.

ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే జాతీయ రహదారుల దిగ్బంధం కార్యక్రమానికి మద్దతిస్తున్నట్లు జనసేన ప్రకటించింది. పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున విద్యార్థులకు ఇబ్బంది కలగని సమయంలో రహదారుల దిగ్బంధం చేయాలని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సూచించినట్టు ఆ పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది.

ధరలు పెంచకపోతే సాగు కష్టం

- వ్యవసాయ మంత్రితో ఆయిల్‌పామ్ రైతులు
- ముఖ్యమంత్రితో చర్చించి నిర్ణయిస్తామని హామీ..

ఈనాడు, అమరావతి: ఆయిల్‌పామ్ ధరలు పెంచకపోతే సాగు కష్టమని వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి రైతులు స్పష్టం చేశారు. తెలంగాణలో ఇస్తున్నట్లే ఆంధ్రప్రదేశ్‌లోనూ నూనె రికవరీ 18.43శాతం చొప్పున చెల్లించేలా చూడాలని కోరారు. ధరల నిర్ణయంపై బుధవారం సచివాలయంలో జరిగిన సమావేశానికి రైతులతోపాటు పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రస్తుత ధరలతో సాగు గిట్టుబాటు కావడం లేదని, ఉత్పత్తి వ్యయం టన్నుకు రూ.11వేల వరకు అవుతుందని వివరించారు. నూనె రికవరీ శాతం తెలంగాణతో పోలిస్తే తక్కువగా ఉన్నందున టన్నుకు రూ.1000 నుంచి రూ.1,200 తేడా వస్తోందని చెప్పారు. పాతికేళ్లు దాటిన తోటలు తొలగించడానికి ఒక్కో చెట్టుకు రూ.500 పైనే ఖర్చవుతోందన్నారు. ధరలపై ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. అశ్వారావుపేట, పెదవేగి కర్మాగారాల్లో గెలలకు విడివిడిగా ప్రాసెసింగ్ చేయించాలని నిర్ణయించారు. గెలల నాణ్యత నిర్ధరణకు 8 సేకరణ కేంద్రాల్లో, పరిశ్రమల వద్ద రైతుసంఘాల నుంచి ఇద్దరు ప్రతినిధులు, ఆయిల్‌ఫెడ్ నుంచి ఒకరిని ఉంచాలనే నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ కమిషనర్ చిరంజీవి చౌదరి, ఆయిల్‌ఫెడ్ ఎండీ ఫణికిషోర్, ఆయిల్‌పామ్ సంఘ అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు, రైతులు పాల్గొన్నారు.

పోలవరానికి నిధులు మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టుకు రూ.1,400 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు విశాఖ ఎంపీ, భాజపా ఏపీ అధ్యక్షుడు కంభంపాటి హరిబాబు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి యథావిధిగా సాయం చేస్తూ పోతుందనడానికి ఇది నిదర్శనమని బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ చెప్పారు. గిరిజన, కేంద్ర విశ్వవిద్యాలయాల ఏర్పాటు త్వరలో జరుగుతుందన్నారు.

'నైపుణ్య భాగస్వాముల నియామకం'

ఈనాడు డిజిటల్, అమరావతి: స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు నైపుణ్య భాగస్వాములుగా ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సునీతా కృష్ణన్, వాసవ్య మహిళా మండలికి చెందిన చెన్నుపాటి విద్య, ఇతర స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారిని నియమిస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

ప్రత్యేక హోదాకు సహకరించండి

తెరాసకు ఆప్స్, ఏపీజేఎఫ్ విజ్ఞప్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా విషయంలో తెరాస సహకరించాలని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పోరాట సమితి (ఆప్స్), ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల ఫోరం (ఏపీజేఎఫ్) సంఘాల అధ్యక్షులు ఎస్.రాజారెడ్డి, చెవుల కృష్ణాంజనేయులు విజ్ఞప్తి చేశారు. బుధవారం సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రత్యేక హోదా సాధించే క్రమంలో తెలంగాణ పార్టీలు, ప్రజల సహకారం కోరుతూ హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అందుకు సంబంధించిన గోడపత్రికను జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డితో కలిసి వారు ఆవిష్కరించారు.

'పెద్దిరెడ్డి' కేసు పునర్విచారించండి

- మూడు నెలల్లో విచారణ పూర్తి చేయాలి
- హైకోర్టుకి సుప్రీంకోర్టు ఆదేశం

ఈనాడు, దిల్లీ: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ దాఖలైన కేసు పునర్విచారించాలని ఉమ్మడి హైకోర్టుకి సుప్రీం కోర్టు ఆదేశాలిచ్చింది. గతంలో ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ వెంకటరమణరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర, జస్టిస్ ఖన్విల్కర్, జస్టిస్ చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది ఆనంద్ వాదనలు వినిపిస్తూ ఎన్నికల అఫిడవిట్‌లో 'డిపెండెంట్స్' పేరున ఎలాంటి ఆస్తులు లేవని, భార్య గృహిణి అని పెద్దిరెడ్డి పేర్కొన్నారని, వారి పేరిట సంపాదన ఉందని వివరించారు. పెద్దిరెడ్డి భార్య ఓ ప్రైవేటు సంస్థకు ఎండీగా వ్యవహరిస్తున్నారని, పిల్లల పేరిట కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను కోర్టుకి సమర్పించామన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం ఉమ్మడి హైకోర్టు ఇచ్చిన తీర్పుని పక్కనపెడుతూ 56 పేజీల తీర్పు వెలువరించింది. ఈ కేసు పునర్విచారించాలంటూ హైకోర్టును ఆదేశించింది. తీర్పు ప్రతులు అందిన మూడునెలల్లో వేగంగా విచారణ పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ తీర్పు సందర్భంగా పొన్నాల లక్ష్మయ్య వర్సెస్ కొమ్మూరి ప్రతాపరెడ్డి, పెండ్యాల వెంకట కృష్ణారావు వర్సెస్ పోతుల రామారావు తదితర కేసులను ధర్మాసనం ప్రస్తావించింది.

గుంటూరు- గుంతకల్ మార్గంలో దూసుకెళ్లనున్న రైళ్లు

బెంగళూరుకు పెరగనున్న సూపర్‌ఫాస్ట్ రైళ్లు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు నుంచి బెంగళూరు వరకు విద్యుత్తు లోకోలతో రైళ్లను నడిపేందుకు మార్గం సుగమమైంది. తొలిసారి మచిలీపట్నం నుంచి యశ్వంత్‌పూర్ వెళ్లే కొండవీడు ఎక్స్‌ప్రెస్ రైలును బుధవారం విద్యుత్తు లోకోతో నడిపారు. ఈ రైలును విజయవాడ వరకు డీజిల్‌తో... అక్కడి నుంచి విద్యుత్తు లోకోతో ప్రారంభించారు. త్వరలో గుంటూరు మీదుగా బెంగళూరుకు సూపర్‌ఫాస్ట్ రైళ్లు కూడా రానున్నాయి. సరకుల రైళ్ల వేగం పెరగడంతో పాటు రాకపోకలు అధికమవుతాయి. గుంటూరు- గుంతకల్ మార్గంలో విద్యుదీకరణ పూర్తయినందున బుధవారం నుంచి విద్యుత్తు లోకోలతో రైళ్లను నడుపుతున్నట్లు సీనియర్ మండల వాణిజ్య అధికారి ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇక నుంచి విద్యుత్తు లోకోలతో మచిలీపట్నం-యశ్వంత్‌పూర్-మచిలీపట్నం, హౌరా-సత్యసాయిప్రశాంత నిలయం-హౌరా, పూరి-యశ్వంత్‌పూర్-పూరి ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపుతున్నట్లు వివరించారు.



విద్యుత్తు లోకోలతో బయల్దేరిన రైలును అలంకరించిన లోకోపైలెట్లు

ఉద్యాన వర్సిటీ ఉప కులపతి ఎంపికకు కమిటీ

ఈనాడు, అమరావతి: డాక్టరు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఎంపికకు ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, నాగార్జున విశ్వవిద్యాలయ ఉప కులపతి, ఐకార్ డీజీ లేదా ఆయన సూచించిన వ్యక్తి ఆధ్వర్యంలోని కమిటీ ముగ్గురితో కూడిన ప్యానెల్‌ను తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి అందించాలని కోరింది.

లైవ్‌స్టాక్ యూనిట్లను పశువైద్య శాలలుగా మార్చాలి

ఈనాడు డిజిటల్, అమరావతి: గ్రామీణ ప్రాంతాల్లోని లైవ్ స్టాక్ యూనిట్లను పశు వైద్యశాలలుగా మార్చాలని వెటర్నరీ వైద్యులు రవాణా మంత్రి అచ్చెన్నాయుడికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం సచివాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై తాము 20 రోజులుగా సమ్మె చేస్తున్నట్లు మంత్రికి వివరించారు.



బుధవారం దిల్లీలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతో సమావేశమైన కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్, ఏపీ భాజపా ఎంపీ హరిబాబు

తాత్కాలిక వసతుల్లో తరగతులు!

గిరిజన, కేంద్ర వర్సిటీలపై వెంకయ్యనాయుడు సమీక్ష

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో గిరిజన, కేంద్ర విశ్వవిద్యాలయాల ఏర్పాటు విషయంలో జరుగుతున్న పురోగతిని.. కేంద్ర మానవ వనరుల మంత్రి ప్రకాశ్ జావ్‌డేకర్‌తో కలిసి ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు బుధవారం సమీక్షించారు. విభజన చట్టంలో ఈ రెండు విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జావడేకర్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్, హెచ్‌ఆర్‌డీ కార్యదర్శి రెడ్డిసుబ్రహ్మణ్యం, ఎంపీలు కంభంపాటి హరిబాబు, సుజనాచౌదరిలతో వెంకయ్యనాయుడు పార్లమెంటులోని తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. విశ్వవిద్యాలయాల ఏర్పాటుపై కేబినెట్ నోట్‌ను న్యాయశాఖ పరిశీలనకు పంపామని, అక్కడినుంచి రాగానే మంత్రివర్గం ముందుకు తీసుకొస్తామని జావ్‌డేకర్ వెంకయ్యనాయుడి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే న్యాయశాఖ కార్యదర్శితో మాట్లాడిన ఉపరాష్ట్రపతి.. త్వరగా పరిశీలన పూర్తిచేయాలని సూచించారు. తాత్కాలిక వసతుల్లో విద్యాలయాల తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని జావ్‌డేకర్‌ను కోరారు. ఎన్‌సీఈఆర్‌టీ సంస్థకు భూ కేటాయింపు విషయంపై.. ఏపీ ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్రతో వెంకయ్యనాయుడు ఫోన్‌లో మాట్లాడారు. త్వరగా భూకేటాయింపు పూర్తిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం భూమి ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని జావ్‌డేకర్‌కు వెంకయ్యనాయుడు చెప్పారు. మైసూరులోని ఓరియంటల్ లాంగ్వేజెస్ కేంద్రానికి డైరెక్టర్ నియామకం పూర్తిచేయాలని, దాని తెలుగుశాఖను తెలుగురాష్ట్రాల్లో ఏర్పాటుచేయాలని సూచించారు. దిల్లీ జేఎన్‌యూలో తెలుగు శాఖను ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. వీటిపై సానుకూలంగా స్పందించిన జావ్‌డేకర్.. తక్షణ చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌డీ కార్యదర్శిని ఆదేశించారు.

రాజకీయ మార్పునకు సిద్ధంకండి..!

అభిమానులకు రజనీకాంత్ వీడియో సందేశం



ఈనాడు డిజిటల్, చెన్నై: తన వెనుక దేవుడు, ప్రజలు ఉన్నారని మంగళవారం వ్యాఖ్యానించిన సూపర్‌స్టార్ రజనీకాంత్... రాష్ట్రంలో రాజకీయ మార్పునకు సిద్ధం కావాలని అభిమానులకు బుధవారం దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఒక వీడియోను విడుదల చేస్తూ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. మక్కల్ మండ్రంలో పదవులు దక్కలేదని నిరుత్సాహ పడవద్దని, అందరూ ఐక్యంగా రాష్ట్రంలో భారీ రాజకీయ మార్పునకు సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీ పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే ప్రారంభిస్తామని అందులో స్పష్టం చేశారు. ప్రజలకు సేవ చేయాలని దేవుడు ఒక అవకాశం ఇచ్చాడని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండ్రం సభ్యులు ఉదయం కోడంబాక్కంలోని రాఘవేంద్ర కల్యాణమండపంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రజనీకాంత్ వీడియోను అక్కడ ప్రదర్శించారు. అనంతరం మండ్రం ముఖ్య నాయకుడు రాజు మహాలింగం మాట్లాడుతూ... జిల్లా, క్షేత్రస్థాయి పదవులకు నియామక ప్రక్రియ 85 శాతం వరకు పూర్తయిందని చెప్పారు. మిగిలిన వాటిని కూడా త్వరలోనే భర్తీ చేస్తామని తెలిపారు.

మోకీలు మార్పిడిపై అంతర్జాతీయ శిక్షణ

23న గుంటూరు సర్వజనాసుపత్రిలో..

గుంటూరు, న్యూస్‌టుడే: మోకీలు మార్పిడిపై గుంటూరు సర్వజనాసుపత్రిలో ఈ నెల 23న అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎముకల, కీళ్ల శస్త్రచికిత్స విభాగాధిపతి, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆచార్య వరప్రసాద్ తెలిపారు. సాయిభాస్కర వైద్యశాల, ఉన్నతి ఫౌండేషన్, గుంటూరు సర్వజనాసుపత్రి ఆర్థో విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు బుధవారం గుంటూరులో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. శిక్షణలో భాగంగా సర్వజనాసుపత్రిలోని మాడ్యులర్ శస్త్రచికిత్స మందిరంలో జరిగే మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలను దృశ్య శ్రవణ విధానం ద్వారా గుజరాత్‌లోని వాతిలో జరుగుతున్న ఇంటర్నేషనల్ మాస్టర్స్ కోర్సుకు హాజరవుతున్న 23 దేశాల వైద్యులు ప్రత్యక్షంగా చూస్తారన్నారు. మన రాష్ట్రంలోని పలువురు వైద్యులు కూడా దీన్ని తిలకించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శిక్షణ కార్యక్రమం అధ్యక్షులు బూసిరెడ్డి నరేంద్రరెడ్డి మాట్లాడుతూ మోకీలు మార్పిడిపై అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు దేశవ్యాప్తంగా నాలుగు కేంద్రాలను ఎంపిక చేయగా.. దక్షిణాది రాష్ట్రాల్లో గుంటూరుకు అవకాశం దక్కిందన్నారు.

ఐక్య పోరాటంతోనే బీసీలకు రాజ్యాధికారం

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నగరంపాలెం(గుంటూరు), న్యూస్‌టుడే: ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ పార్టీలు ఒక్కటై పోరాడి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల విజయానికి దోహదపడ్డాయని, అణచివేతకు గురైన సామాజిక వర్గాలు ఏకమైతే రాజ్యాధికారం వశమవుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరులో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యూపీలో 2014 లోక్‌సభ, 2017 శాసనసభ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సామాజికవర్గ రాజకీయ శక్తులు చీలిపోవటంతోనే భాజపా భారీగా సీట్లు సాధించిందన్నారు. ఇటీవలి ఉప ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కలిసి పోటీచేయటంతో అదే పార్టీ ఘోరంగా ఓడిందన్నారు. ఆ స్ఫూర్తితో రాష్ట్రంలో 60శాతానికి పైగా ఉన్న బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఏకతాటిపైకి వచ్చి రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలన్నారు. రాష్ట్రంలోని బీసీలను చైతన్యపరచి త్వరలో కొత్త పార్టీ ఏర్పాటు దిశగా భావి కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఉపాధ్యక్షురాలు ఎస్.లక్ష్మి, అర్బన్ జిల్లా అధ్యక్షుడు కన్నా మస్తార్ పాల్గొన్నారు.

వర్సిటీల బలోపేతానికి చర్యలు

- 1,109 సహాయ ఆచార్యుల పోస్టులకు 76,356 దరఖాస్తులు
- ఒక్కోపోస్టుకు సగటున 69 మంది పోటీ
- వచ్చే నెల 9 నుంచి ప్రాథమిక పరీక్షలు
- మంత్రి గంటా శ్రీనివాసరావు వెల్లడి

ఈనాడు - అమరావతి

రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల బలోపేతానికి మౌలికసదుపాయాలు కల్పించడం సహా ఖాళీలనూ భర్తీ చేస్తున్నామని మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1980 తర్వాత ఏ వర్సిటీలోనూ పోస్టుల భర్తీ చేపట్టలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో 14 విశ్వవిద్యాలయాల్లోని 1,109 సహాయ ఆచార్యుల పోస్టులను భర్తీ చేస్తున్నామని వెల్లడించారు. ఖాళీల భర్తీని పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో తొలిసారిగా ప్రాథమిక(స్క్రీనింగ్) పరీక్ష నిర్వహణ బాధ్యతలను ఏపీపీఎస్సీకి అప్పగించామని చెప్పారు. మౌఖిక పరీక్ష(ఇంటర్వ్యూ)లను మాత్రం విశ్వవిద్యాలయాలే చేపడతాయని ఆయన తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న సహాయ ఆచార్యుల సమస్యపై కమిటీ ఏర్పాటు చేశామని, నివేదిక అనంతరం ఏం చర్యలు తీసుకోవాలో పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతం అన్ని ఉమ్మడి ప్రవేశ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని, ధ్రువీకరణ పత్రాల పరిశీలనా ఆన్‌లైన్‌లోనే చేపడుతామని, కళాశాలల అనుమతులు ఇక ఈ విధానంలోనే ఇస్తామని మంత్రి గంటా వెల్లడించారు. గతంలో ద్రవిడ, రాయలసీమ వర్సిటీల్లో పీహెచ్‌డీ ప్రవేశాలపై ఆరోపణల నేపథ్యంలో ఈసారి పీహెచ్‌డీకి ఉమ్మడి ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఉన్నత విద్యామండలి ఛైర్మన్ విజయ్‌రాజు, ఉపాధ్యక్షుడు నరసింహారావు, కార్యదర్శి వరదరాజన్ పాల్గొన్నారు.

పోస్టుల భర్తీ వివరాలు

- సహాయ ఆచార్యుల పోస్టులు: 1,109
- ప్రాథమిక పరీక్షలు: ఏప్రిల్ 9 నుంచి 13 వరకు
- మొత్తం దరఖాస్తులు: 76,356
- పరీక్షా కేంద్రాలు: అనంతపురం, గుంటూరు, హైదరాబాద్, కడప, కర్నూలు, నెల్లూరు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- ప్రాథమిక పరీక్షలో పేపర్-1 అందరికీ ఉమ్మడిగా ఉంటుంది. ఏప్రిల్ 9న ఉదయం 9.30 గంటల నుంచి 11.30గంటల వరకు బోధన, పరిశోధనపై పరీక్ష ఉంటుంది.
- ఏప్రిల్ 10నుంచి సబ్జెక్టులవారీగా పరీక్షలు.
- పేపర్-1, పేపర్-2 కలిపి మొత్తం 300 మార్కులకు ఉంటుంది
- ప్రతి తప్పునకు 1/3 నెగెటివ్ మార్కులు ఉంటాయి
- ఓసీలకు 40%, బీసీలకు 35%, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 30%గా అర్హత మార్కులను నిర్ణయించారు.

విద్యకు ప్రథమ ప్రాధాన్యం

విజయవాడ, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం విద్యకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర మానవ వనరులశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ కబేలా సెంటరు సమీపంలో రూ.2.50 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఉర్దూ కళాశాల భవనాలకు మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.17 వేల కోట్ల లోటు బడ్జెట్ ఉన్న రాష్ట్రంలో విద్యకు రూ.25 వేల కోట్లు కేటాయించారంటే ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యకు ఎంత ప్రాధాన్యం ఇస్తున్నారో స్పష్టమవుతుందన్నారు. 8వ తరగతి విద్యార్థినులకు సైకిళ్లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఘనత తెదేపా ప్రభుత్వానికే దక్కుతుందని శాసనమండలి విప్ బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ స్థలంలో ఉర్దూ కళాశాల నిర్మాణానికి సహకరించిన మేయరు కోనేరు శ్రీధర్, కమిషనర్ నివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్‌మీరా, మేయర్, కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గంటా, శాసనమండలి విప్ బుద్దా. చిత్రంలో ఎమ్మెల్యే జలీల్, కమిషనర్ నివాస్ తదితరులు

ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టాన్ని నీరుగార్చొద్దు: మధు

విజయవాడ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం దుర్వినియోగం అవుతోందని, సంబంధిత కేసుల్లో నిందితులైన ఉద్యోగులను తక్షణ అరెస్టుల నుంచి మినహాయిస్తూ సుప్రీంకోర్టు బెంచ్ ఇచ్చిన ఆదేశాలను పునఃసమీక్షించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఓ ప్రకటనలో కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలు దళితుల రక్షణ హక్కులను ప్రశ్నార్థకం చేస్తున్నాయని, ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని అనేకమంది దోషులు శిక్షలు పడకుండా తప్పించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఎక్కడైనా చట్టం దుర్వినియోగమైనట్లు నిరూపణ అయితే బాధ్యులను శిక్షించాలి కానీ.. మొత్తం చట్టాన్ని నీరుగార్చే పని చేయకూడదని ఆయన కోరారు. దేశవ్యాప్తంగా దళితులపై పెరుగుతున్న దాడుల దృష్ట్యా వారి రక్షణకు ఈ చట్టాన్ని మరింత కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు బెంచ్ ఆదేశాలను పునఃసమీక్ష చేయాలని ఆయన కోరారు.

సచివాలయానికి ఏప్రిల్, హైకోర్టుకు మేలో ఆకృతులు

- వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం
- రాజధానిలో 28 రహదారుల నిర్మాణం
- జూన్ 8 నుంచి అన్న క్యాంటీన్లు
- శాసనసభలో మంత్రి నారాయణ



ఈనాడు, అమరావతి: అమరావతి రాజధాని నగరంలో రూ.22,169 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాలు, అభివృద్ధిపై చర్చ సందర్భంగా శాసనసభలో ఆయన మాట్లాడారు. రాజధాని ప్రాంతంలోని 217 కిలోమీటర్ల పరిధిలో 34 రహదారుల నిర్మాణం చేపట్టగా 28 పనులకు టెండర్లు పిలిచామన్నారు. ప్రస్తుతం పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. సచివాలయానికి ఏప్రిల్, హైకోర్టుకు మే నెలలో పూర్తిస్థాయి ఆకృతులు అందుతాయన్నారు. వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తామన్నారు. ఉన్నతాధికారుల గృహనిర్మాణం కోసం నిర్మిస్తున్న 3,840 అపార్టుమెంట్లు డిసెంబరుకల్లా పూర్తవుతాయని చెప్పారు. రాజధాని పరిధిలో మొత్తం రూ.51,706కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు తయారుచేశామన్నారు. జూన్ 8 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. పురపాలక సంఘాల్లోని పాఠశాలల్లో 70 వేల బెంచీలు అవసరమని గుర్తించామని, ఇప్పటికే 8 జిల్లాల్లో పంపిణీ పూర్తయిందన్నారు. లక్ష కంటే తక్కువ జనాభా ఉన్న పురపాలికల్లో మౌలిక సౌకర్యాలకు రూ.3,723 కోట్లతో అంచనాలు తయారు చేశామని వివరించారు. ఆసియా అభివృద్ధి బ్యాంకు ఆర్థిక సహకారంతో టెండర్లు పిలిచి పనులు చేపడతామన్నారు. పురపాలక సంఘాల్లో 9 లక్షల ఇళ్లకు దరఖాస్తులు అందగా 6.81 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పురపాలికల్లో రూ.1.02 లక్షల కోట్లతో అభివృద్ధిపనులు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ ప్రాంతాల విస్తరణ పనులకు రూ.10,742 కోట్లతో అంచనాలు రూపుదిద్దామన్నారు.

గుంటూరు, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులపై కేంద్రం కొత్త విధానాలు రూపొందించిందని వివరించారు. దాని ప్రకారమే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచామన్నారు. భూములిచ్చిన 29 గ్రామాల్లో రైతులకు అభివృద్ధి చేసిన ప్లాట్లు అందించనున్నామన్నారు. ఇప్పటికే 6 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయన్నారు.

నిబంధనలను 'నీట్'గా తప్పించారు

- నీట్ లేకుండానే యునాని మెడిసిన్ సీట్లు
- అడ్మిషన్లను రద్దు చేయాలని ఆరోగ్య వర్సిటీ ఆదేశం



అల్-అరీఫ్ యునాని కళాశాల భవనం

ఈనాడు-సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఫాతిమా వైద్య కళాశాలలోని కొందరు విద్యార్థులు మోసపోయినట్లే.. హైదరాబాద్‌లో ఓ యునాని వైద్య కళాశాల చేతిలో విద్యార్థులు వంచనకు గురయ్యారు. డొనేషన్లను చెల్లించి ఈ కళాశాలలో చేరిన విద్యార్థుల అడ్మిషన్లను ఇప్పుడు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ రద్దు చేసింది. నిబంధనలకు విరుద్ధంగా నీట్ పరీక్ష రాయని విద్యార్థులకు వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం సీట్లను కేటాయించడమే కారణం. హైదరాబాద్ నగర పరిధిలోని చాంద్రాయణగుట్ట సమీపంలోని బండ్లగూడలో అల్-అరీఫ్ యునానీ కళాశాలలో బాచిలర్ ఆఫ్ యునాని మొదటి సంవత్సరం మెడిసిన్ సీట్లు వంద ఉన్నాయి. గతంలో బ్యాచిలర్ ఆఫ్ యునాని మెడిసిన్ సెట్ కింద పరీక్షలు రాసిన విద్యార్థులకే అడ్మిషన్లు ఇచ్చేవారు. మారిన నిబంధనలకు అనుగుణంగా ఈ కళాశాలలో అడ్మిషన్లకు కూడా నీట్ రాసిన విద్యార్థులే అర్హులని మెడికల్ కౌన్సిల్ ఆదేశాలు జారీ చేసింది.

కళాశాల మాయాజాలం: ఇదే సమయంలో యునాని కళాశాల యాజమాన్యం సరికొత్త ఎత్తుగడ వేసింది. కళాశాలలోని 100 సీట్లలో 50 సీట్లు కన్వీనర్ కోటా కింద నీట్ రాసిన విద్యార్థులకే మొదటి ఏడాదికి అడ్మిషన్ ఇచ్చింది. యాజమాన్య కోటా 50 సీట్లను నిబంధనలకు విరుద్ధంగా నీట్ రాయని విద్యార్థులతో భర్తీ చేసింది. 2017-18 విద్యా సంవత్సరానికి ఈ అడ్మిషన్లు జరిగాయి. ఇప్పుడు వారంతా మొదటి సెమిస్టర్ రాయడానికి సిద్ధమవుతున్నారు. ఈ అడ్మిషన్లపై ఫిర్యాదు అందడంతో కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ పరిశీలించి ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. అసలు నీట్ రాయని 50 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చారంటూ వర్సిటీ అధికారులు ఆగ్రహం వక్తం చేశారు. ఈఅడ్మిషన్లను రద్దు చేయాలని వారం కిందట సంబంధిత కళాశాల యాజమాన్యానికి ఆదేశాలు ఇచ్చింది.

ఒక బస్సు.. 363 చలానాలు

రూ.5.02 లక్షల జరిమానా

ఈనాడు, హైదరాబాద్: ఒక వాహనంపై ఏకంగా వందల సంఖ్యలో చలానాలు నమోదైతే ఆశ్చర్యపోవాల్సిందే. ఇలాంటి అరుదైన ఘటన సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో వెలుగు చూసింది. రవాణా శాఖ నిబంధనల ఉల్లంఘనల కింద ఒక వాహనంపై 363 చలానాలు నమోదయ్యాయి. ఆ చలానాల మొత్తం.. ఏకంగా రూ.5 లక్షల పైమాటే. కర్ణాటక రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు (కెఏ01 ఏబీ 5770)పై రూ.5,00,245 మేర చలానాలు జారీ అయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు ప్రయాణికుల్ని తరలించే ఈ బస్సుపై 2014 నుంచి కొద్దిరోజుల క్రితం వరకు ఉల్లంఘనలు నమోదయ్యాయి. వీటికి సంబంధించి ఒక్క చలానా పెండింగ్‌లో లేకపోవడం విశేషం. ఇతర రాష్ట్రానికి చెందిన వాహనం కావడంతో అన్ని ఉల్లంఘనలకూ ట్రాఫిక్‌పోలీసులు ఎప్పటికప్పుడు స్పాట్‌చలానాలే విధించి జరిమానా సొమ్ము వసూలు చేశారు. ఈ బస్సుపై నమోదైన ఉల్లంఘనలన్నీ 'నో ఎంట్రీ టైం'కు సంబంధించినవే.

దూసుకెళ్తే.. జరిమానా రూ1.8 లక్షలు

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే మరో కారుపై భారీ సంఖ్యలో పెండింగ్ చలానాలు నమోదయ్యాయి. హయత్‌నగర్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ ఉద్యోగి నిత్యం పటాన్‌చెరులోని కార్యాలయానికి తన కారులో వెళ్లే క్రమంలో బాహ్యవలయ రహదారిపై ప్రయాణిస్తూ నిబంధనల్ని ఉల్లంఘించారు. ఈ క్రమంలో గత ఏడాది ఏప్రిల్ 4 నుంచి ఇప్పటివరకు ఆ కారు(టీఎస్09ఈఆర్ 2957)పై 127 ఉల్లంఘనలు నమోదయ్యాయి. ఇవన్నీ 'ఓవర్ స్పీడింగ్ (అధిక వేగం)' చలానాలే కావడం గమనార్హం. వాస్తవానికి బాహ్యవలయ రహదారిపై వేగ పరిమితి గంటకు 40-100కి.మీ.లు మాత్రమే. సదరు వ్యక్తి తన కారులో 100-161 కి.మీ.వేగంతో వెళ్తూ స్పీడ్ లేజర్‌గన్‌లకు చిక్కారు. అధిక వేగానికి రూ.1400 చొప్పున చలానా విధిస్తుండటంతో జరిమానా మొత్తం రూ.1,82,245 అయ్యింది.

ఫెరారీ చుట్టూ కేసుల వల

ఈనాడు, హైదరాబాద్: గొలుసుకట్టు మాయాజాలంతో రూ.కోట్లు స్వాహా చేసిన బిలియర్డ్స్ మాజీ చాంపియన్ మైకేల్ ఫెరారీతోపాటు...అతని అనుచర బృందాన్ని పోలీసులు పాత కేసులతో దిగ్బంధనం చేయనున్నారు. తమను అరెస్టు చేయవద్దంటూ వారు సుప్రీం కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో సీసీఎస్ పోలీసులు ఈ కేసుల వివరాలతో కొద్ది రోజుల క్రితం దిల్లీకి వెళ్లి సుప్రీంకోర్టులో కౌంటర్ దాఖలు చేశారు. విహాన్ డైరెక్ట్ సెల్లింగ్, క్యూనెట్ పేరుతో దేశవ్యాప్తంగా గొలుసు కట్టు పథకాలను మైకేల్ ఫెరారీ, అతడి భాగస్వామ్యులు కొన్నేళ్ల క్రితం ప్రారంభించారు. 2016 సంవత్సరం జూన్ నాటికి వివిధ నగరాల్లో ఈ పథకం ద్వారా రూ.400 కోట్లు స్వాహా చేశారు. హైదరాబాద్‌లో బాధితులు క్యూనెట్, విహాన్ డైరెక్ట్ సెల్లింగ్‌పై ఫిర్యాదు చేయడంతో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ పోలీసులు అక్టోబరు 2016లో ఫెరారీని అరెస్ట్ చేశారు. ఆయన ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోనూ క్యూనెట్‌పై కేసులు నమోదైన నేపథ్యంలో సైబరాబాద్ పోలీసులు కూడా సుప్రీం కోర్టులో కౌంటర్ దాఖలు చేస్తే యాజమాన్యం సహా..పలువురు జైలుకు వెళ్లే అవకాశాలున్నాయి. అరెస్ట్ చేసిన అనంతరం ఫెరారీ సహా ఇతర సంచాలకుల ఆస్తులు జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

టెట్ మార్కులపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

- సహాయ కేంద్రాన్ని ఎత్తివేసిన పాఠశాల విద్యాశాఖ
- పరిష్కార వేదికకు అభ్యర్థుల ఫోన్లు

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) తుది 'కీ' ప్రకారం తమకు ఎక్కువ మార్కులు రావాల్సి ఉండగా.. తక్కువ వచ్చాయంటూ అభ్యర్థుల నుంచి పాఠశాల విద్యాశాఖకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు గతంలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాన్ని సైతం ఎత్తివేయడంతో ప్రభుత్వ పరిష్కార వేదిక(1100)కు ఫోన్లు చేస్తున్నారు. ఈ ఫిర్యాదులపై ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై అధికారులు ఇంతవరకు నిర్ణయాన్ని వెల్లడించలేదు. పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, తమ సమస్యలను పరిష్కరించాలని అభ్యర్థులు కోరుతున్నారు. విశాఖపట్నం జిల్లా మునగపాక మండలంలోని ఒకే కోచింగ్ కేంద్రానికి చెందిన 26మంది ఇదే సమస్యపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. తుది 'కీ'లో పేర్కొన్న జవాబుల ప్రకారం మార్కులు ఇస్తే తమకు ఎక్కువ రావాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు. త్వరలోనే ఉపాధ్యాయ నియామక పరీక్ష నిర్వహించనున్నందున టెట్ మార్కులు కీలకంగా మారాయి.

రెండు పర్యాయాలు గాలికి..

టెట్‌ను ఏటా రెండు పర్యాయాలు నిర్వహించాలని జాతీయ ఉపాధ్యాయ విద్య సంస్థ(ఎన్‌సీటీఈ) ఆదేశాలున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నవ్యాంధ్రప్రదేశ్‌లో గత నాలుగేళ్లల్లో ఒక్కసారి మాత్రమే టెట్‌ను నిర్వహించారు. 2014లో టెట్, ఉపాధ్యాయ నియామక పరీక్షను కలిపి నిర్వహించారు. ఆ సమయంలో పరీక్ష రాసిన వారికి ఏడాది పాటు మాత్రమే టెట్ చెల్లుబాటు ఉంటుందని పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం ఒకసారి టెట్ అర్హత సాధిస్తే ఏడేళ్లపాటు చెల్లుబాటు అవుతుంది. ఉపాధ్యాయ నియామకం సమయంలోనే టెట్ నిర్వహించడంతో అభ్యర్థులు ఒకేసారి రెండు పరీక్షలకు సన్నద్ధం కావాల్సి వస్తోంది. టెట్‌లో అర్హత సాధించలేని అభ్యర్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కా తరలిస్తున్న వాహనాలు

పంథా మార్చి గుట్కా రవాణా

- రూ.50 లక్షల విలువైన సరకు, వాహనాలు పట్టివేత

హైదరాబాద్, న్యూస్‌టుడే: భారీ వాహనాల్లో గుట్కా రవాణా చేస్తూ పోలీసులకు దొరికిపోతుండటంతో అక్రమార్కులు తమ పంథాను మార్చుకున్నారు. పోలీసులకు అనుమానం రాకుండా ప్రైవేటు కార్లు, చిన్న సరకుల వాహనాల్లో గుట్కా సంచులను తరలిస్తూ 19మంది 11 వాహనాలతో హైదరాబాద్ పోలీసులకు చిక్కారు. ఈ సరకు విలువ రూ.50లక్షలుగా తేల్చారు. మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ గచ్చిబౌలిలోని తన కార్యాలయంలో బుధవారం విలేకరులకు వివరాలను వెల్లడించారు. నగరంతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 19మంది కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి వేర్వేరుగా 11 వాహనాల్లో గుట్కా సంచులతో నగరంవైపు వస్తున్నట్లు శంషాబాద్ ఎస్‌వోటీ పోలీసులకు సమాచారం అందింది. వారు బుధవారం తెల్లవారుజామునే రాంచంద్రాపురం, చందానగర్ పోలీసులు రాంచంద్రాపురం ప్రధాన రహదారిలో మాటువేసి అక్రమార్కుల వాహనాలను పట్టుకున్నారు. బీదర్‌లోని పవన్ ఛాలియా, ఇండియన్ ఛాలియా స్టోర్‌లలో గుట్కా ప్యాకెట్లు కొని కార్ల డిక్కీల్లో, సీట్ల కింద ఉంచి తెస్తుంటారు. వాటిని నగరం, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్‌ల పరిధితో పాటు కరీంనగర్, జహీరాబాద్, పెద్దపల్లి ప్రాంతాలోని పాన్‌షాపులు, కిరాణా దుకాణాల్లో విక్రయిస్తుంటారు. తాజా కేసులో 10 వివిధ రకాల కార్లు, ఒక మినీట్రక్‌లో మొత్తం 202 బ్యాగుల్లో 883 పెట్టెల్లో రూ.50లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు బయటపడ్డాయి. సమావేశంలో ఎస్‌వోటీ అదనపు డీసీపీ దయానంద్‌రెడ్డి, శంషాబాద్, మాదాపూర్ ఎస్‌వోటీ, రాంచంద్రాపురం ఇన్‌స్పెక్టర్‌లు ప్రవీణ్‌రెడ్డి, పురుషోత్తం, రాంచంద్రరావు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డి, సంపత్‌లకు ఓటు హక్కు లేదు

- స్పష్టం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

ఈనాడు, హైదరాబాద్: సభ్యత్వం రద్దయిన ఇరువురు శాసనసభ్యులకు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వేసే అవకాశం లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం సమయంలో చోటు చేసుకున్న సంఘటన నేపథ్యంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి(నల్గొండ), ఎస్.ఎ.సంపత్‌కుమార్(అలంపూర్)ల శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ శాసనసభ తీర్మానం చేసింది. సభ్యత్వాన్ని రద్దు చేస్తూ సభాపతి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆ రెండు స్థానాలు ఖాళీ అయినట్లు కేంద్ర ఎన్నికల సంఘానికి కూడా ప్రభుత్వం నివేదించింది. కాగా రాజ్యసభ ఎన్నికల్లో వారికి ఓటు హక్కు కల్పించాలని శాసనసభ కార్యదర్శిని కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ క్రమంలో శాసనసభ కార్యదర్శి కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాయగా బుధవారం ప్రత్యుత్తరం వచ్చింది. ఇందులో పోలింగు తేదీ నాటికి శాసనసభ్యులుగా ఉన్న వారికి మాత్రమే ఓటు హక్కు ఉంటుందని స్పష్టం చేసింది. సభ్యత్వం రద్దుపై ఇప్పటివరకు న్యాయస్థానం ఎలాంటి నిలుపుదల(స్టే) ఉత్తర్వులు జారీ చేయని నేపథ్యంలో వారికి ఓటు హక్కు ఉండదని అధికారులు చెబుతున్నారు. పోలింగు తేదీ రోజునాటికి ఉన్న సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసినట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి డాక్టర్ రజత్‌కుమార్ బుధవారం 'ఈనాడు'తో చెప్పారు.

చైనా పర్యటనకు అటవీ అధికారుల బృందం

ఈనాడు, అమరావతి: ఎర్రచందనం విక్రయాలకు సంబంధించి ప్రీబిడ్ సమావేశాల్లో పాల్గొనేందుకు, మార్కెట్ అధ్యయనానికి అటవీ శాఖాధికారుల బృందం చైనాలో పర్యటించనుంది. అటవీశాఖ ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము, ఉత్పత్తి విభాగం పీసీసీఎఫ్ సతీష్‌కుమార్ కౌశిక్‌లు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. ఏప్రిల్ 2 నుంచి 8 వరకూ అక్కడ పర్యటిస్తారు. పర్యటన ముగిసిన వారం వ్యవధిలో నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

'నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి'

ఈనాడు డిజిటల్, అమరావతి: రాష్ట్రప్రభుత్వం 85 వేల మంది పర్యవేక్షణాధికారులకు అందిస్తున్న చరవాణి బిల్లు సౌకర్యం దుర్వినియోగమవుతోందని రాష్ట్ర పింఛన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'ఒక్కొక్క సెల్‌ఫోన్ కనెక్షన్‌కు నెలకు రూ.620 చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రస్తుతం వివిధ టెలికాం సంస్థలు రూ.448కే రెండు నెలలు ఉచిత కాలింగ్ సౌకర్యం కల్పిస్తున్నాయి. అయినా ప్రభుత్వం పాత పద్ధతిలోనే చెల్లింపులు చేస్తోంది. నిధుల దుర్వినియోగాన్ని అరికట్టాలి' అని ఆయన కోరారు.

మకరందం
ఈనాడు
విజయవాడ
7 గురువారం
మార్చి 22, 2018
makarandam@eenadu.in
మా చిరునామా: **మకరందం,** ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



పవిత్ర జీవితం కోసం, ముక్తి కోసం సాధన చేసే యోగులు రామునిలా జీవించాలని అనుకుంటారు. చుట్టూ ఉన్న పరిస్థితులు ఎప్పుడైనా మారొచ్చు. ఎలాగైనా ఉండొచ్చు. నిరీక్షించి.. కాలపరీక్షను ఎదుర్కోవడం వివేకవంతుల లక్షణం. రాముడూ అదే చేశాడు. ఎప్పుడూ ప్రణాళిక బద్ధంగానే జీవితం నడుస్తుందని భావించలేం. మన ప్రమేయం లేకుండా చికాకులు కలుగుతాయి. వాటికి కుంగిపోతే జీవితం గతి తప్పుతుంది. గుచ్చుకున్న ముల్లును నెమ్మదిగా తొలగించి ముందుకెళ్లాలి. అలా చేయగలిగితే అద్భుతమైన అనుభూతి మిగులుతుంది. ఏ విషయాన్నైనా సక్రమంగా నిర్వర్తించే సామర్థ్యం పెరుగుతుంది. రాముడిని ఆదర్శంగా తీసుకోవడం అంటే ఆరాధన కోసం కాదు. మన జీవితాలను మనమే ఉద్ధరించుకోవాలన్నది అందులోని పరమార్థం. త్యాగం, ధర్మం, దయ, పరాక్రమం రామునిలోని గొప్ప లక్షణాలు. వీటిని పెంపొందించుకోవాలని చెప్పేదే రామాయణం.

- సద్గురు జగ్గీ వాసుదేవ్

అందాల రాముడు అందువలన దేవుడు



రాముడిలో ఏమంత గొప్పదనం ఉంది?
మాయలు మంత్రాలు చూపించలేదు.
విశ్వరూపం ప్రకటించలేదు.
జీవితంలో ఎన్నో కష్టాలు... జరగరాని సంఘటనలు...
చిన్న వయసులోనే పినతల్లి స్వార్థానికి తండ్రిని పోగొట్టుకున్నాడు...
పట్టాభిషేక ముహూర్తానికే అడవుల బాట పట్టాడు...
తోడుగా, ఊరటగా నిలుస్తుందనుకున్న భార్యకు దూరమయ్యాడు...
కారడవుల్లో కన్నీళ్లతో వెతికాడు...
అంతులేని దుఃఖాన్ని గుండెల్లో మోస్తూనే రాక్షస వధ చేశాడు...
అందరిలాగే ఉద్వేగాలు, ఆలోచనలు, ఆవేదనలు అనుభవించాడు.
లోకమంతా తనను దేవుడని కీర్తిస్తున్నా తాను మాత్రం విస్పష్టంగా అహం దశరథాత్మజః - దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే' అని ప్రకటించాడు.
అయినా లోకమంతా ఆయననే ఎందుకు ఆదర్శంగా తీసుకుంది?
కారణం..

ఆయన ధర్మాన్ని సంపూర్ణంగా ఆచరించాడు. ధర్మానికి రూపునిస్తే రాముడి రూపం వస్తుందన్నంత పవిత్రంగా జీవించాడు. చేతికి అందివచ్చిన సింహాసనం దక్కక పోయినా, స్వయంగా భరతుడే వచ్చి రాజ్యానికి రమ్మని అడిగినా, ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన సీతను రావణుడు అపహరించినా, సందర్భమేదైనా కానీ.. ధర్మాన్ని విడిచిపెట్టలేదు. అందుకే రామయ్య ధర్మమూర్తి అయ్యాడు. లోకానికి ఒకేఒక్కడుగా నిలిచాడు.

- కప్పగంతు రామకృష్ణ

శాస్త్రధర్మం

తండ్రి మాట కోసం వనవాసానికి సీత, లక్ష్మణులతో కలిసి బయలుదేరాడు శ్రీరామచంద్రుడు. అయోధ్యలో పుత్రవియోగ దుఃఖంతో దశరథుడు మరణించారు. మేనమామ ఇంట్లో ఉన్న భరతుడు వచ్చి దశరథుడికి అంత్యక్రియలు పూర్తి చేశాడు. అన్నను వెతుక్కుంటూ అరణ్యానికి వెళ్లి, తండ్రి మరణవార్త తెలియజేశాడు. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోతాడు రామయ్య. పెద్దకుమారుడినైనా తండ్రికి ఉత్తరక్రియలు చెయ్యలేకపోయానని బాధపడతాడు. అక్కడికక్కడే శాస్త్రబద్ధంగా తండ్రి రూపానికి ఉత్తరక్రియలు చేసి, పిండితో పిండాలు చేసి, దర్భల మీద ఉంచబోయాడు. ఇంతలో బంగారు కంకణాలు ధరించిన ఓ హస్తం రాముడి ముందుకు వచ్చింది. తాను దశరథుడినని, పిండం తన చేతిలో పెట్టమని వాణి వినిపించింది. కానీ, రాముడు ఇందుకు ఒప్పుకోడు. శాస్త్రప్రమాణాలు అనుసరించి, దర్భల మీదే పిండాలు ఉంచుతాడు. నిజంగా నీవు దశరథుడవే అయితే, దర్భల మీద ఉంచిన పిండాలు స్వీకరించు. నేను మాత్రం శాస్త్ర ప్రమాణాన్ని పాటస్తానని నిక్కచ్చిగా చెప్పాడు. తండ్రి వియోగ దుఃఖంలో ఉన్నసమయంలో కూడా **శాస్త్రధర్మాన్ని** తు.చ తప్పకుండా పాటించిన ఆదర్శమూర్తి రామచంద్రమూర్తి ఒక్కడే.

స్నేహధర్మం



మాయలేడి కారణంగా సీతమ్మను వదలి, పర్ణశాలను దాటి చాలా దూరం వస్తారు రామలక్ష్మణులు. ఇదే అదనుగా భావించిన రావణుడు మారు వేషంలో వచ్చి సీతమ్మను అపహరిస్తాడు. ఇదంతా గమనించిన జటాయువు రావణుడిని అడ్డగిస్తాడు. విశాలమైన తన రెక్కలే ఆయుధంగా చేసుకుని, రావణుడిని ముప్పుతిప్పలు పెడతాడు. సహనం నశించిన రావణాసురుడు జటాయువు రెక్కలు నరికివేస్తాడు. రెక్కలు తెగిన ఆ పక్షిరాజు నేలకూలుతాడు. కొన్నాళ్లకు సీతాన్వేషణ చేస్తూ అటుగా వచ్చిన రాముడికి జరిగిన వృత్తాంతం పూర్తిగా చెప్పి, రాముడి చేతిలోనే ప్రాణం విడుస్తాడు. తనకు క్షేమం కలిగించటానికి ప్రాణాలకు తెగించిన జటాయువును ఆప్తమిత్రుడుగా స్వీకరించి, అతడికి ఉత్తరక్రియలు స్వయంగా నిర్వహిస్తాడు రామయ్య. తాను క్షత్రియుడు. చేస్తున్నది వనవాసం. మరణించింది పక్షి. అయినప్పటికీ జటాయువుకు తాను స్వయంగా ఉత్తరక్రియలు చేసి, **స్నేహధర్మానికి** అసలైన అర్థాన్ని ఆచరణాత్మకంగా ప్రకటించాడా మహనీయుడు.

యుద్ధధర్మం

వాలి తన తమ్ముడైన సుగ్రీవుడి భార్య రుమను చెరబట్టాడు. తమ్ముడి భార్య కోడలితో సమానం. మామగారు తండ్రితో సమానం. తండ్రిలాగా కాపాడాల్సిన తమ్ముడి భార్యను కామంతో వాలి కోరుకున్నాడు. అంతేకాదు.. వాలి వనచరుడు. క్రూరత్వం కలిగిన వనచరాలను వేటాడటం క్షత్రియధర్మం. అంతేకాదు, ఎదుటివారి బలాన్ని తగ్గించే వరమాల వాలి మెడలో ఉంటుంది. దాన్ని ధరించిన సమయంలో వాలి ఎదుట ఎవరు నిలిచినా వారి శక్తి క్షీణిస్తుంది. కాబట్టే రాముడు చెట్టుచాటున దాగి, వాలిపై బాణాన్ని ప్రయోగించాడు. ఇది యుద్ధధర్మం. వాలి వధ ఘట్టంలో రాముడు **క్షత్రియ, యుద్ధ ధర్మాలను** పాటించాడు.

రావణ సంహారం తర్వాత విభీషణుడు రాముని వద్దకు వచ్చి, ఉత్తర క్రియలు నిర్వహించేందుకు అన్నగారి పార్థివ దేహాన్ని ఇమ్మని అడుగుతాడు. అప్పుడు రామచంద్రుడు మరణాంతాని వైరాని నివృత్తం నః ప్రయోజనం క్రియతామద్య సంస్కారః మమాప్యేష యథా తవ 'విభీషణా! శతృత్వం ఎంతటిదైనా అది చావుతో ముగిసిపోతుంది. సంధి కుదరకపోవడం వల్ల యుద్ధం చేయాల్సి వచ్చింది. మీ అన్నగారికి ఆచార విధి ప్రకారం ఉత్తర క్రియలు జరిపించు. ఇక నుంచి ఈయన నీకు మాత్రమే కాదు. నాకూ అన్నగారే' అంటాడు... ఇదీ రాముడి ధర్మవర్తన.


దయాధర్మం



సీతను రాముడికి అప్పగించమని హితబోధ చేసిన విభీషణుడికి రాజ్యబహిష్కరణ శిక్ష వేస్తాడు రావణుడు. సముద్రతీరంలో అపారమైన వానరసేనతో ఉన్న రామచంద్రుడి పాదాలను ఆశ్రయిస్తాడు విభీషణుడు. మరో ఆలోచన లేకుండా విభీషణుడికి అభయం ఇస్తాడు రామయ్య. అంతేకాదు, రావణుడిని చంపి విభీషణుడిని లంకా రాజ్యానికి రాజును చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ, సుగ్రీవుడు మొదలైన వారికి ఇదంతా ఇష్టం లేదు. ఏకాంతంలో ఉన్న రామయ్య దగ్గరకు వెళ్లి, విభీషణుడిని నమ్మవద్దని చెబుతారు. అతడు రావణాసురుడి దూత అంటూ హెచ్చరిస్తారు. అంతా విన్న రాముడు విభీషణుడే కాదు... చివరకు రావణుడే తనను ఆశ్రయించినా.. అతడికి కూడా అభయం ఇస్తానంటాడు. ఆశ్రయించిన ప్రాణులకు రక్షణ కల్పించటం క్షత్రియధర్మం. దయాధర్మం కూడా. వనవాసంలో ఉన్నా, చివరకు యుద్ధభూమిలో ఉన్నా **దయాధర్మాన్ని** రామయ్య విడిచిపెట్టలేదు.

మనుష్యధర్మం

రామరావణ సంగ్రామం ముగుస్తుంది. రావణుడు నేలకు ఒరుగుతాడు. ముల్లోకాలూ ఎంతో ఆనందిస్తాయి. వానరసేన చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఇంతలో బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమవుతారు. రాముడిని సాక్షాత్తు శ్రీమహావిష్ణు స్వరూపంగా స్తుతిస్తారు. 'నీది విష్ణు అంశ. వాస్తవానికి నువ్వు నిరాకారుడివి. అయినా సాకారుడిగా ఉన్నావు. సృష్టి, స్థితి, లయలు నీవే నిర్వహిస్తావు...' అంటూ రాముడికి దైవత్వాన్ని ఆపాదిస్తారు.



బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి చెప్పినా రాముడు తాను దైవాన్నని చెప్పుకోలేదు. తనకు దైవత్వాన్ని ఆపాదించుకోలేదు. 'ఆత్మానం మానుషం మన్యే... దశరథాత్మజః' అంటూ తాను కేవలం దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే. సాధారణ వ్యక్తిని మాత్రమే' అంటాడు. ఇదీ రామయ్య పాటించిన మనుష్యధర్మం. రామయ్య ఎక్కడా మాయలు, మంత్రాలు ప్రకటించలేదు. తాను దైవాన్నని చెప్పుకోలేదు. సాధారణ పౌరుడిలాగే రాజ్యభోగాలతో పాటు సుఖదుఃఖాలూ అనుభవించాడు. **మనుష్యధర్మాన్ని** పరిపూర్ణంగా పాటించిన అవతారమూర్తి శ్రీరాముడు.

సోదరధర్మం

రావణ వధ జరిగింది. లంకలో ఉన్న సీతాదేవిని తీసుకురావలసిందిగా విభీషణుడికి వర్తమానం పంపించి, విశ్రాంతిగా కూర్చున్నాడు రామయ్య. దూరంగా ఓ స్త్రీమూర్తి వడివడిగా అడుగులు వేసుకుంటూ తన వైపే వస్తోంది. ఆమె ఎవరై ఉంటుంది? రాముడి ఆలోచన సాగుతుండగానే ఆమె ఎదురుగా వచ్చి నిలుచుంది. అమ్మా! నీవెవరు? ఎందుకిలా వచ్చావు? రక్తసిక్తమైన రణభూమిని చూస్తుంటే నీకు భయంగా అనిపించటం లేదా? నా వల్ల ఏదైనా సాయం కావాలా? అంటూ రామయ్య ఎంతో వినమ్రంగా ఆమెను అడిగాడు. అందుకామె సమాధానం ఇస్తూ, రామచంద్రమూర్తీ! నన్ను మండోదరి అంటారు. నీ చేతిలో మరణించిన రావణాసురుడి భార్యను. రామా! నీవు ధర్మమూర్తివనీ, ఏకపత్నీవ్రతుడవనీ, సీతను తప్ప మరే ఇతర స్త్రీ పేరు కూడా తలచవనీ విన్నాను. నా భర్త అనేకమంది స్త్రీలను చెరపట్టాడు. నీవంటి ఉత్తమ గుణసంపన్నుడైన యోధుడిని చూడాలనే కుతూహలంతో వచ్చాను. పరస్త్రీని చూడగానే వినమ్రంగా ఉన్నప్పుడే నీ ఔన్నత్యం అర్థమైంది. రామా! ధన్యురాలను. ఇక సెలవు. అంటూ నిష్క్రమించింది. ఇదీ.. **పరస్త్రీల పై రామయ్య చూపించే సోదరధర్మం.**

క్రీస్తు వాణి

మనం కోరుకునేది!

ఒక ఊళ్లో చాలా ప్రశాంతత. ఆ ఊరి గురించి బయటివారు చాలా గొప్పగా చెప్పుకుంటారు. గ్రామస్థులు ఎవరూ గొడవలు పడరు. కుటుంబాలు విడిపోవు. అందరూ కలిసి ఉంటారు. ఆ ఊళ్లో పోలీస్ స్టేషన్ కూడా లేదు. కొత్తవారు ఎవరైనా వస్తే.. ఆ ఊరిపెద్ద.. పొలిమేరకు వచ్చి.. గ్రామ నియమాలు చెప్పి దానికి ఇష్టపడితేనే వారిని ఊళ్లోకి రానిస్తారు.



ఇంతకీ ఆ నియమాలు ఏమిటి?

మన అవసరాల కోసం ఏ జాగ్రత్తలు పాటిస్తామో.. మన సహచరుల విషయంలోనూ అదే పాటించాలనేది ఆ ఊరి ప్రధాన నియమం. "ఇతరులు మీకు ఏం చేయాలని కోరుకుంటారో.. ఇతరులకు మీరు అదే చేయండి!" ఈ అద్భుతమైన ఉపదేశం ఇచ్చింది క్రీస్తు ప్రభువు. చిన్న వాక్యమే అయినా ఇందులో ఎంతో అర్థం ఉంది. ఇతరులు మనకు ఏం చేయాలని కోరుకుంటాం? 'ఆనందంగా ఉంచమ'ని. ఇతరులూ మన నుంచి అదే కోరుకుంటారు కదా! ఈ పద్ధతిని పాటిస్తే ఏ సమస్యలూ ఉండవు. సుస్థిరత, శాంతి వెల్లివిరుస్తుంది. ఆ ఊళ్లోనూ అదే నియమంగా పెట్టారు.

ఒక పొరుగువాడు నీస్థానంలో, నువ్వు అతని స్థానంలో ఉన్నప్పుడు.. అతడు నీకు హాని చేయాలని కోరుకుంటావా? అలాగే నీ నుంచి అతడు సహాయాన్ని కోరుతాడు, ప్రేమను ఆశిస్తాడు. సూక్ష్మంగా చెప్పాలంటే దీని అంతరార్థం నీ పొరుగువారిని ప్రేమించమని. మన నడత మెరుగు పరుచుకునేందుకు ఇది ప్రామాణికం.

సమస్త మానవాళి, శాంతియుత సహజీవనం చేయడానికి ప్రభువు చెప్పిన అద్భుత సూత్రం. సామాన్యుల నుంచి పాలకుల వరకు అందరూ ఆచరించదగ్గ మార్గం.

– డాక్టర్ ఎమ్.సుగుణరావు



రాఘవుడు పూజించిన రాముడు

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠంలో మూల సంస్థాన పూజలు ఎంతో ప్రత్యేకం. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులందరూ మూలరాముల పూజలు నిర్వహిస్తుంటారు. దీనిని సంస్థాన పూజ అంటారు. పీఠాధిపతులు ధార్మిక పర్యటనలో ఉన్నా.. వారి వెంట ఈ విగ్రహాలను తీసుకెళ్తారు. మూలరాముల విగ్రహం కృతయుగం నాటి నుంచి పూజలు అందుకుంటోందని చెబుతారు. బ్రహ్మ, ఆంజనేయుడు, జాబాలి రుషి తదితరులు దీనిని అర్చించారని మఠంలోని పండితులు చెబుతారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు పూజించడంతో ఈ విగ్రహానికి మూలరాములు అనే పేరు వచ్చిందట. కాలక్రమంలో సూర్యవంశానికి చెందిన గజపతి రాజు చెంతకు విగ్రహం చేరిందట. అక్కడి నుంచి మధ్వాచార్యులకు అందిందట. నాటి నుంచి మధ్వ సంప్రదాయంలో మూలరాముల విగ్రహ అర్చన కొనసాగుతోంది. రాఘవేంద్రస్వామి సైతం ఈ విగ్రహాన్ని అర్చించారని చెబుతారు. ఏకాదశి రోజున స్వామివారికి నైవేద్యంలేకుండా పూజలు చేస్తారు. శ్రీరామనవమి, దీపావళి పర్వదినాల్లో విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహిస్తారు.

– బాదిని ఉపేందర్

రామచంద్రుడి రాజనీతి

ఊరు పచ్చగా ఉంటే రామరాజ్యం!
వానలు సమృద్ధిగా కురిస్తే రామరాజ్యం!!
సమాజంలో శాంతి వెల్లివిరిస్తే రామరాజ్యం!!
రాముడు ఎలా పరిపాలించాడు..?
ఆయనకు పాలన మీద ఉన్న అవగాహనంతా ఆయన భరతుడిని కుశల ప్రశ్నలు అడిగే సమయంలో బహిర్గతమవుతుంది.

అన్నను తిరిగి రాజ్యానికి రప్పించేందుకు పరివారంతో కలిసి భరతుడు అడవికి వెళ్లాడు. అప్పుడు రాముడు భరతుడిని "ఎలా ఉంటున్నావు? ఎలా పరిపాలిస్తున్నావు?" అని అడిగిన విశేషాలన్నీ అయోధ్యకాండ వందో సర్గలో ఉన్నాయి. అందులోని శ్లోకాల సారాన్ని చూస్తే రాజ్యపాలన మీద రాముడికి ఉన్న పట్టు అర్థమవుతుంది. ఈ సందర్భంగా భరతుడితో రాముడు అన్న మాటలు గుర్తు చేసుకుందాం.



మంత్రులు నీతిశాస్త్ర కోవిదులుగా, శూరులుగా ఉండాలి. మంత్రి మండలిలో ఏ ఒక్కరూ కూడా ప్రలోభాలకు లొంగకూడదు. మంచి ఆలోచనలు,. విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలి. అసలు పాలకుడి దగ్గర ఉండే అమాత్యుడు ఎక్కువ నిద్రపోయే వాడై ఉండకూడదు. ప్రతి విషయాన్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. రాజ్య రహస్యాలను ఎన్నడూ బయటపెట్టకూడదు. రాజకీయ, ఆర్థిక శాస్త్రాలు సంపూర్ణంగా తెలిసి ఉండాలి. పాలకుడికి కానీ, ఆయన చుట్టూ ఉన్న మంత్రులు, అధికారులకు కానీ ఎదుటివారిని చూడగానే వారి మనసు అంచనా వేయగలిగే శక్తి ఉండాలి.

- దేశంలో రైతు అవసరం ఎంతో ఉంటుంది. ఏ కారణాల చేతైనా రైతులు పన్నులు చెల్లించలేని స్థితిలో ఉంటే.. వారి నుంచి బలవంతంగా శిస్తు వసూలు చేయరాదు. ఈ విషయంలో ఏమాత్రం పొరపాటు జరిగినా ప్రభుత్వాన్ని ప్రజలు అవమానిస్తారు. న్యాయాన్ని అతిక్రమించి అధిక పన్నుల భారాన్ని ప్రజలపై మోపకూడదు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు సకాలంలో చెల్లించాలి. ఆ జీతాలు వారి జీవన భృతికి సరిపోయేలా ఉండాలి.
- దేశం కోసం ప్రాణాలు అర్పించే సైనికులకు ప్రాధాన్యం ఇచ్చి తీరాలి. దేశభక్తి ఉన్నవారిని, మేధావులను, ప్రభుత్వం మీద అభిమానం ఉన్నవారిని ఎప్పుడూ గౌరవిస్తూ ఉండాలి. అలాగే వర్తక, వ్యాపారవేత్తలకు ప్రభుత్వం సహకార సంపత్తులను నిరంతరం అందించగలగాలి.
- పాలకుడనేవాడు ఎప్పుడూ ఏకపక్ష నిర్ణయం తీసుకోకూడదు. విషయాన్ని జాగ్రత్తగా పరిశీలించి.. ఆంతరంగికులతో చర్చించాకే సరైన నిర్ణయం తీసుకోవాలి. ఇంతకు ముందు తరాలలో ఉన్నవారు రాజ్యాన్ని, ప్రజలను బాగా పరిపాలించి ప్రశంసలు అందుకొని ఉంటారు. అలాంటివారి అనుభవాలను, కార్యాలను పరిగణనలోకి తీసుకొని పాలన చేయడం ఉత్తమం.
- రాజ్యపాలనలో ఉండే 18 రకాల కార్యనిర్వాహకులను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. అవసరమైన చోట పటిష్ఠమైన గూఢచర్య వ్యవస్థ ఉంచి జాగ్రత్త పడాలి. ఒక సార్వభౌముడిగా శ్రీరాముడు తన పాలనలో వీటన్నిటినీ ఆచరించాడు. అందుకే ఆనాటి అన్ని వర్గాల ప్రజలు ఎంతో హాయిగా ఉన్నారు.

– యల్లాప్రగడ మల్లికార్జునరావు

ఇస్లాం సందేశం

ఇంతే జీవితం!

ఒకవ్యక్తి కాలినడకన ఎటో వెళ్తున్నాడు. అది అడవి మార్గం. అలావెళుతూ ఉండగా.. వెనుక నుంచి ఏదో అలజడి వినిపించింది. వెనక్కి చూశాడు. అతడికి గుండె ఆగినంతపనైంది. ఓ పెద్దపులి తనవైపే వస్తోంది. భయంతో పరుగు ప్రారంభించాడు. అలా పరిగెడుతూ ఉండగా అతనికి ఓ పాడుబడిన బావి కనిపించింది. పిచ్చిమొక్కలు, తీగలతో అల్లుకుపోయిందా బావి. అందులోకి ఓ మర్రి ఊడ వేలాడుతూ ఉంది. దానిని పట్టుకొని లోనికి దిగడం మొదలుపెట్టాడు. కిందికి చూస్తే.. బావిలో ఓ మొసలి కనిపించింది. 'చచ్చాన్రా దేవుడా!' అనుకున్నాడు. ఇంతలో నల్లటి, తెల్లటి ఎలుకలు రెండు ఊడ కొరుకుతూ కనిపించాయి. పైకొస్తే పులి, కిందికి వెళ్తే మొసలి. అక్కడే ఉందామంటే.. ఎలుకలు పగబట్టాయి. ప్రాణం గుప్పిట్లో పెట్టుకొని వణికిపోతున్న అతడి దృష్టి పక్కనే చిన్న కొమ్మకు వేలాడుతున్న తేనెతుట్టెపై పడింది. తుట్టెలో నుంచి కిందికి జారుతున్న తేనెబొట్టును వేలితో అందుకొని నాకడం మొదలుపెట్టాడు. తేనె గ్రోలడంలో నిమగ్నమై.. పైన పులి.. కింద మొసలి.. మధ్యలో ఎలుక ఉన్నాయన్న సంగతే మరిచి పోయాడు. ఇంతలో ఓ తేనెటీగ చటుక్కున వచ్చి అతణ్ణి కుట్టింది. తటాలున లేచి కూర్చున్నాడా వ్యక్తి. కళ్లు నలుపుకుంటూ.. ఇదంతా కల! హమ్మయ్య బతికాను అనుకొని ఊపిరి పీల్చుకున్నాడు.



తెల్లారాక తన స్వప్న వృత్తాంతాన్నంతా ఓ పండితునికి వివరించాడు. అప్పుడా పండితుడు.. 'నిన్ను వెంబడించిన పులి నీ మృత్యువు. అనుక్షణం అది వెంబడిస్తూనే ఉంటుంది. నోరు తెరచి నీ కోసం ఎదురుచూసిన మొసలి ఉందే.. అది నీవు శాశ్వతంగా నిద్రించాల్సిన స్థలం. బావిలోకి నువ్వు దిగడానికి ఊతమిచ్చిన ఊడ ఆయుష్షు. ఆ ఊడను కొరికిన నలుపు-తెలుపు ఎలుకలు రాత్రింబవళ్లు. ఇవన్నీ మరచిపోయి ఏ కమ్మని తేనె వెనుక పడ్డావో అది ప్రాపంచిక వ్యామోహం' అని స్వప్న సారాంశాన్ని వివరించాడు. 'సమాధి మన కోసం ఎదురు చూస్తోంది. జీవితం మంచులా కరిగిపోతుంది. ఇవన్నీ మరచి.. ప్రాపంచిక వ్యామోహాల్లో పడిపోవద్దు' అన్న ప్రవక్త (స) సందేశం అనుసరణీయం.

– యం.డి.ఫారూఖ్‌జునైద్ ఖాన్

ఈనాడు సినిమా

కలిసి నటిస్తున్నారా?


కల్యాణ్ రామ్


బాలకృష్ణ

త్వరలో నందమూరి మల్టీస్టారర్ రాబోతోందా? నందమూరి కథానాయకులు కలిసి నటించబోతున్నారా? అవుననే సమాధానం వస్తోంది ఫిల్మ్‌నగర్ వర్గాల నుంచి. కల్యాణ్ రామ్ కథానాయకుడిగా పవన్ సాధినేని దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కబోతోంది. ఇది మల్టీస్టారర్ అని, ఈ చిత్రంలో మరో కథానాయకుడు కూడా కనిపిస్తారని కల్యాణ్ రామ్ ఇది వరకే చెప్పేశారు. ఆ కథానాయకుడు ఎవరన్న ఆసక్తికరమైన చర్చ మొదలైందిప్పుడు. ఆ పాత్రలో నందమూరి బాలకృష్ణ కనిపిస్తారన్నది విశ్వసనీయ వర్గాల సమాచారం. బాలయ్య ఇంకా కథ వినలేదని, కథ వింటే గనుక... తప్పకుండా ఒప్పుకుంటారని, ఆయన ఒకవేళ 'నో' అంటే... అప్పుడు మరో కథానాయకుడి పేరు పరిశీలిస్తారని, తొలి ఓటు మాత్రం... బాలయ్యకే అని తెలుస్తోంది. కల్యాణ్ రామ్ నటించిన 'ఎం.ఎల్.ఎ' శుక్రవారం విడుదల అవుతోంది. 'నా నువ్వే' మేలో ప్రేక్షకుల ముందుకు వస్తుంది. ఆ తరవాతే పవన్ సాధినేని సినిమా పట్టాలెక్కుతుంది.

ఆ విషయంలో చాలా మారాను!

పెళ్లి తర్వాత జీవితంలో చాలా మార్పులే వచ్చాయని చెబుతోంది సమంత. అయితే ఆ మార్పులు వ్యక్తిగత జీవితం పరంగానే తప్ప, కెరీర్ పరంగా పెద్దగా లేవంటోంది. "ఒక సినిమాలో నేను నటించాలంటే అందుకు బలమైన కారణం ఉండాలని భావిస్తున్నా. ఆ విషయంలో మరింత పక్కాగా ఉంటూ, ఆ తరహా కథల్నే ఎంచుకొంటున్నాను. అంతే తప్ప మిగతా వన్నీ మామూలే. సినిమా అంటే అదే తపన, అదే ప్రేమ. వ్యక్తిగత విషయానికొస్తే మాత్రం చాలా మారాను. నా ఆలోచనల్లోనే సంప్రదాయం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. ఇల్లాలికి ఇంటిపైనే దృష్టి ఉంటుంది కదా. నేనూ అంతే. ఈ జీవితాన్ని ఆస్వాదిస్తున్నా" అని చెప్పుకొచ్చింది సమంత. త్వరలోనే 'రంగస్థలం'తో రామలక్ష్మిగా సందడి చేయబోతోంది. అందులో పల్లెటూరి అమ్మాయిగానే సందడి చేయబోతోంది సమంత. "పట్నంలో పుట్టి పెరిగాను కాబట్టి పల్లెటూళ్లతో అంత అనుబంధం లేదు. 'రంగస్థలం' సినిమాతో నాలోనూ ఎక్కడో ఓ పల్లెటూరి అమ్మాయి ఉందనే విషయం అర్థమైంది" అని చెప్పింది సమంత.


సమంత


గోపీచంద్

'పంతం' పట్టాడంటే...

గోపీచంద్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'పంతం'. ఫర్ ఎ కాజ్... అనేది ఉపశీర్షిక. మెహరీన్ కథానాయిక. కె.చక్రవర్తి (చక్రి) దర్శకత్వం వహిస్తున్నారు. కె.కె.రాధామోహన్ నిర్మాత. బుధవారం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ "ఒక మంచి సందేశానికి వాణిజ్యాంశాల్ని మేళవించి రూపొందిస్తున్న చిత్రమిది. 'బలుపు', 'పవర్', 'జై లవకుశ' తదితర చిత్రాలకి స్క్రీన్‌ప్లే సమకూర్చిన చక్రి ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న విధానం చాలా బాగుంది. గోపీచంద్ పాత్ర చాలా శక్తివంతంగా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఒక మైలురాయి లాంటి 25వ చిత్రమిది. పంతం పట్టాక ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనుదిరగని ధీరత్వమున్న వ్యక్తిలా గోపీచంద్ కనిపిస్తాడు. ఆయన పంతం ఎందుకోసమనేది మాత్రం తెరపైనే చూడాలి. మెహరీన్ కూడా ఒక మంచి పాత్రలో కనిపిస్తారు. గోపీసుందర్ సంగీతం, ప్రసాద్ మూరెళ్ల ఛాయాగ్రహణం చిత్రానికి ప్రధానబలం. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. పృథ్వీ, జయప్రకాష్‌రెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎ.ఎస్.ప్రకాష్, సంభాషణలు: రమేష్ రెడ్డి, స్క్రీన్‌ప్లే: కె.చక్రవర్తి, బాబీ (కె.ఎస్.రవీంద్ర).

'మర్లపులి' గీతావిష్కరణ


వరుణ్‌సందేశ్

అర్చన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మర్లపులి'. వరుణ్‌సందేశ్ ప్రత్యేక పాత్రలో నటించారు. భాను, పోసాని కృష్ణమురళి, తాగుబోతు రమేష్, చమ్మక్ చంద్ర ముఖ్యపాత్రలు పోషించారు. డి.రామకృష్ణ దర్శకుడు. బి.సుధాకర్‌రెడ్డి, బి.భవాని శంకర్, ఖమ్మం శ్రీనివాస్ నిర్మాతలు. ఈ నెల 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. హైదరాబాద్‌లో కథానాయిక భాను చేతులమీదుగా పాటలు విడుదలయ్యాయి. దర్శకుడు మాట్లాడుతూ "యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన చిత్రమిది. నరసాపూర్ అడవిలో కేవలం 13 రోజుల్లోనే చిత్రాన్ని తెరకెక్కించాం" అన్నారు. నిర్మాతల్లో ఒకరైన బి.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ "ఆద్యంతం ఆసక్తిని రేకెత్తిస్తూ థ్రిల్‌ని పంచే చిత్రమిది. 1983లో జరిగిన ఓ సంఘటన స్ఫూర్తితో చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు. నేనే స్వరాలు సమకూర్చా. పాటలు, చిత్రం అందరికీ నచ్చుతుందనే నమ్మకం మాకుంది" అన్నారు. "వరుణ్‌సందేశ్ సరసన నేను నటించా. ఒక మంచి చిత్రంలో నటించిన తృప్తి ఉంది" అన్నారు భాను. ఈ కార్యక్రమంలో దేవరాజ్, శిరీష, ప్రశాంత్ కార్తీక్, అనిత ఆలపాటి, విజయ్, శివకార్తీక్, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






ఈ జంట... రెండోస్సారి?

'గణేష్' చిత్రంలో జంటగా నటించారు రామ్, కాజల్. ఆ తరవాత... వీరిద్దరూ కలిసి కనిపించినదే లేదు. ఇప్పుడు మరోసారి వీరిద్దరూ జోడీ కట్టబోతున్నారు. రామ్ కథానాయకుడిగా స్రవంతి మూవీస్ సంస్థ ఓ చిత్రాన్ని రూపొందిస్తోంది. రవికిషోర్ నిర్మాత. 'గరుడవేగ'తో ఆకట్టుకున్న ప్రవీణ్ సత్తారు దర్శకత్వం వహిస్తారు. ఈ చిత్రంలో కథానాయికగా కాజల్‌ని ఎంచుకున్నట్టు సమాచారం. ప్రేమ, వినోదం, యాక్షన్.. వీటన్నింటితో పాటు ప్రవీణ్ సత్తారు తరహా సరికొత్త కథ కథనాలు మేళవించిన చిత్రమిదని తెలుస్తోంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడవుతాయి.

వైఎస్సార్‌గా మమ్ముట్టి



బయోపిక్‌ల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం ఎన్టీఆర్, సావిత్రి, పుల్లెల గోపీచంద్ జీవిత కథలు చలన చిత్రాలుగా రూపొందుతున్నాయి. ఈ జాబితాలో ఒకప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి కథ కూడా తెరకెక్కబోతోంది. మహి.వి.రాఘవ దర్శకత్వం వహిస్తారు. వై.ఎస్.ఆర్ పాత్రలో మలయాళ నటుడు మమ్ముట్టి కనిపించనున్నారు. విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మాతలు. "మహి, మా సంస్థకు 'ఆనందో బ్రహ్మ' ద్వారా ఓ మంచి విజయాన్ని అందించాడు. ఈ చిత్రం అంతకు మించిన విజయాన్ని అందుకుంటుందన్న నమ్మకం ఉంది. త్వరలోనే పూర్తి వివరాలు ప్రకటిస్తామ"న్నారు నిర్మాతలు.

కొత్త కబుర్లు

నారా రోహిత్‌తో నివేదా


నారా రోహిత్


నివేదా థామస్

ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకొనే కథానాయిక నివేదా థామస్. మధ్య మధ్యలో కాస్త విరామం అనిపించినప్పటికీ, చేసే ప్రతి సినిమాతోనూ తన నటనతో ప్రేక్షకులపై బలమైన ముద్ర వేస్తుంటుంది. 'జెంటిల్‌మేన్'తో తెలుగు తెరకు పరిచయమైన ఆమె, 'నిన్ను కోరి', 'జై లవకుశ' చిత్రాలతో విజయాల్ని సొంతం చేసుకొంది. కాస్త విరామం తర్వాత మళ్లీ ఆమె ఓ కొత్త చిత్రాన్ని పచ్చజెండా ఊపింది. నారా రోహిత్ కథానాయకుడిగా మొదలైన 'శబ్దం'లో నివేదా కథానాయికగా నటిస్తోంది. పి.బి.మంజునాథ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నారా రోహిత్ మాటలు రాని ఓ యువకుడిగా కనిపించబోతున్నారు.


హిమాంశి కురానా, యోధ

మనిషిలా బతుకుదాం

బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ, యోధ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'ఏక్'. బీయింగ్ హ్యూమన్ అనేది ఉపశీర్షిక. సంపత్ దర్శకుడు. హరికృష్ణ కొక్కండ నిర్మాత. నిర్మాణానంతర కార్యక్రమాలు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ "ఈతరం చూడాల్సిన చిత్రమిది. మానవీయ విలువల్ని వెండితెరపై హృద్యంగా ఆవిష్కరించాం. 'మంత్ర' ఆనంద్ మంచి బాణీల్ని ఇచ్చారు. పాటలకు స్పందన బాగుంది. వచ్చే నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తామ"న్నారు.

పంచ్ డైలాగ్

ఒక మనిషిని ద్వేషించడానికి కారణం ఉండొచ్చు. ప్రేమించడానికి కారణం ఉండకపోవచ్చు.

చిత్రం: నువ్వు నాకు నచ్చావ్

– పంపినవారు: ఎస్.దేవదాసు, భీమవరం

చిరునామా: **సినిమా డెస్క్, ఈనాడు కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512**
మెయిల్ ఐడీ: cinema@eenadu.net


ట్వీటు తారా!



మహేష్‌బాబు గారాలపట్టి సితారతో తీయించుకున్న ఓ ఫొటోను ట్విట్టర్‌లో పంచుకొన్నారు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన

ఆ దుస్తులు నాకు ఇవ్వండి!

దీపికా పదుకొణె కెరీర్‌లో ఓ గొప్ప చిత్రంగా నిలిచిపోయింది 'పద్మావత్'. అందులో రాణి పద్మిని పాత్రలో దీపికా నటనకు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ముఖ్యంగా సినిమా ముగింపులో సామూహికంగా అగ్నికి ఆహుతయ్యే సన్నివేశాల్లో దీపిక పలికించిన భావోద్వేగాలు ప్రేక్షకుల్ని కట్టిపడేశాయి. ఇందులో దీపిక ధరించిన దుస్తులు, ఆభరణాలు ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా క్లైమాక్స్‌లో దీపిక ధరించిన దుస్తులు మరింత కనువిందు చేస్తాయి. అందుకేనేమో ఆ దుస్తులపై దీపిక మనసు పారేసుకుంది. తన నటనకు గుర్తుగా వాటిని తనకు ఇవ్వాలని దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని ప్రత్యేకంగా కోరింది దీపిక. "'పద్మావత్'తో ప్రయాణం నా తుదిశ్వాస వరకు మర్చిపోలేను. ఇందులో నేను నటించిన ముగింపు సన్నివేశాల్లాంటివి ఇప్పటివరకూ పోషించలేదు. ఆ సన్నివేశాల కోసం నేను ధరించిన దుస్తుల్ని ఇవ్వాల్సిందిగా భన్సాలీ సార్‌ను అడిగాను" అని ఓ పత్రికతో మాట్లాడుతూ చెప్పింది దీపిక.


దీపికా పదుకొణె

చిత్ర విచిత్రాల 'రాజరథం'


అవంతికా శెట్టి, నిరూప్ భండారి

నిరూప్ భండారి, అవంతికా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రాజరథం'. రవిశంకర్, ఆర్య ముఖ్య పాత్రధారులు. అనూప్ భండారి దర్శకత్వం వహించారు. అజయ్ రెడ్డి, అంజు వల్లభనేని, విషు దకప్పగారి, సతీష్ శాస్త్రి నిర్మాతలు. శుక్రవారం విడుదల కానుంది. బుధవారం హైదరాబాద్‌లో ముందస్తు విడుదల వేడుక జరిగింది. సతీష్ శాస్త్రి మాట్లాడుతూ "బస్సు పాత్రకి రానా గాత్రదానం చేయడం, రవిశంకర్ 'చల్ చల్ గుర్రం' పాట పాడటం ప్రత్యేకతలు. నాయకానాయికలపై చిత్రించిన ఓ పాట ఊహ, వాస్తవాల మేళవింపుతో సాగుతుంది. ప్రేక్షకులకి కనువిందు కలిగిస్తుంది. బర్ఫీ, జగ్గా జాసూస్ చిత్రాలకి కళాదర్శకుడుగా పనిచేసిన రజత్‌సొద్దార్ వేసిన భారీ సెట్‌లో చిత్రించాం. కన్నడలోనూ విడుదల చేస్తున్నాం. ప్రతినాయకుడుగా ఆర్య లుక్, కాస్ట్యూమ్స్ చాలా కొత్తగా ఉంటాయ'న్నారు. రామ్‌కుమార్ మాట్లాడుతూ "నృత్యదర్శకులు బాస్కో సీజర్, జానీ మాస్టర్ నేతృత్వంలో తెరకెక్కిన ఆరు పాటలూ ఆకట్టుకుంటాయ"న్నారు. నిరూప్ భండారి మాట్లాడుతూ "ఇది రొమాంటిక్ లవ్ స్టోరీ. ప్రేక్షకులు కోరే వినోదం ఉంటుంది. వీటితోపాటు ఎవరూ ఊహించని మరో కోణం కూడా ఉంది. అదేంటో సినిమాలోనే తెలుస్తుంద"న్నారు. మాటలు: అబ్బూరి రవి, పాటలు: రామజోగయ్యశాస్త్రి.

ఎవరిని చూస్తున్నారో

శ్రీకాంత్, నితిన్, హేమలత నాయకానాయికలుగా నటిస్తున్న చిత్రం 'నిన్నే చూస్తు'. కె.గోవర్ధన్‌రావు దర్శకుడు. హేమలతారెడ్డి నిర్మాత. ప్రస్తుతం మూడో షెడ్యూల్ చిత్రీకరణ జరుగుతోంది. నిర్మాత మాట్లాడుతూ "మంచి కుటుంబ కథాచిత్రమిది. సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ చక్కటి స్వరాలిచ్చారు. టైటిల్ గీతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. మలేసియాలోని అందమైన ప్రాంతాల్లో పాటలు తెరకెక్కించామ"న్నారు. సుమన్, భానుచందర్, సుహాసిని ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. కూర్పు: నాగిరెడ్డి, మాటలు, కరణ్‌గోపి, ఛాయాగ్రహణం: ప్రసాద్ ఈదర.


హేమలత

స్నేహం చిరకాలం..

చుట్టూ ఎంతమంది స్నేహితులు ఉన్నా కొందరు మాత్రమే మనసుకి దగ్గరవుతారు. ఇంకొందరితో ఎంత స్నేహంగా ఉందామన్నా కూడా ఆ బంధం నిలబడదు. ఎందుకిలా అంటారా?

● స్నేహం చేయడం అంటే అందరిలో కలిసి పోవడం. ఆప్యాయంగా మాట్లాడటమే. ఇలా ఉండగలిగితే చాలు..ఎంతమందిలో ఉన్నా సరే! మీరు మీ స్నేహబృందానికి ప్రత్యేకమే. ఈ తీరే మిమ్మల్ని అందరికీ దగ్గర చేస్తుంది. అదికూడా ఎదుటివారి భావోద్వేగాలకు అనుగుణంగా స్పందించగలిగినప్పుడే ఆ బంధం బలపడుతుంది.



● మీకంటూ ఓ స్నేహబంధాన్ని ఏర్పరుచుకోలేకపోవడానికి కారణం...ఎదుటివారిని మీరు సరిగా అర్థం చేసుకోలేకపోవడమేనేమో! చాలామంది ఎదుటివారిలో లోపాలు వెతకడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. అయితే అలాంటి లోపాలు మీలోనూ ఉంటాయని మరిచిపోవద్దు. లేదంటే ఈ తీరు మీపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. దాంతో మీతో స్నేహం ఏర్పరుచుకునే విషయంలో ఎదుటివారూ ఆలోచిస్తారు.

● ఏదో ఆశించి మాత్రం ఎదుటివారితో స్నేహం చేయాలనుకోకండి. అవసరాలకు అనుగుణంగా ఏర్పడే స్నేహబంధం ఎక్కువకాలం నిలవదు. నిజమైన స్నేహంలో నియమ నిబంధనలుండవు. పరిస్థితులకు అనుగుణంగా సర్దుకుపోగలుగుతారు.

న జ రా నా

బకెట్ నీళ్లలో నాలుగైదు చుక్కల రోజ్‌వాటర్ కలిపి స్నానం చేస్తే చెమట వాసన రాకుండా ఉంటుంది.

ఐస్... ఐస్... పండ్ల ఐస్!

ఎండలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్నాయి. ఈ సమయంలో మనసు ఎక్కువగా కోరుకునేది చల్లని ఐస్‌క్రీంలే కదూ.. ఈసారి పాప్సికిల్స్‌ని ప్రయత్నించి చూద్దాం. అవేంటీ.. అంటారా.. అచ్చం ఐస్‌క్రీంల లాంటివే కానీ కాదు. వీటిని పండ్లతో తయారుచేస్తారు. అవేంటంటే...



దానిమ్మతో...

కావల్సినవి: దానిమ్మగింజలు - కప్పు, నిమ్మరసం - రెండు చెంచాలు, చక్కెర - రెండు చెంచాలు, నీళ్లు - అర కప్పు.

తయారీ: కొన్ని దానిమ్మ గింజలను తీసి పక్కన పెట్టుకోవాలి. మిగతా గింజలూ, నిమ్మరసం, చక్కెరా, నీళ్లు అన్నీ కలిపి మిక్సీలో వేసి తిప్పాలి. ఇది రసంలా తయారయ్యాక వడకట్టి తీపీ, పులుపూ సరిపోయాయో లేదో రుచి చూసుకోవాలి. అవసరం అనుకుంటే మరికొంచెం చక్కెరా కలుపుకోవచ్చు. ఆ తరవాత ఈ రసాన్ని పాప్సికిల్స్ మౌల్డ్స్‌లో పోయాలి. చివరగా గింజల్ని అన్నింట్లో సమానంగా వేసుకుని ఐస్‌క్రీం పుల్లల్ని ఉంచాలి. వీటిని డీప్ ఫ్రిజ్‌లో కొన్ని గంటలపాటు ఉంచి తీస్తే చాలు.



పుచ్చకాయతో...

కావల్సినవి: పుచ్చకాయ ముక్కలు - నాలుగు కప్పులు, నిమ్మరసం - పెద్ద చెంచా, తేనె - పెద్ద చెంచా.

తయారీ: పుచ్చకాయ ముక్కలూ, నిమ్మరసం, తేనె మిక్సీలో తీసుకుని రసంలా చేసుకోవాలి. ఆ తరువాత వడకట్టాలి. ఇప్పుడు ఈ పండు రసాన్ని పాప్సికిల్ మౌల్డ్స్‌లో పోసి ఫ్రిజ్‌లో కొన్నిగంటలపాటు పెట్టి తీస్తే చాలు.



పండ్ల ముక్కలతో...

కావల్సినవి: కివీ - రెండు, స్ట్రాబెర్రీ ముక్కలు - కప్పు, సన్నగా కోసిన పుచ్చకాయ ముక్కలు - కొన్ని, యాపిల్ రసం - రెండు కప్పులు.

తయారీ: కివీ పండ్ల చెక్కు తీసి చక్రాల్లా కోయాలి. తరువాత పండ్ల ముక్కల్ని కలిపి మౌల్డ్స్‌లో వేసుకోవాలి. తరువాత అన్నింట్లో ముప్పావువంతు వరకూ యాపిల్ రసం పోసి మూత పెట్టేయాలి. వీటిని ఓ రాత్రంతా ఫ్రిజ్‌లో పెడితే పండ్ల ఐస్‌లు సిద్ధం.

చాక్లెట్‌తో...

కావల్సినవి: వెనిల్లా ఐస్‌క్రీం - కప్పు, బాదంపాలు - అరకప్పు, చాక్లెట్‌పొడి - అర కప్పు, తేనె - పెద్ద చెంచా, బాదంపప్పు తరుగు- చెంచా

తయారీ: ఐస్‌క్రీం, బాదంపాలూ, తేనె మిక్సీలో తీసుకుని చిక్కగా చేసుకోవాలి. తరువాత ఈ మిశ్రమాన్ని పాప్సికిల్స్ మౌల్డ్స్‌లో వేసుకుని పైన చాక్లెట్‌పొడీ, బాదంతరుగూ వేసి మూతపెట్టేయాలి. వీటిని మూడునాలుగు గంటలపాటు ఫ్రిజ్‌లో పెడితే గట్టిపడతాయి.

గమనిక: పాప్సికిల్స్ మౌల్డ్స్ బజార్లో దొరుకుతున్నాయి. వీటిల్లో మిశ్రమం నింపి ఐస్‌పుల్ల గుచ్చి మూతపెట్టి ఫ్రిజ్‌లో పెడితే చాలు.



స్ట్రాబెర్రీ, పైనాపిల్‌తో..

కావల్సినవి : పైనాపిల్ ముక్కలు - రెండు కప్పులు, స్ట్రాబెర్రీ ముక్కలు - మూడు కప్పులు, పైనాపిల్ రసం - ఒకటిన్నర కప్పు, చక్కెర - అరకప్పు, నీళ్లు - కప్పు.

తయారీ: ముందుగా మిక్సీలో సగం పైనాపిల్ ముక్కలూ, కప్పు పైనాపిల్ రసం, చక్కెరా, అర కప్పు నీళ్లు తీసుకోవాలి. దీన్ని రసంలా చేసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు మళ్లీ మిక్సీలోకి సగం స్ట్రాబెర్రీ ముక్కలూ, అరకప్పు పైనాపిల్ రసం, కొన్ని నీళ్లూ తీసుకుని జ్యూస్‌లా చేసుకోవాలి. ఇప్పుడు మౌల్డ్స్‌లో ముందుగా ఒక వరుస స్ట్రాబెర్రీ ముక్కలూ, దానిపై పైనాపిల్ ముక్కలు వేసుకోవాలి. వాటిపై స్ట్రాబెర్రీ, పైనాపిల్ రసాలు వేసుకుని మూత పెట్టేయాలి. వీటిని మూడుగంటలపాటు ఫ్రిజ్‌లో పెడితే సరిపోతుంది.



మేడ మీద మొక్కలా... మేం పెంచుతాం!

ఇరుకు గదులూ, అపార్ట్‌మెంట్ సంస్కృతి పచ్చని మొక్కల పెంపకానికి దూరం చేస్తున్నాయి. అయినా వాటిపై ఉన్న ఆసక్తితో ఇంటిమిద్దెనే చిన్నపాటి పొలంగా మార్చుకోవాలనుకునే వారు కొందరు. బాల్కనీనే చిన్నపాటి పెరటితోటగా చేయాలనుకునేవారు ఇంకొందరు. అలాంటి ఆలోచన మీకూ ఉందా! అయితే మా హోంక్రాప్ బృందం మీ సమస్యకు పరిష్కారం చూపుతుందంటున్నారు దాన్ని ప్రారంభించిన మన్వితా రెడ్డి, షర్మిలా ఎల్లు.

'వ్యాపారంలో లాభాలు రావాలీ, మరి కొందరికీ ఉపయోగపడాలి... ఇదే లక్ష్యంతో హోంక్రాప్‌ని ప్రారంభించాం. ఈ వ్యాపార ప్రయాణంలో ఎంతో అనుభవమే కాదు, పరిజ్ఞానాన్నీ సొంతం చేసుకుంటామనీ మేం ఊహించలేదు అంటారు' మన్వితా రెడ్డి. 'పట్టణాల్లో నివసించేవారు ఆసక్తితో ఇంటిమిద్దెనే చిన్నపాటి పొలంగా మార్చేసుకుంటున్నారు. ఇంకొంతమంది దానిమీద ఆసక్తి ఉన్నా ఎలా ప్రారంభించాలో తెలీక ఆలోచనతోనే ఆగిపోతున్నారు. అలాంటి వాళ్లందరికీ మా హోంక్రాప్ ప్రియనేస్తం. డాబా మీదా, బాల్కనీల్లో మొక్కలు పెంచాలనుకుంటే దానికి కావాల్సిన అవసరాలన్నీ మేమే చూసుకుంటాం. నేరుగా స్లాబుపై మట్టిపోసి విత్తనాలు చల్లేస్తే లీకేజీ సమస్యలొస్తాయి. అందుకే ఫ్రేములాంటి నిర్మాణం, మట్టి బెడ్‌లను ఏర్పాటు చేస్తాం. దానిలో పెంచుకునేందుకు విత్తనాలూ, ఎరువూ వంటివన్నీ కిట్ రూపంలో అందిస్తాం. అక్కడితో మా పని అయిపోదు. ఆ తరువాత మొక్కలకు చీడపీడలు సోకకుండా వాటి నిర్వహణా చూసుకుంటాం. వాళ్లు మొక్క ఫొటో పంపితే దానికి కారణం వివరించి, పరిష్కారం సూచిస్తాం. ఇలానే కాదు ఎంచుకున్న ప్యాకేజీని బట్టీ నెలకు రెండుసార్లు మా ఉద్యోగులు వెళ్లి మొక్కల్ని పరీక్షిస్తారు.



అలా మొదలైంది...

ఏడాది క్రితం జనవరి నెలలో 'హోమ్‌క్రాప్'ని కేవలం మూడు లక్షల పెట్టుబడితో ప్రారంభించాం. ఆచార్య జయశంకర్ యూనివర్సిటీలో మా సంస్థను ఇంక్యుబేషన్‌లో ఉంచాం. మా చదువులకు సంబంధంలేని వ్యాపారంలోకి అడుగుపెట్టాం కదా! అందుకే మొక్కల పెంపకంలో శిక్షణ తీసుకున్నాం. పట్టణంలో సాగు చేస్తున్న చాలామందిని కలిసి మెలకువలు తెలుసుకున్నాం. మొదట్లో మొక్కలను స్లాబును ఆనుకొని కాకుండా కాస్త ఎత్తులో ఉంచేందుకు మెటల్ ఫ్రేమును వాడేవాళ్లం. కేవలం దానికోసమే 15000 రూపాయలు ఖర్చయ్యేది. కానీ అంత ఖర్చు మొక్కల మీద పెట్టడానికి ముందుకొచ్చే వారి సంఖ్య తక్కువగానే ఉంటుంది. అందుకే క్రమంగా ప్రత్యామ్నాయంగా పీవీసీ నిర్మాణాన్ని వాడటం మొదలుపెట్టాం.



ఏమేం చేస్తామంటే...

అవసరానికి అనుగుణంగా చాలా ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకొచ్చాం. ఉదాహరణకు... పన్నెండు చదరపు అడుగుల వైశాల్యంలో బెడ్ ఏర్పాటు చేస్తే.. దాంట్లో ఏవైనా నాలుగు రకాల విత్తనాలూ, స్థలానికి సరిపోయే మట్టీ, దాన్ని ఆరోగ్యంగా ఉంచే ఎరువులూ అందిస్తాం. బాల్కనీల్లో పెంచుకునేందుకు వీలుగా వర్టికల్ ప్లాంటర్‌లు ఏర్పాటు చేస్తున్నాం. మొక్కల్ని పెంచేందుకు బయోడిగ్రేడబుల్ బ్యాగులు ఉంచుతున్నాం. ఈ క్రమంలో మాకెదురైన సమస్య మట్టీ, పనిచేసేందుకు సిబ్బందీ దొరక్కపోవడమే. అయితే మా ఆలోచన నచ్చి సేంద్రియ వ్యవసాయం చేసే సాయి మాకు తోడయ్యారు. దాంతో మట్టీ, ఎరువూ ఆయన వ్యవసాయం చేసే ఇరవైఎకరాల పొలం నుంచే తీసుకుంటున్నాం. ఇక సిబ్బంది అంటారా? వ్యవసాయ విద్యలో డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులనే మా ఉద్యోగులుగా ఎంచుకున్నాం. ఇక, వినియోగదారులను సంపాదించుకోవడం అతిపెద్ద సవాల్. ఎక్కడ ఎక్స్‌పోలు, వర్క్‌షాపుల ద్వారా మా సేవల్ని వివరిస్తూ వారిని చేరుకున్నాం. ప్రస్తుతం మా వినియోగదారుల సంఖ్య 400 మంది. ప్రస్తుతం కేవలం హైదరాబాద్‌లోనే మా సేవలందిస్తున్నా త్వరలోనే ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తాం. ఇప్పుడిప్పుడే ఇబ్బందులు దాటుకుని పాతికలక్షల టర్నోవర్‌కు చేరుకున్నాం' అంటారు షర్మిల.



బంగారం-వెండి



21 న ముగింపు-క్రితం

హైదరాబాద్	ముగింపు	క్రితం
బంగారం (24క్యా)	31,310	31,290
ఆర్నమెంట్	29,240	29,230
వెండి (కిలో)	39,025	39,190
విజయవాడ		
బంగారం (24క్యా)	31,350	31,300
ఆర్నమెంట్	29,100	29,000
వెండి (కిలో)	39,500	39,500
ప్రొద్దుటూరు		
బంగారం (24క్యా)	31,250	31,220
ఆర్నమెంట్	28,940	28,980
వెండి (కిలో)	39,100	39,200
రాజమహేంద్రవరం		
బంగారం (24క్యా)	30,440	30,430
ఆర్నమెంట్	28,980	28,980
వెండి (కిలో)	41,000	41,100
విశాఖపట్నం		
బంగారం (24క్యా)	31,110	31,110
ఆర్నమెంట్	28,920	28,920
వెండి (కిలో)	39,900	39,900
తమిళనాడు		
బంగారం ఆర్నమెంట్ (గ్రా)	2,899	2,898
వెండి (గ్రా)	41.10	41.20

(రూ. లలో)

ఇవి దగ్గర ఉంచుకోండి..!!

మన అల్మారాలో కొన్ని రకాల దుస్తులూ, అలంకరణ సామగ్రి ఉండేలా చూసుకుంటే వాటిని వేటితోనైనా జత చేయడం సులువంటున్నారు ఫ్యాషన్ నిపుణులు.. ఇంతకీ అవేంటంటే...

★ కాలేజీలకే కాదు...ఇంటర్వ్యూలకూ హుందాతనాన్ని తెచ్చిపెడుతుంది తెలుపు రంగు. అందుకే ఇలాంటి చొక్కాను మీ బీరువాలో ఉంచుకోండి. దీనికి జతగా స్టేట్‌మెంట్ జ్యూయలరీ మెప్పిస్తుంది.

★ ట్రెండీగా కనిపించాలని అన్నీ ఎత్తుచెప్పులే కొంటున్నారా? ఇది మీ ఆరోగ్యానికీ అంత మంచిది కాదు. పైగా ఇప్పుడు వాటితో పాటు ఫ్లాట్స్ వేసుకోవడమూ ఫ్యాషనే. లెగ్గింగ్‌లూ, పలాజోల మీదకు ఈ తరహావి నప్పుతాయి. పైగా వీటిని వేసుకుని నడవడమూ సులువే.

★ ఎన్ని రంగులున్నా నలుపు రంగు ప్రత్యేకతే వేరు. కుర్తా, టీషర్ట్, అనార్కలీ ఏదైనా సరే..ఒకటి ఇలాంటిది తప్పనిసరి. అన్నిరకాల ఛాయల వారికీ ఇది బాగుంటుంది. నలుపు రంగు పొడవాటి గౌనూ లేదంటే జంప్‌సూట్ వేసుకుంటే దానికో బ్లేజర్ జతచేస్తే చాలు కొత్తలుక్ వస్తుంది.

★ ఎన్ని రకాల దుస్తులున్నా ఒకట్రెండు జీన్సు ప్యాంట్లు తప్పనిసరి. అవి అన్ని వేళలా ఉపయోగపడతాయి. అయితే అవి మరీ బిగుతుగా కాకుండా సౌకర్యవంతంగా ఉండేవి ఎంచుకోవాలి. ఎప్పుడైనా అత్యవసర పరిస్థితుల్లో తొందరగా తయారై వెళ్లిపోవచ్చు.

★ విభిన్న సైజులూ, రంగుల్లో స్కార్ఫ్‌లు ఉండేలా చూసుకోవాలి. ఇప్పుడు వీటిని అనేక రకాలుగా వాడుతున్నారు. జుట్టుకీ, నడుముకీ కట్టేసుకుంటున్నారు. అంతే కాదు పైనుంచి కింది దాకా డ్రెస్సు ఒకే రంగులో ఉందనుకుంటే ఈ స్కార్ఫ్‌లతో లుక్ మార్చేయొచ్చు.

★ వీటితోపాటే పొడవాటి ట్రెంచ్ కోట్ ఒకటి దగ్గర పెట్టుకుంటే సందర్భానుసారంగా వాడుకోవచ్చు. వీటికోసం ప్రత్యేకంగా ఏమీ కొనుగోలు చేయక్కర్లేదు. మామూలు జీన్స్‌ప్యాంట్లు కూడా వీటి మీదికి సరిపోతాయి.



★ ష్రగ్‌లూ, కోట్లు..కూడా ఒకట్రెండు దగ్గరుంచుకుంటే అవసరానికి ఉపయోగపడతాయి.

అక్క... పెళ్లి అయ్యేదెలా!

డియర్ వసుంధర

■ నాకు ఒక అక్క. తనిప్పుడు ఉద్యోగం చేస్తోంది. ఎప్పుడూ తన నోటి నుంచి వినపడే ఒక పదం... 'ఇండిపెండెంట్' అని! ఏ పనికీ ఇతరుల మీద ఆధారపడదు. అలా ఉండాలనే పెళ్లి కూడా చేసుకోనంటోంది. నిజం చెప్పాలంటే నా బాధ్యతల్ని తనే తీసుకుని నాన్న లేని లోటు తీరుస్తోంది. కానీ ఈ మధ్య మితిమీరి తనేం చేసినా కనీసం అమ్మకు కూడా చెప్పట్లేదు. నాన్న లేని పిల్ల అని గారాబంగా పెంచితే ఇలా తయారయ్యిందని అమ్మ ఎప్పుడూ బాధ పడుతోంది. తననెలా మార్చాలో అర్థం కావడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం ఏంటి?

– ఓ సోదరి



డా॥ పూర్ణిమ నాగరాజ
సైకియాట్రిస్ట్

మీ అక్కకు పెళ్లిపై ఉన్న అభిప్రాయం తన చుట్టూ ఉన్న పరిస్థితుల వల్లో, ఇంట్లో జరిగిన కొన్ని సంఘటనల వల్లో ఇలా బలపడి ఉండొచ్చు. అయితే తనకున్న స్వతంత్ర భావాలకూ, పెళ్లి మీద తనకున్న అభిప్రాయానికీ ఎలాంటి సంబంధం లేదు. ధైర్యంగా, ఎవరిమీదా ఆధార పడకుండా పనులు చేసుకోవాలనుకోవడం తప్పుకాదు. కానీ ఒకరితో కలిసి జీవితం గడుపుతూ కూడా ఈ స్వతంత్రాన్ని కోల్పోకుండా ఉండొచ్చన్న విషయం తనకు అర్థమయ్యేలా వివరించాలి. తనిప్పుడు స్వేచ్ఛగా ఉండటమొక్కటే సంతోషమనుకుంటోంది. కానీ, దానికి మించిన ఆనందం ఒక వ్యక్తితోనో, కుటుంబంతోనో చేరువైనా కూడా పొందొచ్చని తనకు తెలియాలి. ఆమె తను చేసే పనులు కూడా ఎవరికీ చెప్పకుండా చేస్తోందంటున్నారు. కానీ ఎందుకు చెప్పటం లేదో ఒక్కసారి ఆలోచించండి. ఒకవేళ చెప్పినా కూడా మీరు అర్థం చేసుకోలేరనే నిర్ణయానికి రావడమే దీనికి కారణం కావచ్చు. అందుకే ఆమె ఏ విషయాన్నీ మీతో చెప్పడానికి ఇష్టపడట్లేదు. ఒకసారి మానసిక వైద్యుల్ని కలిసి ఈ సమస్య గురించి ఆమెతో మాట్లాడించండి. అసలు తనిలా ప్రవర్తించడానికి కారణం తెలుసుకుంటే చాలు. ఆ తరవాత ఆమెకున్న అపోహలపై స్పష్టత ఇవ్వగలిగితే ఆమే సరైన నిర్ణయం తీసుకోగలుగుతుంది.

మీ ప్రశ్నలు ఇకపై
vasupsych@eenadu.net కు పంపించగలరు.

ఇంజినీరింగ్

ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థుల నుంచి నాలుగో ఏడాది అభ్యర్థుల వరకూ అందరికీ రెండో సెమిస్టర్ పరీక్షలు త్వరలో జరగబోతున్నాయి. ఏం చదవాలి, ఎలా చదవాలి, ప్రిపరేషన్‌లో ఏ జాగ్రత్తలు తీసుకోవాలి, పరీక్షల్లో ఎంత రాయాలి.. తదితర విషయాలపై సరైన అవగాహన ఉంటే కష్టానికి తగిన ఫలితంగా మంచి మార్కులు పొందే వీలుంటుంది. ఇందుకోసం అర్థవంతంగా చదవడానికి, ఆశించిన మార్కులు సాధించడానికి ఉపయోగపడే సూచనలను నిపుణులు అందిస్తున్నారు.



సెమిస్టర్ పరీక్షల్లో సక్సెస్ సూత్రం!

ఇంజినీరింగ్ విద్యార్థులు ఏడాదంతా పరీక్షలు రాస్తున్నట్లే కనిపిస్తుంది. ఒక సెమిస్టర్ కాగానే రెండో సెమిస్టర్ సిద్ధమైపోతుంది. నాలుగేళ్లూ ఇలా గడిచిపోతాయి. థియరీ సబ్జెక్టులకు గరిష్ఠంగా 100 మార్కులు. అందులో 25 మార్కులకు అంతర్గత పరీక్షలను కాలేజీలు, మిగిలిన 75 మార్కులకు సెమిస్టర్ పరీక్షలను విశ్వవిద్యాలయాలు నిర్వహిస్తాయి. పరీక్షలకు తయారవడం ఎప్పుడూ ఒత్తిడితో కూడుకున్నదే. అయినా చిత్తశుద్ధితో కొన్ని మెలకువలను పాటిస్తే పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవచ్చు.



నీలమేఘశ్యామ్ దేశాయ్
Career Dev.Cell
ACE ఇంజినీరింగ్ కళాశాల

నాణ్యమైన నోట్స్ తొలిమెట్టు

సిలబస్ ఇంకా పూర్తికాలేదని నోట్స్ తయారీని నిర్లక్ష్యం చేస్తే బ్యాక్‌లాగ్స్ బారిన పడతారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలకు జతగా అవసరమైన విషయసేకరణ చేసి నోట్స్ సమగ్రంగా సిద్ధం చేసుకోవాలి. సమయం తక్కువగా ఉన్నప్పుడు తరగతిలోని పాఠాల వేగాన్ని అందుకోవాలంటే ఇంటి దగ్గర రోజువారీ పద్ధతిలో చదవాలి. దాని వల్ల వెంట వెంటనే వచ్చే ఇంటర్నల్, ప్రాక్టికల్, సెమిస్టర్ పరీక్షలకు సిద్ధంగా ఉండవచ్చు. క్లాస్ నోట్స్ కఠినంగా అనిపిస్తే అర్థమయ్యే సులువైన పదాలతో తిరగరాసుకోవాలి. కష్టమైన, అర్థంకాని పదాలతో ఉన్న నోట్స్‌ను బట్టీ పట్టడం మంచిది కాదు. కాలేజీకి వెళ్లని రోజుల్లో జరిగిన పాఠాలకు నోట్స్‌ను ప్రత్యేక శ్రద్ధతో రాసుకోవాలి.

ప్రతి సబ్జెక్టుకీ కొన్ని ప్రత్యేక పదాలు ఉంటాయి. సమాధానాల్లో వాటిని తప్పకుండా వినియోగించాలి. అందరూ తప్పనిసరిగా చదివే ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, హ్యూమన్ వాల్యూస్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ వంటి సబ్జెక్టుల్లో ఎక్కువ మార్కులు సంపాదించాలంటే సరైన పదాల వాడుక అవసరం.

విద్యార్థులు తమ నోట్స్‌లను అధ్యాపకులకు ఇచ్చి పరిశీలించమని కోరాలి. అనుభవజ్ఞులైన లెక్చరర్ల దృష్టి నోట్స్ మీద పడితే దాని నాణ్యత పెరుగుతుంది. లోపాల సవరణ జరుగుతుంది.



పరీక్ష కేంద్రంలో...

- ❐ చివరి నిమిషం వరకు చదవద్దు. పరీక్ష రాసేటప్పుడు గుర్తు రాదేమోననే అనవసర భయాలు వదిలేయాలి.
- ❐ పరీక్షా కేంద్రానికి పావుగంట ముందే చేరుకోవాలి. కాసేపైనా మౌనంగా ఉండటం మంచిది.
- ❐ పరీక్షకు చదువుతున్న స్నేహితులకు అంతరాయం కలిగించవద్దు. వాళ్లు సందేహాలు తీర్చమని కోరితే క్లుప్తంగా ముగించాలి.
- ❐ కేటాయించిన సీటుకు పది నిమిషాల ముందే చేరాలి. ప్రశాంతంగా ఉండాలి.
- ❐ పెన్ను, పెన్సిల్, క్యాలిక్యులేటర్ వంటి వాటిని ముందే సిద్ధం చేసుకోవాలి. ఇతరులను అడగడం, వారికి ఇవ్వడం సరైనది కాదు.
- ❐ ప్రశ్నపత్రాన్ని పూర్తిగా చదవాలి. సమాధానాలు తెలిసిన ప్రశ్నలను గుర్తించాలి. బాగా వచ్చిన ప్రశ్నలకు ముందు జవాబులు రాయాలి. తర్వాత మిగిలిన వాటని రాయాలి.
- ❐ వీలైనంత వరకు ఒక విభాగంలోని ప్రశ్నలకు ఒకే క్రమంలో జవాబులు రాయాలి.
- ❐ అవసరమైన చోట స్పష్టత కోసం బొమ్మలు వేయాలి.
- ❐ సమయం మిగుల్చుకొని అదనపు ప్రశ్నలకు సమాధానాలు రాయడానికి ప్రయత్నించాలి.
- ❐ చివరి పావుగంటలో అన్ని జవాబులు సరిగా ఉన్నాయో లేదో చూసుకోవాలి.
- ❐ పరీక్ష ముగిసిన తర్వాత అనవసర చర్చలు చేయవద్దు. ఒకవేళ తప్పులు దొర్లినట్లనిపించినా ఆందోళన పడాల్సిన పని లేదు.

ఇవీ జాగ్రత్తలు!

- ▮ పరీక్షల సమయంలో నిద్ర, తిండి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి. శరీరానికి తగిన విశ్రాంతి ఇవ్వాలి.
- ▮ సాత్వికమైన, పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలి.
- ▮ సినిమాలు, షికార్లు, మొబైల్ ఫోన్లు, అనవసర ముచ్చట్లు, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి.
- ▮ పరీక్ష కేంద్రాలకు మొబైల్ తీసుకెళ్లకపోవడం మంచిది.

సమయం సద్వినియోగం

ప్రతి వ్యాసరూప ప్రశ్నకు గరిష్ఠంగా 25 నుంచి 30 నిమిషాల సమయం ఉంటుంది. కానీ అంతకంటే తక్కువ సమయంలోనే జవాబు రాయడం ప్రాక్టీస్ చేయాలి. చివరి నిమిషం వరకూ రాయకూడదు. కొంత సమయాన్ని మిగుల్చుకొని అన్నీ చెక్ చేసుకోవాలి.

పరీక్షల్లో విజయం కోసం సమయానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ఆచరణయోగ్యమైన టైంటేబుల్ తయారు చేసుకోవాలి. రోజూ కనీసం రెండు సబ్జెక్టులు చదవడానికి ప్రణాళిక వేసుకోవాలి. దీని వల్ల ప్రతి సబ్జెక్టునీ వారంలో రెండుసార్లు చదవచ్చు. పునశ్చరణ జరుగుతుంది. ఇదే సమయంలో అసైన్‌మెంట్లు, రికార్డులు రాసే పని కూడా ఉంటుంది. వీటికి సమయాన్ని అదనంగా కేటాయించాలి. కాలేజీలో విరామ సమయాల్లో పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.

ఇంజినీరింగ్‌లోని అనువర్తన అంశాలకు ఇది తగిన విధానం.

సబ్జెక్టు బాగా అర్థం కావాలంటే రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు చదవాలి. నోట్స్ చదివేటప్పుడు పాఠ్యపుస్తకం దగ్గరే ఉండాలి. పాఠ్యపుస్తకాన్ని పరిశీలించాలి. అవసరమైన పాయింట్లు రాసుకోవాలి. సిలబస్ ప్రకారం నోట్స్‌ను సమీక్ష చేయాలి. ఇంజినీరింగ్‌లో ఇది చాలా ప్రధానం.

గత ప్రశ్నపత్రాల విశ్లేషణ

పరీక్షలకు కేవలం పాఠాలు చదివితే సరిపోదు. గతంలో జరిగిన మూడు లేదా అయిదు సంవత్సరాల పరీక్షల ప్రశ్నపత్రాలను విశ్లేషించాలి. అధ్యాయాలవారీగా ప్రశ్నల సరళిని పరిశీలించాలి. దీని వల్ల ఏయే అధ్యాయాలపై దృష్టి పెట్టాలో తెలుస్తుంది. ఆ ప్రశ్నలకు జవాబులు సిద్ధం చేసుకొని అధ్యాపకుల అభిప్రాయాన్ని తీసుకోవాలి. పరీక్షల నాటికి మొత్తం సిలబస్‌పై సంతృప్తికర స్థాయిలో తయారవ్వాలి. రోజువారీ రివిజన్ చేయాలి.

ఏ ప్రశ్నకు ఎంత సమాధానం?

సాధారణంగా కొన్ని ప్రశ్నలను రెండు లేదా మూడు మార్కులకు, మరికొన్నింటిని అయిదు లేదా పది మార్కులకు ఇస్తారు. వీటి జవాబుల పరిధి పట్ల స్పష్టత ఉండాలి. నిర్వచనాలు, మౌలిక సూత్రాల వంటివి రెండు లేదా మూడు మార్కులకు ఇస్తారు. మౌలికాంశాలపై వచ్చే ఈ ప్రశ్నలకు అయిదు లేదా ఆరు వాక్యాల్లో సమాధానాలు రాయాలి. అవీ స్థూలంగా, స్పష్టంగా ఉండాలి. సమయం వృథా చేయకూడదు. వ్యాసరూప ప్రశ్నలకు సమగ్రమైన జవాబులు తయారు చేసుకోవాలి. ఇవి సాధారణంగా నిర్వచనాలు, సిద్ధాంత నిరూపణలు, అనువర్తనాలపై ఆధారపడిన లెక్కల (న్యూమరికల్ ప్రాబ్లమ్స్)పై ఉంటాయి. వీటికీ సూటిగా చిన్న వాక్యాల్లో సమాధానాలు తయారు చేసుకోవాలి.

ఇంజినీరింగ్‌లో ఎందుకు ఎక్కువ ఫెయిల్?

ఇంటర్మీడియట్‌లో పాయింట్ల వారీగా జవాబులు రాయడానికి అలవాటు పడిన అభ్యర్థులు సెమిస్టర్ పద్ధతికి వెంటనే అలవాటు పడలేరు. పరీక్షలు వెంటనే వచ్చేసినట్లు ఉంటాయి. ప్రిపరేషన్‌కు సరిగా ప్లాన్ చేయరు. అనువర్తన కోణంలో వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయడంలో తడబడతారు. కొందరు పర్సంటేజీ పెంచుకుందాం అంటూ పరీక్షలను వాయిదా వేస్తారు. ఇంకొందరు ఇంజినీరింగ్ పరీక్ష విధానం పట్ల తగిన అవగాహన ఏర్పరచుకోరు. ఈ విధమైన లోపాల వల్ల సంప్రదాయ కోర్సులతో పోల్చినప్పుడు ఇంజినీరింగ్‌లో ఉత్తీర్ణత శాతం చాలా తక్కువగా ఉంటోంది. వీటి పట్ల మొదటి నుంచి అప్రమత్తంగా ఉంటే బ్యాక్‌లాగ్‌లు లేకుండా మంచి మార్కులు సాధించుకోవచ్చు. సెమిస్టర్ గరిష్ఠంగా 750 మార్కులకు ఉంటే, అందులో ప్రాక్టికల్స్‌కి 150 లేదా 225 మార్కులు ఉంటాయి. సరిగా సిద్ధమైతే 20 నుంచి 30 శాతం మార్కులు వీటి నుంచే పొందవచ్చు.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

యూపీఎస్‌సీ

1) కంబైన్డ్ జియో సైంటిస్ట్, జియాలజిస్ట్ ఎగ్జామ్-2018

పోస్టులు: జియాలజిస్ట్, కెమిస్ట్, హైడ్రోజియాలజిస్ట్ తదితరాలు.
ఖాళీలు: 70 **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ ఉత్తీర్ణత. **వయసు:** 35 ఏళ్లకు మించకూడదు.

2) ఐఈఎస్/ ఐఎస్ఎస్ ఎగ్జామ్-2018



ఖాళీలు: ఇండియన్ ఎకనామిక్ సర్వీస్-14, ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీస్-32
అర్హత: ఎకనామిక్స్, మ్యాథమేటిక్స్ సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత.
వయసు: 21-30 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష/ వైవా/ ఇంటర్వ్యూ ఆధారంగా. **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్.
దరఖాస్తు ఫీజు: రూ.200
చివరితేది: 16.04.2018
వెబ్‌సైట్: http://www.upsc.gov.in/

ఓఎన్‌జీసీ

సంస్థ: ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ) లిమిటెడ్, డెహ్రాడూన్.
పోస్టులు: ఎగ్జిక్యూటివ్ (హెచ్ఆర్/ ఫైనాన్స్/ అఫిషియల్ లాంగ్వేజ్), అసిస్టెంట్ లీగల్ అడ్వైజర్.
ఖాళీలు: లీగల్ అడ్వైజర్-15, ఎగ్జిక్యూటివ్ ఖాళీలను తర్వాత వెల్లడిస్తారు.
అర్హత: 60శాతం మార్కులతో సంబంధిత స్పెషలైజేషన్లలో ఎంబీఏ/ పీజీ/ రెండేళ్ల పీజీ డిప్లొమా.
వయసు: 30 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలు, యూజీసీ నెట్-2018 స్కోరు, క్లాట్-2018 స్కోరు, ఇంటర్వ్యూ ద్వారా.
ఎగ్జిక్యూటివ్ పోస్టుల ఆన్‌లైన్ దరఖాస్తు: 06.04.2018 నుంచి 27.04.2018 వరకు.
లీగల్ అడ్వైజర్ ఆన్‌లైన్ దరఖాస్తు: 23.05.2018 నుంచి 21.06.2018 వరకు
వెబ్‌సైట్: http://ongcindia.com/

సుప్రీంకోర్టులో 78 పోస్టులు

పోస్టులు-ఖాళీలు: జూనియర్ కోర్ట్ అటెండెంట్-65, చాంబర్ అటెండెంట్-13
అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత.
వయసు: 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 15.04.2018
http://supremecourtofindia.nic.in/

ఎన్ఎండీసీ, హైదరాబాద్

సంస్థ: నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఎండీసీ), హైదరాబాద్.
వర్క్ లొకేషన్: నాగర్నార్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్, జగదల్‌పూర్, ఛత్తీస్‌గఢ్.
పోస్టులు: జూనియర్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్
ఖాళీలు: 11 **అర్హత:** ఆయా సబ్జెక్టులు/ బ్రాంచుల్లో బీఈ/ బీటెక్, డిగ్రీ, పీజీ, డిప్లొమా. దివ్యాంగ అభ్యర్థులు మాత్రమే అర్హులు.
వయసు: 55 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్.
చివరితేది: 14.05.2018
వెబ్‌సైట్: https://www.nmdc.co.in/

ఐటీఐ లిమిటెడ్

సంస్థ: ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ (ఐటీఐ) లిమిటెడ్, బెంగళూరు.
వర్క్ లొకేషన్: పాలక్కడ్ ప్లాంట్, కేరళ.
పోస్టు: కాంట్రాక్ట్ ఇంజినీర్
ఖాళీలు: 10
అర్హత: సంబంధిత బ్రాంచుల్లో బీఈ/ బీటెక్.
వయసు: 28 ఏళ్లకు మించకూడదు.
ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా.
దరఖాస్తు: ఆఫ్‌లైన్.
చివరితేది: 07.04.2018
వెబ్‌సైట్: http://www.itiltd-india.com/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

లైబ్రరీ

కాంపిటీటివ్ ఎగ్జామ్స్, అకడమిక్, ప్రవేశపరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఇటీవల మార్కెట్‌లోకి విడుదలైన పుస్తకాల వివరాలు.

ఆర్ఆర్‌బీ, పోస్టల్

1) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి 25 మోడల్ పేపర్లు, పేజీలు: 233, ధర: రూ. 108
2) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి మ్యాథమేటిక్స్, పేజీలు: 462, ధర: రూ. 180



3) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, పేజీలు: 230, ధర: రూ. 108
4) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ సైన్స్, పేజీలు: 246, ధర: రూ. 108
5) ఆర్ఆర్‌బీ గ్రూప్-డి జనరల్ అవేర్‌నెస్-కరెంట్ అఫైర్స్, పేజీలు: 324, ధర: రూ. 144
6) పోస్ట్‌మాన్/మెయిల్ గార్డ్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్, టాప్ 31 మోడల్ పేపర్స్ (తెలుగులో), పేజీలు: 182, ధర: రూ. 81
7) పోస్ట్‌మాన్/మెయిల్ గార్డ్ అండ్ మల్టీ టాస్కింగ్ స్టాఫ్, టాప్ 21 పేపర్స్ (ఇంగ్లిష్‌లో), పేజీలు: 159, ధర: రూ. 81

ప్రచురణ: వీజీఎస్ బుక్ లింక్స్

Fit as a fiddle... ఏ అర్థంలో?

MODERN ENGLISH USAGE

'అతడి ఆరోగ్యానికేం.. దుక్కలా ఉన్నాడు' అని తెలుగులో అంటుంటాం. ఇంచుమించు ఇలాంటిదే ఇంగ్లిష్‌లో కూడా ఉంది. చాలా ఆరోగ్యంతో బలంగా ఉండటాన్ని సూచించే వ్యక్తీకరణ. అదేమిటో, దాన్ని ఎలా ఉపయోగించాలో చూద్దామా?

Narayana: Sunil is a good speaker. I don't know how he acquired the gift of the gab (సునీల్ మంచి వక్త. అంత వక్తృత్వం అతనికి ఎక్కడి నుంచి వచ్చిందో తెలీడం లేదు).

Bhaskar: No surprise in it. His grandfather was a great speaker. He must have inherited it from his grandfather (అందులో ఆశ్చర్యం లేదు. అతని తాతయ్య మంచి వక్త. ఆయన దగ్గరినుంచి అతను ఈ వక్తృత్వం వారసత్వంగా పొందివుండాలి).

Narayana: The last time I met him, he was on a knife edge. He could not talk to me steadily because he had had something else on his mind (క్రితంసారి నేనతన్ని కలుసుకున్నపుడు అతను ముళ్ల మీదున్నట్టు కనిపించాడు).



ఎం. సురేశన్

Bhaskar: His uncle is under a cloud. He grabbed all the property of Sunil, and Sunil and his parents were not aware of it. That must have been the cause of his father's absent-mindedness (వాళ్ల బాబాయిని ఎవరూ నమ్మటం లేదు. సునీల్ ఆస్తిని కాజేశాడు. అయితే అది సునీల్‌కుగానీ అతని తల్లిదండ్రులకుగానీ తెలీదు. అది వాళ్ల నాన్న అన్యమనస్కుడై ఉన్నందువల్ల అయ్యుండొచ్చు).

Narayana: He and his dad are too innocent and trust everybody. That was how his uncle was able to cheat them (అతనూ, వాళ్ల నాన్నా మరీ అమాయకులు. అందరినీ నమ్మేస్తారు).

Bhaskar: Yea, I have had some experience of his uncle. He is always fit as a fiddle and I have never seen him fall ill. He is always under a cloud. None trusts him (అవును, వాళ్ల బాబాయిని గురించి నాకూ కాస్త అనుభవం ఉంది. ఎప్పుడూ చాలా ఆరోగ్యంగా ఉంటాడు, అతను జబ్బు పడటం నేను చూడలేదు. అతన్ని అందరూ సందేహిస్తారు. ఎవరూ అతన్ని నమ్మరు).

Narayana: Hope Sunil and his dad will wriggle out of the trouble and his uncle will be taught a lesson. (సునీల్, వాళ్ల నాన్న ఈ చిక్కుల్లో నుంచి బయట పడతారని వాళ్ల బాబాయికి బుద్ధి చెప్తారని ఆశిస్తున్నా).

Bhaskar: It is really shocking that his uncle has cheated his own close relatives (తన దగ్గరి చుట్టాలనే వాళ్ల బాబాయి మోసం చేయడం చాలా దిగ్భ్రాంతికరంగా ఉంది).

Narayana: Yea, the more you trust someone, the more they cheat you (అవును, నువ్వు ఇతరులను ఎంత నమ్మితే వాళ్లు నిన్నంత మోసం చేస్తారు).



Now look at the following expressions from the conversation:

1. Gift of the gab = Ability to talk fluently (ఉపన్యాస చాతుర్యం).

Jayanth: How good a speaker our friend Muralidhar! (మన మురళీధర్ ఎంత గొప్ప వక్త!)

Sampath: Oh, he is an excellent speaker. None else equals him in making fiery speeches. He has the gift of the gab (అవును అతను చాలా గొప్ప ఉపన్యాసకుడు. ఉద్వేగంతో ఉపన్యాసాలు ఇవ్వడంలో అతనికి ఎవరూ సమానం కాదు. అతనికి మంచి ఉపన్యాస పటిమ ఉంది).

2. Fit as a fiddle = Very healthy and strong చాలా ఆరోగ్యంతో బలంగా ఉండటం).

Jayakumar: Nataraj has always some health trouble or the other. His visits to the doctor are very frequent (నటరాజ్‌కు ఏదో ఒక ఆరోగ్య సమస్య వస్తుంటుంది. తరచుగా డాక్టర్‌ను కలుస్తుంటాడు).

Peter: His brother is the exact opposite. He is very robust and always fit as a fiddle (అతని తమ్ముడు అతనికి పూర్తిగా వ్యతిరేకం. అతను ఎప్పుడూ ఆరోగ్యంగా ఉంటాడు).

3. Under a cloud = Not trusted by anybody (ఎవరూ నమ్మకపోవడం).

Sankar: The officer is notorious for taking bribes. He is quite wealthy and owns a lot of properties (ఆ అధికారి లంచాల విషయంలో చాలా పేరు మోసినవాడు. అతను సంపన్నుడు, ఆస్తులు కూడా ఉన్నాయి).

Prabhakar: He has always been under a cloud. But recently the Anti-corruption Bureau trapped him. He has been suspended from service (ఎప్పుడూ అతను అనుమానించదగ్గ వ్యక్తే. కానీ ఈ మధ్యనే అవినీతి నిరోధకశాఖ అతన్ని పట్టుకుంది. అతన్ని తాత్కాలికంగా ఉద్యోగ విధుల నుంచి బహిష్కరించారు).

అవిశ్వాసం.. మమ నిత్యం

పాము విడవదు.. కప్ప చావదు..
హోదాపై అవిశ్వాస తీర్మానం తేలదు
భాజపా అనుమతించదు
తెదేపా.. వైకాపా పట్టువీడవు
సొంత ప్రయోజనాలే అజెండా
నేడైనా చర్చిస్తారా? కాలాన్ని హరించేస్తారా?



ఏపీ భవన్ వద్ద వెంకట్

హోదా కోసం యువకుడి సైకిల్ యాత్ర

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండు చేస్తూ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కొల్లా వెంకట్ చేపట్టిన సైకిల్ యాత్ర ముగిసింది. వీరవాసరం మండలం మెంటేపూడికి చెందిన వెంకట్ ఫిబ్రవరి 14న తిరుపతిలో ఆ యాత్ర ప్రారంభించారు. 2500 కిలోమీటర్ల మేరసాగిన ఈ యాత్ర చేసిన బుధవారం దిల్లీలోని ఏపీ భవన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. గతంలోనూ తాను సైకిల్ యాత్ర చేపట్టినట్లు గుర్తుచేశారు. 'ప్రత్యేక హోదా ఐదు అక్షరాల పదం కాదు ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం' అంటూ తన యాత్ర విజయవంతంగా పూర్తి అయిందన్నారు. రాష్ట్రానికి కేంద్రం అన్యాయం చేయకూడదని తగిన నిధులు ఇవ్వాలని డిమాండు చేశారు.

పోలవరానికి నిధులిస్తూనే ఉన్నాం: గడ్కరీ

ఈనాడు, దిల్లీ: పోలవరం ప్రాజెక్టు పనుల కోసం కేంద్రం నుంచి నిధులు ఇస్తూనే ఉన్నామని కేంద్ర జలవనరుల శాఖమంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం గడ్కరీని కలిశారు. తాజాగా పోలవరానికి కేంద్రం నుంచి రూ.1400 కోట్లకు పైగా నిధులు కేటాయించినందుకు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

'చంద్రబాబుపై సీబీఐ దర్యాప్తు ఖాయం'

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే: పోలవరం నిర్మాణం, పట్టిసీమ ప్రాజెక్టు, రాజధాని భూముల విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇతర మంత్రులు దోచుకున్న సొమ్ములపై సీబీఐ దర్యాప్తు జరగడం, వారు జైలుకు వెళ్లడం ఖాయమని వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి జోగి రమేష్ పేర్కొన్నారు. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలపై అడగడం వల్లే కేంద్రం తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా మాట్లాడుతూ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. వాటిని ప్రజలు నమ్మవద్దని కోరారు.

మోదీతో కేసీఆర్ లాలూచీ

- జనసేనతో వామపక్షాలు కలిసి పనిచేస్తాయి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వెల్లడి

సత్తెనపల్లి, విజయవాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అమలు చేయాల్సిన విభజన హామీలు, ప్రత్యేకహోదా అంశంపై అనుమతి ఇవ్వకపోగా, అవిశ్వాస తీర్మానం పెడతామంటే మోదీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. విజయవాడ, సత్తెనపల్లిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ కేంద్రంతో లాలూచీ పడి సభలో గందరగోళం సృష్టించి అవిశ్వాస తీర్మానానికి అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రులైతే, తెలుగువారైతే, సవతితల్లి ప్రేమపై పోరాటం చేయాలని రాష్ట్ర భాజపా నేతలకు ఆయన పిలుపునిచ్చారు. ఆందోళనలు చేస్తున్న ఎంపీలతో సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రానికి ఏం చేస్తామన్నది చెప్పకపోవడం వారి మొండి వైఖరిని..రాష్ట్రం పట్ల ఉన్న అలుసును తేటతెల్లం చేస్తుందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రిని.. ప్రభుత్వాన్ని బెదిరించేలా మాట్లాడటం, లెక్కలేనితనంతో వ్యవహరించడం శోచనీయమని భాజపా నేతలను ఉద్దేశించి ఆయన విమర్శలు చేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, సీపీఐ, సీపీఎం, లోక్‌సత్తా పార్టీలు కలిసి పని చేస్తాయని స్పష్టం చేశారు.

పోలవరంపై నోటీసులు: ఉండవల్లి

ఈనాడు డిజిటల్, రాజమహేంద్రవరం: పోలవరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం చెబుతున్న దానికి, మినిట్స్‌లో పేర్కొన్న దానికి పొంతన లేదని దీనిపై ప్రభుత్వ కార్యదర్శికి, ముఖ్య ఇంజినీరు, ఇతర అధికారులకు నోటీసులు ఇచ్చినట్లు మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. పోలవరంపై మినిట్స్‌లో లేని విషయాలను మీరే చెబుతున్నారా లేక ప్రభుత్వ ఆదేశాల మేరకు చెబుతున్నారా? అనేది వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నట్లు తెలిపారు.

ఋణ సాయం అందని ద్రాక్ష!

- రూ.7వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో చేతులెత్తేసిన ఏఐఐబీ
- వేరే విదేశీ సంస్థల నుంచి రుణం తీసుకోవాలని సూచన

ఈనాడు - దిల్లీ

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రకటించిన ఈఏపీ (ఎక్స్‌టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్స్) రుణ వితరణలో ఇటు కేంద్రం, అటు విదేశీ రుణ సంస్థలు మెలికలు పెట్టడంవల్లే రాష్ట్ర ప్రభుత్వం ఆ విధానానికి దండం పెట్టినట్లు తెలుస్తోంది. 2017 నవంబరు 23న కేంద్ర ఆర్థికశాఖలో ఈఏపీ రుణాల గురించి జరిగిన సమావేశంలో నమోదైన వివరాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. ఆ సమావేశంలో ఏపీ ఆర్థికశాఖ కార్యదర్శి ఎం.రవిచంద్ర 2015 మార్చి 31 తర్వాత సంతకాలు చేసిన విదేశీ ప్రాజెక్టుల జాబితాను సమర్పించారు. అందులో అయిదు ప్రాజెక్టులకు ఆసియా మౌలికవసతుల పెట్టుబడి బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణం తీసుకోడానికి అవసరమైన వివరాలు సమర్పించారు. అయిదు ప్రాజెక్టులకు ఇచ్చేంత డబ్బు తమ వద్ద లేదని, అందులో రెండు ప్రాజెక్టులకోసం మరేదైనా విదేశీ ఆర్థిక సంస్థలను ఆశ్రయించాలని ఏఐఐబీ సూచించింది. ఆ రెండింటిలో ఒకటి రూ.3,723 కోట్ల విలువైన ఆంధ్రప్రదేశ్ పట్టణ తాగు నీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ ప్రాజెక్టు, ఇంకోటి రూ.3,200 కోట్ల విలువైన మండల, గ్రామీణ రహదారుల అనుసంధాన ప్రాజెక్టు. అంటే కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కింద రావాల్సిన రూ.16వేల కోట్ల ఈఏపీ మొత్తంలో సుమారు రూ.7వేల కోట్ల విలువైన ప్రాజెక్టుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చినట్లయింది. ఈ రెండింటి కోసం జాతీయ అభివృద్ధి బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులను ఆశ్రయించాలని ఆ సమావేశంలో సూచన వచ్చినట్లు తెలుస్తోంది. దానిప్రకారం మళ్లీ మొదటి నుంచి ఆ రెండు విదేశీ ఆర్థిక సంస్థలకు ప్రతిపాదనలు పంపడం, పరిశీలించడం, ఆమోదముద్ర వేయడం వంటి ప్రక్రియ జరగాలి. ఇందుకు కనీసం ఆరు నెలలకు పైగానే సమయం పట్టే అవకాశం ఉంది. ఇది గమనించే ముఖ్యమంత్రి చంద్రబాబు దేశీయ ఆర్థిక సంస్థల నుంచి ప్యాకేజీ మొత్తాన్ని ఇప్పించాలని కోరారు. అందుకు కేంద్రం సరే అన్నప్పటికీ ఎస్‌పీవీ ఏర్పాటు చేసుకోవాలని షరతు విధించింది. అందులో పరిపాలనాపరమైన ఇబ్బందులు ఉండటం, పలు విషయాల్లో కేంద్ర ప్రభుత్వ అనుమతులు తప్పనిసరి కావడంవల్ల రాష్ట్ర ప్రభుత్వం అందుకు ఒప్పుకోలేదని తెలిసింది. ఈ అంశాన్ని ఎలాగోలా ఎన్నికల వరకు లాగే ఉద్దేశంతోనే ఇలాంటి ఎత్తుగడ వేసినట్లు ఏపీ ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

పోలవరానికి నిధులు ఆపితే కేంద్రానికే నష్టం: యనమల

ఈనాడు, అమరావతి: లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా కేంద్ర ప్రభుత్వమే అడ్డుకుంటోందని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వమే స్పీకర్‌పై ఒత్తిడి తెచ్చి, అవిశ్వాస తీర్మానంపై చర్చ చేపట్టకుండా వాయిదా వేయిస్తోందని మండిపడ్డారు. బుధవారం శాసనసభ లాబీలో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. అవిశ్వాస తీర్మానం పెట్టినంత మాత్రాన, పోలవరం వంటి ప్రాజెక్టుకి నిధులు ఆపడం కేంద్రం వల్ల కాదని పేర్కొన్నారు. "పోలవరం రాష్ట్రాభివృద్ధికి, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశం. రాష్ట్రాన్ని కరవు రహితంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టు అది. దానికి నిధులు ఆపడమంటే రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోవడమే. అలా చేస్తే రైతులే తిరగబడతారు. పోలవరం పనులన్నీ కేంద్రం కనుసన్నల్లోనే జరుగుతుంటే ఇంకా ఏం విచారణ చేపడతారు? నిబంధనలకు అనుగుణంగానే కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయి" అని తెలిపారు. "పోలవరం ప్రాజెక్టుకి నిధులు ఆపితే కేంద్రానికే నష్టం. పనులన్నీ పోలవరం ప్రాజెక్టు అథారిటీ పర్యవేక్షణలోనే జరుగుతున్నాయి. నిర్వాసితుల పునరావాస బాధ్యత తమదేనని అరుణ్‌జైట్లీ, నితిన్ గడ్కరీ అనేకసార్లు చెప్పారు" అని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అభ్యంతరాలు చెప్పే అధికారం కేంద్రానికి లేదన్నారు. సభలో గందరగోళ పరిస్థితులున్నాయని అవిశ్వాస తీర్మానాన్ని చర్చకు చేపట్టకుండా వాయిదా వేయడం పద్ధతి కాదన్నారు. "సభను ఆర్డర్‌లో పెట్టే అధికారం, బాధ్యత స్పీకర్‌కే ఉంది. స్పీకర్ తలుచుకుంటే గొడవ చేస్తున్నవారిని సస్పెండ్ చేసి సభ నడిపించవచ్చు. సభ్యులకు రాజ్యాంగపరంగా ఉండే హక్కుని కాలరాయకుండా స్పీకర్ అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చూడాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఆపరేషన్ గరుడకు ఎవరూ భయపడరు

ఈనాడు, దిల్లీ: రాజకీయ ఎత్తుగడతోనే కేంద్రం లోక్‌సభలో అవిశ్వాసం తీర్మానం చర్చకు రాకుండా చేస్తోందని తెదేపా ఎంపీలు విమర్శించారు. ఒక ప్రణాళిక ప్రకారం సభను వాయిదా వేసుకుపోతున్నారని మండిపడ్డారు. ఆపరేషన్ గరుడ పేరుతో సామాజిక మాధ్యమాల్లో ఏదో ప్రచారం చేసి భయపెట్టాలని చూస్తున్నారు.. అలాంటివాటికి తెదేపా బెదరదని స్పష్టం చేశారు. బుధవారం పార్లమెంట్ ఉభయ సభలూ వాయిదాపడ్డాక తెదేపా ఎంపీలు విజయ్‌చౌక్‌లో విలేకరులతో మాట్లాడారు.

తెదేపా లోక్‌సభాపక్షనేత తోట నరసింహం మాట్లాడుతూ.."నాలుగోసారి అవిశ్వాసం నోటీసును వాయిదావేశారు. రేపటికి కూడా అవిశ్వాసం నోటీసునిచ్చాం. కేంద్ర వ్యవహారం చూస్తుంటే గూడుపుఠాణిలా కనబడుతోంది. అన్నాడీఎంకే, తెరాస పార్టీలతో సంప్రదింపులు జరిపి సభను సజావుగా నిర్వహించి అవిశ్వాసంపై చర్చ చేపట్టే ప్రయత్నం కేంద్రం చేయడం లేదు. రాజకీయ ఎత్తుగడగా చర్చకు సిద్ధమంటున్నారు తప్ప సభలో చర్చ చేపట్టట్లేదు" అన్నారు. అవిశ్వాసానికి సహకరించాలని తెరాస అధినేత కేసీఆర్‌ను తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ఎందుకు కోరడం లేదని ఒక విలేకరి అడగ్గా.."లోక్‌సభలో తెరాస పక్ష నేతే ప్రధానం అందువల్లే జితేందర్‌రెడ్డితోనే మాట్లాడామ"ని నరసింహం సమాధానమిచ్చారు. "అవిశ్వాసంపై చర్చ జరపకుండా భాజపా ప్రభుత్వం పారిపోతోంది. దమ్ముంటే చర్చ జరపండి. పార్లమెంట్‌లో చేసిన చట్టాలను కూడా అమల్జేయకుండా విలువల్లేకుండా వ్యవహరిస్తున్నారు"అని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. మురళీమోహన్ మాట్లాడుతూ' 'సభను జరక్కుండా ఎన్డీయే ప్రభుత్వమే చేస్తోంది. నిరసన చేస్తున్నారంటూ మాపై నెపం వేస్తున్నారు. ముందస్తు ప్రణాళిక(ప్రీ-ప్లాన్డ్) ప్రకారమే సభాను వాయిదా వేస్తూ..అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా చేస్తున్నారు. తెలుగువారి సహనాన్ని పరీక్షించకండి మాకు అన్యాయం చేసినవారు ఏమయ్యారో ఆలోచించుకోండి, ఆ పరిస్థితి మీకు రాకుండా చూసుకోండని" కేంద్రాన్ని హెచ్చరించారు. మాగంటిబాబు మాట్లాడుతూ"ఏపీకి మోదీ ఇచ్చిన హామీలను అమల్జేయట్లేదు. మేం ఇక్కడ పార్లమెంట్‌లో మాట్లాడుతున్నా ఆయనకు వినపడట్లా.. ఎన్టీఆర్ గురించి భక్తిశ్రద్ధలతో పార్లమెంట్‌లో మీరు మాట్లాడితే మీకెంత అభిమానం ఉందనుకున్నాం కానీ, ఇంత నమ్మకద్రోహం చేస్తారనుకోలేదు. తెలుగుప్రజల తరపున రోజుకు భాజపాకు లక్ష ఓట్లు తగ్గుతూనే ఉంటాయి. తెలుగువాడిపై కక్షతోనే తెలుగు రాష్ట్రాన్ని విభజించారు. ఇప్పుడూ అదే కక్ష కొనసాగిస్తున్నారు. హోదా సంగతి తేల్చేదాక పార్లమెంట్‌ను జరగనిచ్చే ప్రసక్తే లేద"న్నారు. రవీంద్రబాబు మాట్లాడుతూ.. "సభను ప్రధాని, స్పీకర్ నియంత్రించాలి. వారు చేయకపోతే ఎలా? విధి నిర్వహిస్తేనే ఎంపీలకు జీతం అమల్జేయాలని ఎవరో ఎంపీ లేఖ రాశారట. మాకు జీతం లేకపోయినా పర్లేదు. పార్లమెంట్ ఉన్నంతవరకు ఇక్కడ అడుగులేస్తాం. తర్వాత ప్రజల్లోకొస్తాం" అని హెచ్చరించారు.

> సభను నిర్వహించడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. ఎన్నికల్లో మూల్యం చెల్లించుకుంటారు. ఎన్ని రోజులు ఇలా సభను వాయిదా వేసుకుంటూ పోతే అన్ని రోజులూ రోజుకు 15 లక్షలు చొప్పున ఓట్లు భాజపా కోల్పోతుంది. సామాజిక మాధ్యమాల్లో ఆపరేషన్ గరుడ అంటూ ఏదో చేస్తున్నారు వీటికి మేమెవరం భయపడం.
> – అవంతి శ్రీనివాస్

అందరూ రాజీనామాలు చేసేద్దాం రండి..

- వైకాపా నేతలను చేర్చుకుని మమ్మల్ని గెంటేశారు
- భాజపా నాయకుల వ్యాఖ్యలు

ఈనాడు, అమరావతి: "గత ఎన్నికల్లో తెదేపా, భాజపా కలిసే పోటీ చేశాయి. జనసేన కూడా మద్దతిచ్చింది. మా పార్టీ ఎమ్మెల్సీలు రాజీనామా చేయాల్సి వస్తే... తెదేపా నుంచి గెలిచినవారూ రాజీనామా చేయాలి. 2014 ఎన్నికల్లో గెలిచి, అధికారంలో ఉన్న వారంతా రాజీనామాలు చేసి, మళ్లీ ఎన్నికలకు వెళ్లాలి" అని భాజపా శాసనసభాపక్ష నాయకుడు విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. బుధవారం శాసనసభలోని భాజపా శాసనసభాపక్ష కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు విష్ణుకుమార్‌రాజు, సోము వీర్రాజు, పైడికొండల మాణిక్యాలరావు విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. "నేను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానని, గుంటూరులో విలేకరుల సమావేశంలో అన్నట్టుగా ఒక పత్రికలో వక్రీకరించి రాశారు. ముఖ్యమంత్రితో సహా అందరూ రాజీనామాలు చేస్తే నేను కూడా చేస్తాను" అని సోము వీర్రాజు పేర్కొన్నారు. దీనిపై విష్ణుకుమార్‌రాజు స్పందిస్తూ... "అందరూ రాజీనామాలు చేసేద్దాం. మొత్తం ప్రక్షాళన చేసి అప్పుడు ఎన్నికలకు వెళదాం" అని తెలిపారు. "తెదేపా నాయకులు పదే పదే ఆ మూడు పార్టీలు కుమ్మక్కయ్యాయని అంటున్నారు. జగన్, పవన్ కల్యాణ్‌లతో మాకేం సంబంధం. సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ కూడా... పదేళ్ల నుంచీ ఆ పార్టీ అవినీతి చేసిందంటూ నా వైపు చూపిస్తున్నారు" అని అన్నారు. తెదేపా నాయకులు నిస్పృహలో ఉన్నారని, అందుకే అలా మాట్లాడుతున్నారని సోము వీర్రాజు పేర్కొన్నారు. తాము ప్రభుత్వం నుంచి బయటకు వచ్చేసినా, వైకాపా ఎమ్మెల్యేలు మాత్రం ప్రభుత్వంలోనే ఉన్నారని, వాళ్లను చేర్చుకున్నాకే తమను బయటకు గెంటేశారని మాణిక్యాలరావు వ్యాఖ్యానించారు. 'తెదేపా అటు వైకాపాతోను ఉంటుంది. కాంగ్రెస్‌తోను ఉంటుంది. మేం నీతి, నిజాయతీతో ఉంటే... హఠాత్తుగా పట్టిసీమలో తోసేశారు" అని విష్ణుకుమార్‌రాజు అన్నారు. రాష్ట్రంపై యుద్ధం చేయమని దిల్లీలోని భాజపా పెద్దలు అన్నట్టుగా తెదేపా నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అమిత్‌షాతో తమ సమావేశంలో అలాంటి ప్రస్తావనే రాలేదని పేర్కొన్నారు. "ఏ1, ఏ2లుగా ఉన్న నిందితులకు అపాయింట్‌మెంట్‌లు ఇస్తున్నారని మమ్మల్ని విమర్శిస్తున్నారు. మరి వాళ్ల పార్టీ తరపున గెలిచి, మిమ్మల్ని తిట్టిన వాళ్లను ఎందుకు మంత్రుల్ని చేశారు. ముందు వాళ్లతో రాజీనామాలు చేయించండి. మేం ప్రభుత్వం నుంచి బయటకు రాకముందే వాళ్లను చేర్చుకున్నారు కదా?" అని వీర్రాజు వ్యాఖ్యానించారు.

సీఎంకు బినామీగా ప్రత్తిపాటి

- ప్రజాసంకల్ప యాత్రలో జగన్ విమర్శ

ఈనాడు డిజిటల్, గుంటూరు: పౌరసరఫరాల మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి బినామీగా వ్యవహరిస్తున్నారని వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విమర్శించారు. ప్రజాసంకల్ప యాత్ర బుధవారం చిలకలూరిపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభలో విపక్షనేత మాట్లాడారు. గత ప్రభుత్వం పేదలకు భూములిస్తే వాటిని లాక్కొని మంత్రి ప్రత్తిపాటి మైనింగ్‌కు వాడుకుంటున్నారని, ఇసుకను అమ్ముకుంటున్నారన్నారు. వచ్చిన సొమ్మును పుల్లారావు, మంత్రి లోకేశ్ పంచుకుంటున్నారని ఆరోపించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి ఆ భూములను తక్కువ రేటుకు కొనుక్కుంటున్నారన్నారు. 2014లో పత్తి కొనుగోళ్లలో అవకతవకలు చిలకలూరిపేట కేంద్రంగా జరిగాయని విమర్శించారు.



చిలకలూరిపేట ప్రాంత పాదయాత్రలో ప్రజలకు అభివాదం చేస్తున్న జగన్

నకిలీ పురుగుల మందులు, ఎరువులకు గుంటూరు జిల్లా అడ్డాగా మారిందని జగన్ ఆరోపించారు. నాలుగేళ్ల చంద్రబాబు పాలనలో రైతులకు గిట్టుబాటు ధర దక్కలేదన్నారు. పేదలకు సొంతిల్లు అంటూ రూ.3 లక్షలు విలువ చేసే ఇంటికి రూ.6 లక్షలు చెల్లించేలా లంచాలు తీసుకుని ధరలు పెంచేశారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో గట్టిగా అడిగి సాధించే ప్రత్యేక హోదాను కేంద్రంతో లాలూచీపడి నీరుగార్చారని విమర్శించారు. పాదయాత్రలో వైకాపా నాయకులు మర్రి రాజశేఖర్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రత్యేకహోదా ద్రోహి

- ఆయన్ను బోనులో నిలబెట్టేంతవరకు చేయాల్సిందంతా చేస్తాం
- వైకాపా ఎంపీల వ్యాఖ్యలు

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని వైకాపా ఎంపీలు విమర్శించారు. పార్లమెంట్‌ను ఇలాగే నాలుగురోజులు నడిపించి తర్వాత నిరవధిక వాయిదా వేసుకుని వెళ్లిపోదామని కేంద్రం చూస్తున్నట్లుందని మండిపడ్డారు. బుధవారం పార్లమెంట్ వాయిదాపడ్డాక విజయ్‌చౌక్‌లో వైకాపా ఎంపీలు విలేకరులతో మాట్లాడారు. ఆ వివరాలు.

ప్రజలేమీ అమాయకులు కారు: రాజమోహన్‌రెడ్డి

ప్రత్యేకహోదా ద్రోహులను ప్రజలు శిక్షిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతున్నారు. ప్రజలేమీ అమాయకులు కారు. ఆ మాటలన్నీ మీకే వర్తిస్తాయి. ఎందుకంటే ప్రత్యేకహోదా వద్దంది మీరే. ప్రజలు మిమ్మల్నే శిక్షిస్తారు. మీరే ద్రోహి. మిమ్మల్ని నమ్మి మేమెలా ప్రత్యేకహోదా కోసం వచ్చేదని సినీనటుడు పోసాని కృష్ణమురళి కూడా మీపై వ్యాఖ్యలు చేశారు.

అప్పు 1.2 లక్షల కోట్లు పెరిగింది: విజయసాయిరెడ్డి

ప్రధాని కలుస్తాను. కేంద్ర మంత్రులను కలుస్తాను. ఏమైనా చేసే హక్కు నాకుంది. చంద్రబాబు అవినీతికి పాల్పడుతున్నారు. గత నాలుగేళ్లలో రాష్ట్ర అప్పు రూ.1.2 లక్షల కోట్ల మేర పెరిగింది. ఆ డబ్బులు, కేంద్రం నుంచి వచ్చిన నిధులు, రాష్ట్రంలో పన్ను రాబడి ఏమైంది. అంతా జేబుల్లో వేసుకున్నారు. హవాలా విధానంలో విదేశాలకు తరలించారు. చంద్రబాబును బోనులో పెట్టేంతవరకు, విచారణకు ఆదేశించి ఆయనపై చట్టపమైన చర్యలు తీసుకునేంతవరకు మేం చేయాల్సిందంతా చేస్తాం.

రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాడతాం: వైవీ సుబ్బారెడ్డి

నాలుగు రోజులుగా లోక్‌సభలో అవిశ్వాస తీర్మానం నోటీసుపై స్పీకర్ ప్రస్తావించినప్పుడలా మద్దతునిస్తున్న పార్టీల ఎంపీలు అందరూ లేచి నిలబడుతున్నారు. అయినా స్పీకర్ ఎందుకు వాయిదా వేస్తున్నారో అర్థం కావడం లేదు. రేపటికి కూడా అవిశ్వాస నోటీసు ఇచ్చాం. ఎవరి అవిశ్వాసం చర్చకు వచ్చినా రాష్ట్ర ప్రయోజనాలకోసం పోరాడతాం.

నియోజకవర్గానికో బీసీ గురుకుల పాఠశాల

- ఈ ఏడాది కొత్తగా 65 మంజూరు
- బీసీ సంక్షేమ మంత్రి అచ్చెన్నాయుడు

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి నియోజకవర్గానికి ఒక బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు బీసీ సంక్షేమశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఈ ఏడాది 65 పాఠశాలలను మంజూరు చేశామన్నారు. బీసీల సంక్షేమానికి తెదేపా మూడున్నరేళ్ల పాలనలో ఏడాదికి సగటున రూ.3216 కోట్లు ఖర్చు చేశామన్నారు. శాసనమండలిలో బుధవారం సంక్షేమ రంగంపైన లఘు చర్చకు మంత్రి సమాధానమిచ్చారు.

రాయితీపై రుతు రుమాళ్లు.. సునీత: స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించి ఆశాఖ మంత్రి పరిటాల సునీత మాట్లాడుతూ తొలిసారిగా డ్వాక్రా మహిళలకు రాయితీపై రుతు రుమాళ్లు అందజేస్తున్నామన్నారు. బాలలపై లైంగిక వేధింపులకు సంబంధించి 3,952 కేసులు నమోదు చేశామని వివరించారు.

31 ఆహార పరిశీలకుల పోస్టులు ఖాళీ.. యనమల: ఆంధ్రప్రదేశ్‌లో ఆహార పరిశీలకులు (ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు) మొత్తం 54 మందికి ...23 మందే ఉన్నారని, 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పారు. ప్రశ్నోత్తరాల సమయంలో పి.శమంతకమణి అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు

వచ్చే ఏడాది రుణ ఉపశమనానికి రూ.4,100 కోట్లు కేటాయింపు: వ్యవసాయ సహాయక కార్యకలాపాలపై శాసనసభలో స్వల్పకాలిక చర్చ జరిగింది. మంత్రి సోమిరెడ్డి మాట్లాడుతూ రుణ ఉపశమన పథకం కింద ఈ ఏడాది రూ.3,600 కోట్లు కేటాయించి రూ.3,300 కోట్లు విడుదల చేశామన్నారు. ఇందులో రూ.3,060 కోట్లు రైతుల ఖాతాలో జమ చేసినట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది చెల్లించేందుకు రూ.4,100 కోట్ల బడ్జెట్ కేటాయింపులు చేసిన విషయాన్ని గుర్తుచేశారు.

తెదేపా హయాంలోనే ఎస్సీలకు ఇన్నోవా, స్విఫ్ట్ కార్లు: వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఎస్సీ ఉప ప్రణాళిక నిధుల్ని దారి మళ్లించి ఇడుపులపాయకు రహదారులు నిర్మించారని ఎమ్మెల్యేలు ధ్వజమెత్తారు. తెదేపా అధికారంలోకి వచ్చాక ఎస్సీలకు ఇన్నోవా, స్విఫ్ట్ కార్లు అందిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మునుపెన్నడూ లేని రీతిలో ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి జరుగుతోందని ప్రశంసించారు..బుధవారం శాసనసభలో 2018-19 ఆదాయ వ్యయ ప్రణాళికపై చర్చ సందర్భంగా పలువురు మాట్లాడారు.

జగన్‌కు అప్పుడే చెప్పాం.. మీకేం తెలుసన్నారు: పట్టిసీమ ప్రాజెక్టు పరిశీలనకు జగన్ తమను తీసుకెళ్లినప్పుడే ఆ విషయాన్ని వదిలేయమని ఆయనను కోరినట్లు శ్రీశైలం ఎమ్మెల్యే బి.రాజశేఖరరెడ్డి వివరించారు. దానివల్ల పార్టీకి మేలుకు బదులు నష్టం జరుగుతుందని చెప్పగా మీకేం తెలుసని ఎదురు ప్రశ్నించారన్నారు. ఆయన మనస్తత్వం గమనించే పార్టీ నుంచి బయటకొచ్చానన్నారు. నియోజకవర్గంలో నీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలన్న ముఖ్యమంత్రి సూచన మేరకే సిద్ధాపురం ఎత్తిపోతలను 14 నెలల్లో పూర్తి చేసి 25వేల ఎకరాల ఆయకట్టుకు నీరివ్వగలిగామన్నారు.

మీడియా పాయింట్

నిరుద్యోగ భృతి ఎందుకివ్వలేదు

మేమడిగినంతా ఇవ్వాలి లేకపోతే ఇలాగే పోరాటం చేస్తాం అన్నట్లుగా తెదేపా నేతలు మాట్లాడుతున్నారు. చంద్రబాబు పాదయాత్రలో రిజర్వేషన్లు, రుణమాఫీ, నిరుద్యోగ భృతి లాంటి మొత్తం 1500 వాగ్దానాలు చేశారు. ఇప్పుడు ప్రతిదానికి నిధులివ్వలేదని కేంద్రాన్ని నిందిస్తున్నారు. అసలు ఈ నాలుగేళ్లు నిరుద్యోగ భృతి ఎందుకివ్వలేదు?

– మాధవ్, భాజపా ఎమ్మెల్సీ

షోకాజ్ నోటీసు ఎలా ఇస్తారు?

- వైకాపా చీఫ్ విప్‌కి అరకు ఎంపీ కొత్తపల్లి గీత లేఖ

ఈనాడు, దిల్లీ: "లోక్‌సభలో అవిశ్వాసం నోటీసు చర్చకు రాకుండానే విప్ ఉల్లంఘించారంటూ షోకాజ్ నోటీసు ఎలా జారీచేస్తారు? పార్లమెంటరీ వ్యవహారాల ప్రక్రియ పట్ల అవగాహన లేకుండా ఇలాంటి నోటీసులను ఇస్తారా? రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కాక నాపై వ్యక్తిగత కక్షతో అవిశ్వాసం పెట్టినట్లుగా ఉన్నారు.. అందువల్లే ఇలా షోకాజ్ నోటీసులిస్తున్నారా?"అని అరకు ఎంపీ కొత్తపల్లి గీత వైకాపా చీఫ్ విప్ వైవీ సుబ్బారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైవీకి ఆమె ఒక లేఖను పంపారు.

తన హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ వైవీ సుబ్బారెడ్డిపై లోక్‌సభ స్పీకర్‌కు గురువారం ఫిర్యాదు చేయనున్నట్లు గీత వెల్లడించారు. విశాఖ రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం వెంటనే ఏర్పాటుచేయాలని, విభజన గాయాలతో సతమతమవుతున్న ఏపీకి పూర్తిస్థాయిలో చేయూతనందించాలని ప్రధానిని కోరినట్లు ఎంపీ కొత్తపల్లి గీత తెలిపారు. బుధవారం ప్రధాని మోదీని కలిసి రాష్ట్రంలోని పరిస్థితులను వివరించినట్లు చెప్పారు.

కాళీయమర్దనా.. ఈ కాలుష్యం చెర విడిపియ్యవా!



దిల్లీలోని యమునా నదిలో కాలుష్యపు నురగల మధ్యే బుధవారం ప్రార్థనలు చేస్తున్న ఓ మహిళ

రేషన్ ఇవ్వకూడదనే నిర్ణయం లేదు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్మార్ట్ పల్స్ సర్వేలో పేరు నమోదు కాని వారికి రేషన్ ఇవ్వరాదనే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోలేదని ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు బుధవారం అసెంబ్లీలో తెలిపారు. రాష్ట్రంలో 1,38,38,892 కుటుంబాల పేర్లను సర్వేలో నమోదు చేసినట్లు చెప్పారు

ఆర్టీసీపై ఎలాంటి ప్రతిపాదనలేదు: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకునే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని రవాణాశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు.

పంచాయతీలుగా మార్చడం సాధ్యపడదు: రాష్ట్రంలో 500 జనాభా కలిగిన తండాలు 129, గిరిజన ఆవాసాలు 173 ఉన్నట్లు సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు తెలిపారు. వీటిని పంచాయతీలుగా మార్చేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో సాధ్యపడదని వెల్లడించారు. నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలనుకునే వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు.

సెన్సెక్స్ ▲ 139 **33136**

నిఫ్టీ ▲ 31 **10155**

బంగారం 30,450 ▲ (ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత) రూ.లలో 50

వెండి 38,000 ▼ ముంబయిలో కిలో రూ.లలో 20

రూపాయి 65.21 ▼ (ఒక అమెరికా డాలరుకు) 01 పైసలు

ముడి చమురు 69.09 ▲ (బ్రెంట్ ధర డాలర్లలో)



ఘనం (+)

నిఫ్టీ	21న	మార్పు %
BHARTI AIRTEL	418.20	4.45
BAJAJ FINANCE	1704.55	2.85
NTPC	170.35	2.37
ULTRATECH CEM	3999.20	1.59
INDIABULLS HSG FIN	1216.40	1.51
BPCL	430.65	1.35
L & T	1309.35	1.23
HDFC BANK	1858.90	1.05

గ్రహణం (-)

నిఫ్టీ	21న	మార్పు %
TATA STEEL	582.25	-1.81
ADANI PORT	363.70	-1.70
BOSCH	17585.65	-1.63
TATA MOTORS	333.85	-1.46
ZEE ENTERTAINMENT	566.85	-1.43
HERO MOTOCORP	3463.60	-1.43
BHARTI INFRATEL	337.15	-1.39
EICHER MOTORS	27980.85	-1.34


విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)



కరెన్సీ	కొనుగోలు	అమ్మకం			
అమెరికా డాలరు	59.33	68.79	బహ్రెయిన్ దీనార్	160.67	184.12
పౌండ్ స్టెర్లింగ్	83.14	96.41	కువైట్ దీనార్	179.70	223.71
యూరో	72.75	84.37	ఒమన్ రియాల్	157.34	180.00
జపనీస్ యెన్/100	55.73	64.62	సౌదీ రియాల్	15.77	18.69
ఆస్ట్రేలియా డాలరు	45.62	52.78	యూఏఈ దిర్హమ్	16.15	18.87
సింగపూర్ డాలరు	45.00	53.32	మలేషియా రింగిట్	14.80	18.19
థాయ్ బాత్/100	190.04	227.22	చైనీస్ యువాన్	7.29	11.82

బుధవారం నిఫ్టీ కదలికలు



చిత్తూరు ప్లాంటుపై రూ.100 కోట్ల పెట్టుబడి

కర్లాన్ సీఎండీ సుధాకర్ పాయ్

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు చిత్తూరులో కర్లాన్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామనీ, దీనికోసం రూ.100 కోట్ల పెట్టుబడి పెడతామని కర్లాన్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ టి.సుధాకర్ పాయ్ తెలిపారు. ఈ ఏడాదిలోనే ఇది ప్రారంభంకానుందని చెప్పారు. దీనివల్ల ప్రత్యక్షంగా 1000మందికీ, పరోక్షంగా 3వేల మందికి పైగా ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. తెలంగాణలో కూడా ప్లాంటును ఏర్పాటు చేసే ఆలోచనతో ఉన్నట్లు తెలిపారు. రెండు రాష్ట్రాల్లో పారిశ్రామికాభివృద్ధికి మంచి అవకాశాలున్నాయనీ, ప్రభుత్వాల ప్రోత్సాహం బాగుందన్నారు. మొత్తం ఫర్నిచర్ వ్యాపార రంగం టర్నోవర్ రూ.లక్ష కోట్ల వరకూ ఉండగా ఇందులో 20శాతం వరకూ వ్యవస్థీకృత రంగంలో ఉండగా.. 80శాతం వరకూ అవ్యవస్థీకృత రంగంలోనే ఉందని పేర్కొన్నారు. జీఎస్టీ వల్ల పరుపులు, ఇతర ఫర్నిచర్ వస్తువుల ధరల్లో కొంత దిద్దుబాటు వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా కర్లాన్‌కు 800 ప్రత్యేక ఔట్‌లెట్లు ఉండగా.. రానున్న 18 నెలల్లో మరో 800 ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఆరంభ జోరుకు కళ్లెం

- రాణించిన టెలికాం షేర్లు
- సెన్సెక్స్‌కు 139 పాయింట్ల లాభం



సూచీల లాభాలు వరుసగా రెండో రోజూ కొనసాగాయి. టెలికాం, బ్యాంకింగ్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడం ఇందుకు దోహదపడింది. అయితే గరిష్ఠ స్థాయిల వద్ద మదుపర్ల లాభాల స్వీకరణతో సూచీల లాభాలు పరిమితమయ్యాయి. షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు దోహదపడ్డాయి. అమెరికా ఫెడ్ సమావేశం నిర్ణయాలు వెలువడనుండటంతో మదుపర్లు ఆచితూచి వ్యవహరించారు. ఆసియా షేర్లు మిశ్రమంగా ముగియగా, ఐరోపా మార్కెట్లు అదే ధోరణిలో ట్రేడయ్యాయి.

సెన్సెక్స్ ఉదయం 33,090.82 పాయింట్ల వద్ద దూకుడుగా ప్రారంభమైంది. అనంతరం అదే జోరు కొనసాగించిన సూచీ.. ఇంట్రాడేలో 33,354.93 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని నమోదు చేసింది. అయితే మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో ఆరంభ లాభాలు కొంత ఆవిరయ్యాయి. చివరకు 139.42 పాయింట్ల లాభంతో 33,136.18 వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ సైతం 30.90 పాయింట్లు పెరిగి 10,155.25 దగ్గర ముగిసింది. ఇంట్రాడేలో ఈ సూచీ 10,132.95- 10,227.30 పాయింట్ల మధ్య కదలాడింది.

చక్కెర షేర్ల జోరు: ఎగుమతులను ప్రోత్సహించడానికి ముడి, శుద్ధి చేసిన చక్కెరపై ఉన్న 20 శాతం ఎగుమతి సుంకాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో చక్కెర కంపెనీల షేర్లు రాణించాయి. బీఎస్ఈలో బలరాంపూర్ చీనీ 8.90%, కేసీపీ షుగర్ 5.28%, గాయత్రీ షుగర్స్ 2.54%, మవానా షుగర్స్ 1.70%, దాల్మియా భారత్ షుగర్ 1.20%, రానా షుగర్స్ 1.02%, ధంపూర్ షుగర్ 0.90%, ద్వారికేశ్ షుగర్ 0.72% చొప్పున లాభాలు నమోదు చేశాయి.

సెన్సెక్స్ 30 షేర్లలో 17 లాభాలతో ముగిశాయి. భారతీ ఎయిర్‌టెల్ 4.61%, ఎన్‌టీపీసీ 2.47%, ఎల్ అండ్ టీ 1.14%, హెచ్‌డీఎఫ్‌సీ 1.05%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1%, మారుతీ సుజుకీ 0.90%, ఇండస్‌ఇండ్ బ్యాంక్ 0.88%, యాక్సిస్ బ్యాంక్ 0.85%, ఎం అండ్ ఎం 0.80% చొప్పున రాణించిన వాటిలో ఉన్నాయి. టాటా స్టీల్ (1.85%), టాటా మోటార్స్ (1.58%), అదానీ పోర్ట్స్ (1.44%), హీరో మోటోకార్ప్ (1.25%), సన్ ఫార్మా (0.82%)లు నష్టాలు చవిచూశాయి. రంగాల వారీ సూచీల్లో టెలికాం 2.36% రాణించింది. స్థిరాస్తి, యంత్ర పరికరాలు, టెక్, విద్యుత్, చమురు- గ్యాస్, మౌలిక, ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లు అదే బాటలో నడిచాయి. లోహ, ఆరోగ్య సంరక్షణ, వాహన షేర్లు మాత్రం డీలాపడ్డాయి.

మిధానీ ఐపీఓకు రేపటి వరకూ గడువు

తొలి రోజు 26% షేర్లకు దరఖాస్తు

ఈనాడు, హైదరాబాద్: రక్షణ, అంతరిక్షం, విద్యుత్ తదితర రంగాల్లో వినియోగించే ప్రత్యేక లోహ మిశ్రాల తయారీ, అభివృద్ధిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న మిశ్రధాతు నిగమ్ (మిధానీ) పబ్లిక్ ఇష్యూకు తొలి రోజున 26 శాతం స్పందన లభించింది. 4,87,08,400 షేర్లను కేటాయించడానికి కంపెనీ ఇష్యూకు రాగా.. తొలి రోజు 1,25,20,350 షేర్ల కోసం దరఖాస్తులు అందినట్లు ఎక్స్ఛేంజీల వద్ద ఉన్న సమాచారం ద్వారా తెలుస్తోంది. రిటైల్ ఇన్వెస్టర్ల విభాగంలో 11 శాతం షేర్లకు, అర్హులైన సంస్థాగత కొనుగోలుదారుల (క్యూఐబీ) విభాగంలో 46 శాతం షేర్లకు దరఖాస్తు చేశారు. ఇష్యూ 23న ముగుస్తుంది. దరఖాస్తుకు రూ.10 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.87-90 ధర శ్రేణిని నిర్ణయించారు. ఇష్యూ 23 వరకూ ఉంటుంది. 25 శాతానికి సమానమైన వాటాను విక్రయించడం ద్వారా దాదాపు రూ.438 కోట్లు సమకూర్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ఆర్థిక సంవత్సరానికి రూ.833 కోట్ల టర్నోవరుపై రూ.126 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. కంపెనీ పనితీరును పరిగణనలోకి తీసుకుంటే.. ఇష్యూ ధర ఆమోదయోగ్యంగా ఉందని.. దీర్ఘకాలానికి ఈ ఇష్యూలో మదుపు చేయొచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

చౌక గృహాల నిర్మాణంలోకి ఏటీఎస్

- హోమ్‌క్రాఫ్ట్ పేరుతో కొత్త సంస్థ

ముంబయి: ఖరీదైన గృహాలను నిర్మించే ఏటీఎస్ గ్రూపు.. అందుబాటు గృహ నిర్మాణ రంగంలో కూడా అడుగుపెట్టింది. ఇందుకుగాను 'హోమ్‌క్రాఫ్ట్' పేరుతో కొత్త సంస్థను ఏర్పాటుచేసింది. దీని ద్వారా వచ్చే 3-5 ఏళ్లలో రూ.4,000-5000 కోట్ల ఆదాయాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఓ వైపు ఖరీదైన గృహాలపై దృష్టి సారించడాన్ని కొనసాగిస్తూనే, హోమ్‌క్రాఫ్ట్ ద్వారా ప్రత్యేకంగా మధ్యతరగతి ప్రజల కోసమే గృహాలను అందుబాటులోకి తెస్తామని ఏటీఎస్ ఒక ప్రకటనలో తెలిపింది. 'తొలుత దిల్లీ ఎన్‌ఎస్‌ఆర్ ప్రాంతంలో రూ.30-70 లక్షల ధరల శ్రేణిలో అపార్ట్‌మెంట్ల నిర్మాణాన్ని చేపడతాం. ఆ తర్వాత మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం. వచ్చే 3-5 ఏళ్లలో 6000-6500 గృహాలను విక్రయించాలని అనుకుంటున్నాం. తద్వారా రూ.4,000- 5,000 కోట్ల ఆదాయం వస్తుందని భావిస్తున్నామ'ని హోమ్‌క్రాఫ్ట్ ముఖ్య ఆర్థిక కార్య నిర్వహణ అధికారి (సీఈఓ) ప్రసూన్ చౌహాన్ తెలిపారు. అందుబాటు గృహ నిర్మాణ ప్రాజెక్టుల అభివృద్ధి నిమిత్తం రూ.1,500-2,000 కోట్లను ఏటీఎస్ పెట్టుబడిగా పెట్టనుంది. ఈ నిధుల్లో కొంత మొత్తాన్ని అంతర్గతంగాను, మిగిలింది రుణాలు, ప్రైవేట్ ఈక్విటీ ఫండ్ల రూపంలో సమీకరించనుంది.

మహిళలు శ్రామిక శక్తిగా ఎదగాలి

- ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు ఎన్నో అవకాశాలు
- సీఐఐ కార్యక్రమంలో ఐడబ్ల్యూఎన్ ఛైర్ ఉమన్ సుచిత్ర ఎల్లా

ఈనాడు, హైదరాబాద్: మహిళలు అన్ని రంగాల్లోనూ ఉన్నత శిఖరాలు అధిరోహించేందుకు అవసరమైన తోడ్పాటును అందించేందుకు సీఐఐ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ (ఐడబ్ల్యూఎన్) ఎప్పటికప్పుడు కృషి చేస్తోందని ఐడబ్ల్యూఎన్ ఛైర్‌ఉమన్, భారత్ బయోటెక్ సహ వ్యవస్థాపకురాలు, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సుచిత్ర ఎల్లా అన్నారు. మహిళలందరూ ఒక బృందంగా ఏర్పడి, వారి ఆలోచనలు పంచుకోవడానికి ఇది ఒక వేదిక అని పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లో సీఐఐ అనుబంధ ఇండియన్ ఉమెన్ నెట్‌వర్క్ ఐదో వార్షికోత్సవం జరిగింది. మహిళా పారిశ్రామికవేత్తల ఆధ్వర్యంలో ప్రారంభమైన ఐడబ్ల్యూఎన్ మహిళల్లో విద్య, ఆరోగ్య సంరక్షణ, విధానాల రూపకల్పన తదితర అంశాల్లో కృషి చేస్తోంది. దేశంలోని 14 రాష్ట్రాలు, 1 కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం ఐదు జోన్లుగా విభజించి సేవలను అందిస్తోంది. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ.. మహిళలు కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తూనే.. ఉద్యోగ, వ్యాపారాల్లోనూ రాణిస్తున్నారన్నారు. గతంలో వారికి సరైన మార్గనిర్దేశకత్వం లేదనీ.. కానీ, ఇప్పుడు వారికి అవసరమైన సేవలను అందించేందుకు ఐడబ్ల్యూఎన్ ముందుంటోందన్నారు. పని ప్రదేశంలో మహిళలకు అవసరమైన రక్షణ చర్యలు చేపట్టేలా చూడటం, న్యాయ సేవలను అందించడంతో పాటు, పలు రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో మహిళలకు సంబంధించిన పాలసీలను రూపొందించడంలోనూ ఐడబ్ల్యూఎన్ కీలకంగా మారిందని పేర్కొన్నారు. పని చేసే చోట మహిళలు, పురుషులూ సమానమనే భావన ఇంకా పెరగాలన్నారు. మహిళలు పలు కారణాల వల్ల ఉద్యోగాలకు విరామం ఇస్తున్నారనీ, ఇలాంటప్పుడు వారు ఆయా రంగాల నుంచి దూరం కాకుండా, తిరిగి పని చేసేందుకు ప్రోత్సహించే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కేవలం రాజధాని నగరాల్లోనే కాకుండా.. ద్వితీయ శ్రేణి నగరాల్లోని మహిళా పారిశ్రామికవేత్తలతోనూ కలిసి పనిచేస్తున్నామన్నారు. సీఐఐ వెబినార్ ప్లాట్‌ఫాంను ఉపయోగించుకొని, దేశంలోని పలు ప్రాంతాల్లోని మహిళలతో అనుసంధానం అవుతున్నట్లు తెలిపారు. సెయింట్ గోబైన్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ బి.సంతానం మాట్లాడుతూ.. దేశంలో ఉన్న మహిళలందరూ శ్రామిక శక్తిగా (వర్క్‌ఫోర్స్) మారితే జీడీపీలో 700 బిలియన్ డాలర్లు పెరుగుతుందని, ఇది 35శాతం అధికమన్నారు. దేశంలో మిగతా రాష్ట్రాలతో పోలిస్తే.. దక్షిణాది నుంచి అధిక సంఖ్యలో మహిళా పారిశ్రామికవేత్తలున్నారని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించిన మహిళల్లో 70శాతం వరకూ అటు ఉద్యోగాల్లో చేరడం లేదు.. ఇటు పారిశ్రామిక రంగంలోకి రావడం లేదని, ఈ ధోరణి మారాల్సిన అవసరం ఉందన్నారు. చదువుకునేప్పుడే.. నేను ఏదైనా కంపెనీలో ఉద్యోగం చేయాలా.. లేక పారిశ్రామికవేత్తగా మారాలా అని ఆలోచించుకోవాలని సూచించారు. దేశంలో పెద్ద కంపెనీల్లో కూడా మధ్యస్థాయి యాజమాన్యంలో మహిళా ప్రాతినిధ్యం తక్కువగానే ఉండటం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. మహిళలు ప్రసూతి, కుటుంబ సభ్యులను చూసుకోవాల్సి రావడం తదితర కారణాలతో ఉద్యోగాలు వదిలేస్తున్నారనీ, ఇలా చేయకుండా.. దీర్ఘకాలిక సెలవులో వెళ్లడం గురించి ఆలోచించాలని, కంపెనీలు కూడా వీరికి ఎప్పటికప్పుడు సంస్థలో ఏం జరుగుతోందన్న సమాచారాన్ని పంపిస్తూ ఉండాలని సూచించారు. 2030కల్లా 30శాతం కంపెనీల్లో ఉన్నతోద్యోగులు, 30శాతం పారిశ్రామికవేత్తలు, 50శాతం వరకూ ప్రారంభ ఉద్యోగాల్లో మహిళలే ఉంటారన్నారు. వోల్వో ఇండియా ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమల్ బాలి మాట్లాడుతూ.. ఓడిపోతామేమో అనే ఒక తెలియని భయమే పారిశ్రామికవేత్తలుగా మారకుండా అడ్డుకుంటోందని దీన్ని అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. కర్లాన్ సీఎండీ టి.సుధాకర్ పాయ్, ఐడబ్ల్యూఎన్ సదరన్ రీజియన్ ఛైర్‌ఉమన్ ఎలెక్ట్ వైస్ ఛైర్‌పర్సన్ వనితాదాట్ల, ఐడబ్ల్యూఎన్ తెలంగాణ ఛైర్‌ఉమన్ శోభా దీక్షిత్, ఐడబ్ల్యూఎన్ సదరన్ రీజియన్ డిప్యూటీ ఛైర్‌ఉమన్ రీనా వివేకానంద, పలు సంస్థలకు చెందిన ఉన్నతోద్యోగులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.




ఐడబ్ల్యూఎన్ వార్షిక నివేదికతో వనితా దాట్ల, శోభా దీక్షిత్, సుధాకర్ పాయ్, సుచిత్ర ఎల్లా, బి.సంతానం, కమల్ బాలి, రీనా వివేకానంద

తెలుగు రాష్ట్రాల్లో ఫ్లాట్ గ్లాసు తయారీ కేంద్రం?

సెయింట్ గోబైన్ ఫ్లాట్ గ్లాస్ ఎండీ బి.సంతానం

ఈనాడు, హైదరాబాద్: గాజు తయారీ సంస్థ సెయింట్ గోబైన్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో ఏదో ఒక చోట ఉత్పత్తి కేంద్రాన్ని ప్రారంభించే ఆలోచనల్లో ఉందని సంస్థ ఫ్లాట్ గ్లాస్ విభాగం ఎండీ బి.సంతానం వెల్లడించారు. అయితే, ఎక్కడ ఏర్పాటు చేయాలన్న విషయంలో ఇంకా స్పష్టత రాలేదని పేర్కొన్నారు. దీనికోసం రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టే అవకాశం ఉందన్నారు. దీనివల్ల దాదాపు 500-600 మందికి ఉద్యోగావకాశాలు ఉంటాయని తెలిపారు. చెన్నైలో ఉన్న ప్లాంటులో మరో రూ.1,000 కోట్లు పెట్టుబడి పెట్టబోతున్నట్లు చెప్పారు. నిర్మాణాల సంఖ్య పెరగడం, అందులో గాజు వినియోగం పెరగడంతో ఈ రంగంలో వృద్ధి బాగుంటోందని తెలిపారు. 20 ఏళ్లుగా ఏటా 11శాతం వృద్ధి రేటు ఉందని తెలిపారు.

21న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)



(100కు రూపాయలలో)

కోడిగుడ్లు			
హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	325
బెంగళూరు	365	చెన్నై	370
22వ తేదీకి		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	317	నమక్కల్	360

ఇక విశాఖ ఉక్కు లాభాల బాట

- 2018-19లో 6.3 మిలియన్ టన్నుల ఉత్పత్తే లక్ష్యం
- నోడల్ కేంద్రంగా అమరావతి రీజియన్
- సంస్థ సీఎండీ మధుసూదన్ వెల్లడి

ఈనాడు డిజిటల్, అమరావతి: గడిచిన మూడేళ్లుగా ఉన్న తీవ్ర సంక్షోభాన్ని అధిగమిస్తూ 2018-19 ఆర్థిక సంవత్సరం నుంచి వైజాగ్ ఉక్కు కర్మాగారం లాభాల బాట పట్టనున్నట్లు సీఎండీ మధుసూదన్ స్పష్టం చేశారు. మార్కెట్ పెరగడంతో పాటు ఉత్పత్తి పెరగనున్న దృష్ట్యా ఆర్ఐఎన్ఎల్ లాభాల బాట పడుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అమరావతి రీజియన్‌ను చుట్టుపక్కల ప్రాంతాలకు నోడల్ పాయింట్‌గా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందుకు అవసరమైన భూమి(20 ఎకరాలు) కోసం ప్రభుత్వానికి నివేదించినట్లు చెప్పారు. బుధవారం విజయవాడలో వినియోగదారులతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ "వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ని 12 వేల కోట్లతో వ్యయంతో 3 మిలియన్ టన్నులు సామర్థ్యం నుంచి 6.3 మిలియన్ టన్నులకు విస్తరిస్తున్నాం. 2017-18 ఏడాదిలో లిక్విడ్ స్టీల్ ఉత్పత్తి 5 మిలియన్ టన్నులు దాటనుంది. గతేడాదితో పోలిస్తే 18 శాతం వృద్ధి సాధించాం. 2018-19లో 6.3 మిలియన్ టన్నుల ఉతత్తే లక్ష్యంగా ప్రణాళికలు రచిస్తున్నాం. అమ్మకాల్లో కూడా 16 వేల కోట్లకు చేరుకున్నాం. గతేడాదితో పోలిస్తే అమ్మకాల్లో 35 శాతం వృద్ధి సాధించాం" అన్నారు. 2017-18లో రా మెటీరియల్ కాస్ట్ పెరిగినా వృద్ధిని నమోదు చేశామన్నారు.

పెరగనున్న ఉత్పత్తి సామర్థ్యం: "4 వేల కోట్లతో ప్లాంట్ ఆధునీకరణ పనులను చేపట్టాం. ఫలితంగా ఉత్పత్తి సామర్థ్యం 1 మిలియన్ టన్ను పెరగనుంది. ఇది 19-20 ఏడాది నుంచి వృద్ధిలో కనిపించనుంది. మూడు నాలుగేళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా మార్కెట్ మందకొడిగా ఉంది. 2017-18లో 5 శాతం స్టీల్ కన్‌జంప్షన్ సాధించాం. 2018-19 ఏడాదిలో ఇది 6 శాతంగా ఉంటుంది" అని సీఎండీ చెప్పారు. మూడు నాలుగు నెలలుగా అమ్మకాల తీరు పెరిగిందన్నారు. 2017-18లో స్టీల్ ప్లాంట్ ఆపరేటింగ్ మార్జ్ 200 కోట్లకు చేరినట్లు వివరించారు. వాల్యూమ్ పెరిగిన దృష్ట్యా మార్కెట్ మీద దృష్టి పెట్టాం. కొత్త మార్కెట్లపై దృష్టి సారించాం. ఇప్పటికే అమరావతి రీజియన్‌లో ఏర్పాటు చేసిన శాఖ ద్వారా 1.40 లక్షల టన్నులు అమ్మకాలు చేశాం. వచ్చే ఏడాది 2 లక్షలు లక్ష్యంగా పెట్టుకున్నాం. నార్త్ ఈస్ట్‌లో నిర్మాణ పనులు ఎక్కువ ఉన్నందున అక్కడ కూడా కొత్త శాఖ ఏర్పాటుపై దృష్టి సారించామన్నారు. త్వరలో గౌహతిలో విక్రయ కేంద్రాన్ని ఏరాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రత్యేకమైన వెబ్‌పేజీని ఏర్పాటు చేసి ఈ-ప్లాట్‌ఫారమ్‌ను కూడా వినియోగించుకోవాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. "ఉత్పత్తి పెరిగిన దృష్ట్యా రవాణాను కూడా పెంచాల్సిన అవసరం ఉంది. డిమాండ్ ఉన్నపుడు సరుకు అందుబాటులో ఉంచేందుకుగాను చర్యలు తీసుకుంటున్నాం. రైల్వే రవాణాపై ఎక్కువగా ఆధారపడకుండా నదులు, సముద్రాలు, రోడ్డు మార్గాల ద్వారా రవాణాను కూడా ప్రారంభించాం" అని అన్నారు.

మార్కెట్ కబుర్లు

- ✦ తమిళనాడులోని ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ నుంచి 2100 బస్సుల సరఫరా నిమిత్తం రూ.321 కోట్ల ఆర్డరును దక్కించుకున్నట్లు హిందుజా గ్రూప్ దిగ్గజ కంపెనీ **అశోక్ లేలాండ్** తెలిపింది.
- ✦ గుజరాత్‌లోని కంపెనీకి చెందిన ఫార్ములేషన్ ప్లాంటుకు యూఎస్ఎఫ్‌డీఏ మూడు అభ్యంతరాలను తెలిపినట్లు **అలెంబిక్ ఫార్మా** తెలిపింది.
- ✦ ఆంధ్రప్రదేశ్, గుజరాత్‌లలో రూ.1567.92 కోట్ల విలువైన రెండు రోడ్డు ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఎన్‌హెచ్ఏఐ నుంచి దక్కించుకున్నట్లు **సద్భవ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్** వెల్లడించింది.
- ✦ వాహనాల సీట్లను తయారీ చేసే అంతర్జాతీయ దిగ్గజం **ఏడియంట్**, **అరవింద్‌**లు భారత్‌లో వాహనాలకు సంబంధించిన ఫ్యాబ్రిక్‌ను తయారు చేసి, విక్రయించడానికి సంయుక్త సంస్థను ఏర్పాటు చేయనున్నాయి.
- ✦ **మైండ్‌ట్రీ**లో ఉన్న 3.34 శాతం వాటా(54,69,750 షేర్లు)కు సంబంధించి తమ ప్రమోటరు వి.జి. సిద్ధార్థ కంపెనీకి అనుగుణంగానే ఓటు వేస్తారని **కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్** తెలిపింది.
- ✦ రిపబ్లిక్ ఆఫ్ కొరియాకు చెందిన హెచ్ఎల్‌బీ పవర్‌తో సాంకేతిక సహకార ఒప్పందం(టీసీఏ) కుదుర్చుకున్నట్లు **భెల్** పేర్కొంది.
- ✦ లాజిస్టిక్స్, సరఫరా కార్యకలాపాలతో పాటు ఇతర కార్యకలాపాల్లో సహకారాన్ని అందించుకోవడం కోసం **టాటా గ్రూప్‌**తో చర్చలు చేపట్టామని **డీపీ వరల్డ్** పేర్కొంది.
- ✦ **సంధార్ టెక్నాలజీస్** పబ్లిక్ ఇష్యూకు బిడ్డింగ్ చివరి రోజైన బుధవారం 6.18 రెట్ల స్పందన లభించింది.
- ✦ అనుబంధ సంస్థ మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను బలోపేతం చేయడం కోసం రూ.5000 కోట్ల నిధులను సమీకరించడానికి **మాక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్** బోర్డు డైరెక్టర్లు అంగీకారం తెలిపారు.
- ✦ బీమా విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవడం కోసం సైనోస్యూర్‌ను 33 మి.డాలర్లతో కొనుగోలు చేయనున్నట్లు **జెన్సార్** పేర్కొంది.
- ✦ ప్లేక్ సొరియాసిస్(సొరియాసిస్‌లో ఒక రకం) చికిత్సకు ఉపయోగించే ఇల్యూమ్యా ఔషధానికి యూఎస్ఎఫ్‌డీఏ నుంచి ఆమోదం లభించినట్లు **సన్‌ఫార్మాసూటికల్ ఇండస్ట్రీస్** తెలిపింది.
- ✦ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్‌కు కొన్ని ఆస్తులను విక్రయించడంతో పాటు కొన్ని స్థిరాస్తులను నగదీకరించుకోవడానికి వాటాదార్లు భారీ మెజారిటీతో అంగీకారం తెలిపారని **ఆర్‌కామ్** వెల్లడించింది.
- ✦ పూర్తి స్థాయి అనుబంధ సంస్థ అయిన ఆల్‌బ్యాంక్ ఫైనాన్స్‌ను విలీనం చేసుకోవడానికి కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అనుమతులు ఇచ్చినట్లు **అలహాబాద్ బ్యాంక్** తెలిపింది.
- ✦ **ఐటీఐ లిమిటెడ్‌**లో 18 కోట్ల షేర్లను ఫాలోఆన్ పబ్లిక్ ఆఫర్ ద్వారా విక్రయించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

ఎన్ఎస్ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ADANI PORT & 363.70 (370.00) 2296120
AMBUJA CEMEN 229.85 (230.40) 2202091
ASIAN PAINTS 1103.55 (1106.50) 612237
AUROBIND PHA 564.20 (571.60) 1924040
AXIS BANK LT 526.30 (521.10) 5518826
BAJAJ AUTO L 2851.80 (2873.00) 231405
BAJAJ FINANC 1704.55 (1657.30) 1131098
BHARTI AIRTE 418.20 (400.40) 8351422
BHARTI INFRA 337.15 (341.90) 2825185
BOSCH LTD 17585.65 (17876.75) 13341
BPCL 430.65 (424.90) 2900337
CIPLA 551.05 (552.90) 3091963
COAL INDIA L 270.90 (270.25) 2739537
DR. REDDYS 2141.70 (2157.15) 369060
EICHER MOTOR 27980.85 (28360.45) 34171
GAIL 435.05 (438.50) 3550371
HCL TECH 937.35 (937.20) 1909490
HDFC 1817.85 (1800.05) 3574861
HDFC BANK 1858.90 (1839.50) 1480285
HERO MOTOCOR 3463.60 (3513.80) 667122
HINDALCO IND 214.70 (217.30) 8817896
HINDUSTAN UN 1315.60 (1313.25) 1698614
HPCL 353.30 (354.85) 1806597
ICICI BANK 289.20 (292.00) 13618228
INDIABULLS H 1216.40 (1198.30) 1669886
INDIAN OIL 172.45 (173.85) 11840058
INDUSINDBANK 1731.45 (1716.65) 1456002
INFOSYS LTD 1167.50 (1164.55) 3846497
ITC 259.05 (259.20) 12920867
KOTAK MAHIND 1051.10 (1045.30) 1741161
LARSEN & TOU 1309.35 (1293.50) 2835466
LUPIN 767.85 (771.75) 758910
M&M 745.35 (740.95) 2788242
MARUTI SUZIK 8874.65 (8802.40) 516020
NTPC LTD 170.35 (166.40) 5721685
ONGC 175.55 (174.10) 4055822
POWER GRID C 194.20 (194.90) 5442271
RELIANCE IND 896.90 (889.80) 6727261
SBI 248.00 (249.10) 19533972
SUN PHARMA 504.50 (508.75) 3986735
TATA CONSULT 2856.75 (2864.85) 1953839
TATA MOTORS 333.85 (338.80) 6812442
TATA STEEL L 582.25 (593.00) 11939451
TECH MAHINDR 625.85 (633.40) 2428150
ULTRATECH 3999.20 (3936.80) 205143
UPL LIMITED 714.90 (712.30) 1419662
VEDANTA LIMI 285.75 (287.10) 11337441
WIPRO 295.25 (293.60) 3143562
YES BANK LTD 300.75 (302.40) 13383435
ZEE ENTERTAI 566.85 (575.10) 1232152

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1297.00 (1304.70) 49317
ACC 1558.40 (1554.80) 216483
ASHOK LEYLAN 147.50 (146.00) 14925709
AVENUE SUPER 1339.60 (1346.50) 485353
BAJAJ FINSER 5131.50 (5080.85) 99953
BANK OFBAROD 135.60 (135.85) 14924805
BEL 148.35 (149.50) 2620187
BHEL 83.05 (84.10) 6618739
BRITANNIA 4834.45 (4825.05) 202332
CADILA HEALT 379.75 (385.45) 455866
COLGATE PALM 1042.90 (1040.65) 204119
CONTAINER 1184.65 (1185.15) 222257
CUMMINS INDI 742.80 (744.70) 205736
DABUR INDIA 322.45 (319.35) 1446774
DLF LIMITED 216.05 (215.40) 3574529
EMAMI LIMITE 1056.10 (1031.65) 212483
GLAXOSMI CON 6492.80 (6612.90) 4422
GLAXOSMI PHA 2224.50 (2226.05) 10632
GLENMARK PHA 545.10 (546.40) 316384
GODREJ CONSU 1076.55 (1068.45) 295646
HAVELLS INDI 498.80 (499.00) 878704
HINDUSTAN ZI 311.40 (313.00) 2405096
ICICI PRU LI 381.75 (371.20) 1657822
IDEA CELLULR 79.15 (77.15) 7205581
INTERGLOBE A 1267.05 (1242.95) 687114
JSW STEEL LT 288.40 (285.50) 3943743
LIC HOUS.FIN 521.55 (518.05) 2120541
MARICO LIMIT 325.80 (318.95) 3191086
MCDOWELL 3072.85 (3043.90) 321633
MOTHERSON 308.85 (304.90) 2214396
MRF 69966.45 (69593.05) 4761
NHPC LTD 26.40 (26.35) 5611048
NMDC LTD 120.95 (118.40) 9434073
OIL INDIA 332.25 (327.10) 377984
ORACLE FIN S 3828.75 (3797.85) 24038
P&G HYG&HEAL 9200.90 (9237.15) 1064
PETRONET LNG 235.50 (235.65) 1071337
PIDILITE IND 902.35 (902.70) 535727
PIRAMAL ENTE 2477.75 (2469.80) 194075
PNB 97.60 (96.85) 23276651
POWER FIN CO 89.00 (88.95) 8462253
RURAL ELEC C 130.10 (127.10) 4069037
SAIL 72.15 (72.25) 15705185
SHREE CEMENT 16117.55 (16423.75) 58927
SHRIRAM TRAN 1396.95 (1377.85) 627373
SIEMENS 1104.55 (1108.50) 200566
SUN TV LTD 872.85 (892.20) 1666802
TATA POWER 79.95 (80.35) 5279874
TITAN IND 872.25 (871.75) 1859947
TORRENT PHAR 1238.70 (1254.80) 208408

బీఎస్ఈలో రాష్ట్ర కంపెనీలు

ADITYA SPIN 8.70 (8.60) 1590
AISHWARYA TE 5.51 (5.80) 20896
ALPHAGEO 743.70 (747.05) 3113
AMAR RAJA BA 790.95 (783.05) 15099
ANDHRA BANK 43.05 (42.85) 432124
ANDHRA PAPER 294.90 (291.65) 57374
ANDHRA PETRO 56.80 (54.15) 138781
ANDHRA SUGAR 444.20 (436.40) 3532
ANJANI PORTL 182.45 (175.40) 305
ASTRA MICROW 81.65 (82) 54853
AUROBINDO PH 562.65 (571.05) 100287
AVANTEL SOFT 539.95 (517.65) 7659
AVANTI FEEDS 2269.85 (2290.80) 10471
AVON ORG 11.39 (10.85) 9014
BALAJI AMIN 584.45 (583.85) 3890
BARTRONICS 11.11 (11.16) 17809
BHAGIRA CHEM 286.40 (284) 244
BHAGYA NAG 45.60 (44.85) 39849
BN RATHI SEC 39.50 (39) 24055
BRILLIANT SE 10.09 (9.64) 227741
CAMBRIDGE TE 67.45 (68.80) 3034
CONT COFFEE 287.95 (287.80) 3846
COROMAN FERT 524.30 (518.65) 7632
CUBEX TUB 21 (22.10) 1480
CYBERMATE 2.88 (2.91) 28125
CYIENT LIMIT 651.80 (642.75) 27954
DECCAN CEMEN 532 (524.65) 75
DIVI'S LAB 1086.80 (1092.20) 24626
DR REDDY 2141.90 (2157.40) 25758
GATI CORPN 101.10 (100.20) 70534
GAYATRI PROJ 189.30 (186.80) 12466
GMR INFRASTR 17.90 (17.85) 1396879
GOLDST INFRA 183.05 (189.85) 41770
GOLDSTONE EN 13.15 (13.84) 24459
GRANULES (I) 107.30 (108.45) 59487
GSS AMERICA 58.10 (61.10) 99228
GVK POWER 14.70 (14.05) 1260062
HBL NIFE POW 47.75 (47.95) 75117
HERITAGE FOO 725.75 (719.55) 2996
HIL LTD 1566.45 (1519.40) 2099
HIND FLUROCA 9.16 (9.61) 750
IDL INDUSTRS 527.10 (517.75) 1866
ILFS ENGINEE 33.25 (34.50) 14764
INNAREDY COM 2.95 (3.10) 162075
IVRCL INFRAS 3.57 (3.62) 5621445
JEEVAN SCIEN 40.50 (41.95) 26610
KAKATIYA CEM 250.50 (257.20) 3770
KALLAM SPG 31.50 (30.90) 189929
KAVERI SEED 475.30 (484) 19248
KCP LTD 114.50 (115.70) 9200
KERNEX MICRO 41.50 (40.15) 6377
KNR CONSTRUC 296.35 (290.10) 71246
KREBS BIO 167.45 (170.10) 1435
LANCO INDUS 321.40 (323.45) 12492
LANCO INFRAT 1.17 (1.23) 275186
LAURUS LABS 511.95 (514.05) 9608
LOKESH MACH 55.55 (54.15) 27421
MADHUCON PRO 22.25 (23) 62655
MEGA SOFT 12.78 (12.66) 24428
MIC ELECTRON 5.25 (5.52) 125814
MOLD-TEK.TEC 52.05 (53.15) 52257
MOLDTK PLA 311.70 (315.20) 4264
NAGARJAGRICH 41.65 (40.10) 16906
NATCO PHARMA 781.40 (778.25) 6116
NAVA BH VENT 135.60 (138.85) 33101
NCC 121.05 (121) 186636
NCL IND 222.80 (224.05) 6466
NEHA INTER 6.50 (6.25) 12718
NEULAND LAB 717.30 (715.30) 4075
NIHAR INFO 14.10 (14.80) 575
OIL COUNTRY 36.30 (34.25) 247929
PANYAM CEMEN 41.65 (41.95) 27710
PENNER IND 53.85 (52.90) 35838
PHYTOCHEM I 63.55 (64.15) 4576
PIONEER DIST 176.30 (178.80) 728
PITTI LAMIN 84.85 (85) 7494
POKARNA 194.05 (192) 5135
PRAJAY ENGS 12.16 (12.21) 12093
PREMIER EXPL 344.75 (346.05) 708
PRISM CEMENT 115.40 (114.60) 2511537
PRUDENTL PHA 3.82 (3.90) 279686
RAASI REFRAC 3.90 (4.09) 50
RAGSAN PETRO 62 (61.50) 700
RAIN INDUSTR 387.95 (383.45) 238462
RAJ PACKAGIN 37.25 (38.75) 17750
RAM INFORMAT 41.40 (40.05) 1417
SAGAR CEM 896 (896.15) 473
SAMKRG PIST 282.70 (283.40) 7583
SATVAH. ISPA 19.65 (19.90) 8153
SMS PHARMA 76.15 (75.70) 10226
SPHERE GLOBA 33.60 (35) 199804
SREE RAYAL A 52.10 (52.70) 138405
SRI KPR INDU 24.75 (26) 627
SRINIVASA SH 56.70 (56.50) 5958
STEEL EXCHAN 26.15 (25.65) 35355
SUJANA METAL 1.10 (1.15) 39443
SUJANA TOWER 3.60 (3.63) 3490
SUJANA UNIVE 0.77 (0.74) 634563
SURANA STRIP 2.38 (2.50) 1000
SURANA TELE 4.85 (4.90) 8434
SURYALAKSH.C 69.60 (69.05) 4551
SURYALATA SP 143 (144) 175
SURYAVA SPIN 6.58 (6.92) 119
SUVEN PHARMA 169.20 (167.65) 39733
TAJ GVK HOTE 160.40 (155.60) 2539
TANLA 33.20 (33.35) 68023
TERA SOFTWAR 42.60 (42.05) 15040
VAMSHI RUBB 47.95 (47.50) 8470
VICEROY HOTE 14.95 (14.95) 35823
VIMTA LABS 191.95 (195.60) 2634
VISAKA IND 674.75 (671.60) 5034
VISTA PHARMA 39.95 (39.60) 108346
VIVIMED LABS 76.60 (75.80) 158594
VST INDUS 2926.30 (2900.50) 109
YBRANT DIGIT 4.82 (4.93) 290605
ZENTECH 118.85 (120) 32602